# ది క్రైమ్ న్యూస్
Crime News
తెలుగు దినపత్రిక

ఆదివారం, మార్చి 16, 2025 | సంపుటి - 20 | సంచిక 165 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## బీజేపీసిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నాం

**జాకీ పెట్టిలేసినా బీఆర్ఎస్ లేవదు : బండిసంజయ్**



కరీంనగర్ : రాష్ట్రంలో పాలన అదుపు తప్పిదని.. కాంగ్రెస్‌కు పాలన చేతకావడం లేదని కేంద్ర మంత్రి బండిసంజయ్ అన్నారు. బీజేపీ నేత రాజాసింగ్ కామెంట్స్‌పై బండి సంజయ్ స్పందించారు. బీజేపీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీల మధ్య రహస్య సమావేశాలు జరిగి ఉండవచ్చని చెప్పారు. రాజాసింగ్ చేసిన కామెంట్లను తాను చూడలేదని బండి సంజయ్ అన్నారు. శనివారం కరీంనగర్‌లో బండి సంజయ్ పర్యటించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడారు. బీజేపీకి ఎవరితోనూ రహస్య ఎజెండాలు, సమావేశాలు ఉండవని బండి సంజయ్ స్పష్టం చేశారు. ఆరు గ్యారంటీలు.. బీజేపీని అడిగే ఇచ్చారా అని ప్రశ్నించారు. 2లో

# కేసీఆర్ అసెంబ్లీకి వస్తే కృష్ణాజలాలపై చర్చపెడదాం

## కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్



హైదరాబాద్ :

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చినప్పుడే కృష్ణా జలాలపై చర్చ పెడదామని అన్నారు. తాము తప్పు మాట్లాడినట్లు తేలితే క్షమాపణలు చెప్పేందుకు కూడా సిద్ధమని స్పష్టం చేశారు. అసెంబ్లీలో సీఎం మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా కేసీఆర్‌కు రూ.54.84 లక్షల జీతం ఇచ్చారని.. కానీ ఇప్పటి వరకు కేసీఆర్ రెండు సార్లు మాత్రమే అసెంబ్లీకి వచ్చారని తెలిపారు. రోజా ఇంట్లో కేసీఆర్ రొయ్యల పులుసు తిని.. రాయలసీమను రతనాల సీమ చేస్తామన్నారని గుర్తు చేశారు. ఒక్కసారి రొయ్యల పులుసు పెడితేనే రాయలసీమను రతనాల సీమ చేస్తా అని అన్నారని.. కానీ గుండెల్లో పెట్టుకుని మహబూబ్‌నగర్ ప్రజలు రాజకీయ భిక్షపెడితే గుండెల మీద తంతారా అని, ఎంపీగా గెలిపించిన పాలమూరు ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలోనే సాగర్‌కు సీఆర్‌పీఎఫ్ బలగాలు వచ్చాయని చెప్పు కొచ్చారు. సైలెంట్‌గా ఉన్న బీఆర్ఎస్.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తప్పుబడుతోందంటూ రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణా నీటి విషయంలో మరణశాసనం రాశారన్నారు. కేసీఆర్ కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని పెంచారని గుర్తుచేశారు. 2లో

## తెలంగాణ కోసం పదవులు వదులుకున్న చరిత్ర మాది

**పదవుల కోసం వెంపర్లాడిన వ్యక్తి ఉత్తమ్ : హరీష్ రావు**



హైదరాబాద్ : గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సమాధానం ఇస్తూ సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చేసిన ప్రసంగంపై మాజీ మంత్రి హరీశ్ విమర్శలు గుప్పించారు. అటు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై విమర్శలు చేశారు. అసెంబ్లీ లాబీలో మాట్లాడిన ఆయన.. పోతిరెడ్డిపాడుపై తాము 40 రోజులు కోట్లాడామని చెప్పారు. కిరణ్ కుమార్‌రెడ్డి తనకు మంత్రి పదవి ఇస్తాడనే ఆశతో ఉత్తమ్ కుమార్‌రెడ్డి నోరు మూసుకున్నాడని అన్నారు. తెలంగాణ హక్కుల కోసం పదవులు వదులుకున్న చరిత్ర తమదని, ద్రోహ చరిత్ర ఉత్తమ్‌దని చెప్పారు. కృష్ణా జలాలకు సంబంధించి సెక్షన్ 3 తీసుకొచ్చింది కేసీఆర్ అని హరీశ్‌రావు అన్నారు. కృష్ణా జలాల కోసం పోరాడింది తామని, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌ను వ్యతిరేకించింది తామేనని చెప్పారు. కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో పంటలు ఎండడానికి కారణం కాంగ్రెస్ పార్టేనని ఆరోపించారు. వారి చేతగాని తనంవల్ల పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. ఉత్తమ్ తప్పులు మాట్లాడి సభను తప్పు దోవ పట్టించారని ఆరోపించారు. 2లో

## 15 నెలల్లో రెండుసార్లు హాజరు

హైదరాబాద్ : 15 నెలలుగా అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకుండా జీతభత్యాలు పొందుతున్న ఏకైక ప్రతిపక్షనేత కెసిఆర్ అని సిఎం రేవంత్ రెడ్డి ఆగ్రహించారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై తెలంగాణ శాసన మండలిలో సీఎం రేవంత్ రెడ్డి సెటైర్లు వేశారు. కేసీఆర్ వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్నారా? లేక వర్క్ ఫ్రమ్ ఫామ్‌హౌసా? అంటూ ఎద్దేవా చేశారు. 2లో

## 57లక్షల జీతం మాత్రం జమ

**కెసిఆర్ గైర్హాజరుపై రేవంత్ మండిపాటు**

**సభకు వచ్చి చర్చల్లో పాల్గొనాలని సూచన**

**రేవంత్ వ్యాఖ్యలకు నిరసనగా మండలిలో బిఆర్ఎస్ వాకౌట్**

## రెండోసారి మళ్లీ నేనే ముఖ్యమంత్రిని

**చేసిన అభివృద్ధి పనులే గెలిపిస్తాయి**

**మీడియాతో సిఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్ : రెండో సారి కూడా తానే ముఖ్యమంత్రి అవుతానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శాసనమండలి వాయిదా అనంతరం ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 'మొదటి సారి భారాసపై వ్యతిరేకతతో ఓటు వేశారు. రెండో సారి మా మీద నమ్మకంతో ప్రజలు ఓటేస్తారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు 2లో



## రాజాసింగ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు

**రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే అసదుద్దీన్ దేశం వదిలిపోయేలా చేస్తామని ఘాటు వ్యాఖ్యలు**



హైదరాబాద్ : బీజేపీ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ దేశం వదిలిపోయేలా చేస్తామని హెచ్చరించారు. లేదా నేను బీజేపీలో జాయిన్ అవుతానని అసదుద్దీన్ ఒవైసీ తమ నేతల కాళ్లు పట్టుకుంటారని ఎద్దేవా చేశారు. రంజాన్ సందర్భంగా అసదుద్దీన్ ఒవైసీ లేనిపోని కామెంట్స్ చేస్తున్నారని మండిపడ్డారు. యూపీ తరహాలో తెలంగాణలో కూడా జమ్మికి నమాజ్ చేస్తే బాగుంటుంది అన్న యోగి ఆదిత్య నాథ్ మాటలకు అసదుద్దీన్ ఓవైసీకి కౌంటర్ ఇచ్చారు. నిన్న హోలీ ప్రశాంతంగా జరగకుడదని అసద్దుద్దీన్ ఒవైసీ కుట్ర చేశారని ధ్వజమెత్తారు. కమ్యూనల్ వయొలెన్స్ చేసి రాజకీయ లబ్ధి పొందాలని అసదుద్దీన్ ఒవైసీ చూస్తున్నారని రాజాసింగ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## వాస్తవాలు చెబితే బిఆర్ఎస్ తట్టుకోవడం లేదు

**అందుకే ఆగీ చేయాలని చూస్తున్నారు: మంత్రి సురేఖ**



హైదరాబాద్ : తెలంగాణ శాసన మండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీల తీరుపై రాష్ట్ర మంత్రి కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవాలను తెలుసుకోవడానికి బీఆర్ఎస్ భయపడుతోందని, ప్రజల ముందు తాము చేసిన తప్పులు బయటపడుతాయనే భయంతోనే అసలు విషయాలను దాచిపెట్టాలని ప్రయత్నిస్తున్నారని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న సమయంలో అడ్డుపడుతూ బీఆర్ఎస్ సభ్యులు అనవసరంగా అర్థం లేకుండా వ్యవహరించడం సబబు కాదని, ప్రజలు ఈ వ్యవహారాన్ని గమనిస్తున్నారని అన్నారు. 'బీఆర్ఎస్ సభ్యులు నిజాలను తెలుసుకోవాలంటే భయపడుతున్నారు. వారికీ వాస్తవాలు ఎదుర్కొనే ధైర్యం లేదు. అందుకే అసలు విషయాలను వినకుండా తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు,' అని కొండా సురేఖ అన్నారు. 'సభా సాంప్రదాయాలకు విరుద్ధంగా ప్రవర్తించడం సరైంది కాదు. నిరసన తెలుపాలంటే వాకౌట్ చేసి వెళ్లాలి, కానీ సభలోనే అరుస్తూ నినాదాలు చేయడం అసంబద్ధం. ఇది అసలు ప్రజాస్వామ్యానికి తగిన విధానం కాదని ఆమె అన్నారు. అంతకుముందు, సీఎం రేవంత్ రెడ్డి శాసన మండలిలో ప్రసంగిస్తున్న సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు నిరసన వ్యక్తం చేశారు. ఆయన ప్రసంగాన్ని అడ్డుకునేందుకు విస్తృతంగా నినాదాలు చేశారు. దీంతో అసెంబ్లీలో ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అనేక విషయాలను ప్రజలకు వివరించేందుకు ప్రయత్నించారు. అయితే, ఆయన ప్రసంగానికి అడ్డు తగిలేందుకు బీఆర్ఎస్ సభ్యులు ప్రయత్నించడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. 'నిజాలను దాచిపెట్టాలనే ఉద్దేశంతోనే బీఆర్ఎస్ సభ్యులు సభలో గందరగోళం సృష్టిస్తున్నారు. మిగతా 2లో

## భానుడు భగభగలు..

**రోజురోజుకూ మండిపోతున్న ఎండలు**

**పలు జిల్లాల్లో 41 డిగ్రీల ఉష్ణోగ్రలు నమోదు**

హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో రోజురోజుకూ ఎండలు మండిపోతున్నాయి. భానుడు భగభగలతో పలు జిల్లాల్లో ఉష్ణోగ్రలు 41 డిగ్రీలు దాటుతున్నాయి. ఇవాళ, రేపు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ మేరకు హైదరాబాద్, అమరావతి వాతావరణ కేంద్రాలు కీలక ప్రకటన విడుదల చేశాయి. 2

## విమానాశ్రయాల తరహాలో బేగంపేట రైల్వే స్టేషన్

**కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి**

**స్టేషన్‌లో పునరాభివృద్ధి పనులు ప్రారంభం**



హైదరాబాద్ : అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం వివిధ రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్‌తో కలిసి బేగంపేట రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రైల్వేలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని కిషన్‌రెడ్డి అన్నారు. త్వరలోనే బేగంపేట రైల్వే స్టేషన్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. మరో 10 శాతం పనులు పూర్తి కావాల్సి ఉందని, విమానాశ్రయాల తరహాలో రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. 2లో



## నా జీవితంలో ఎన్నో అలుపెరగని పోరాటాలు

**సహకరించండి.. మరింత అభివృద్ధి చేస్తాం**

**22 ఏళ్లలో రాష్ట్రాన్ని నెంబర్‌వన్ చేస్తా : నారా చంద్రబాబునాయుడు**

అమరావతి : జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన కొనసాగుతోంది. స్వచ్ఛ్ దివస్ కార్యక్రమంలో భాగంగా తణుకులో ఏర్పాటు చేసిన ప్రజావేదిక వద్ద ప్రజలతో సీఎం ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎంను ప్రజలు పలు ప్రశ్నలు వేశారు. దానికి చంద్రబాబు సమాధానం ఇచ్చారు. '47 ఏళ్ల క్రితం అసెంబ్లీకి వెళ్ళాను. 41 ఏళ్లుగా అసెంబ్లీకి వెళుతున్నాను. పదేళ్లు ప్రతిపక్ష నేతగా పనిచేశాను. నా జీవితం అంతా అలుపెరుగని పోరాటం. నా చివరి రక్తపు బొట్టు వరకు మీకు సేవ చేయాలనేదే నా సంకల్పం. ఇప్పటి వరకు ఎంత పనిచేశానో, రాబోయే 5, 10 ఏళ్లలో అంతకంటే రెట్టింపుగా పని చేస్తాను. మీ సహకారం ఇవ్వండి. రాబోయే 22 ఏళ్లలో మన రాష్ట్రాన్ని దేశంలో నెంబర్ వన్‌గా చేస్తాను' అని చంద్రబాబు తెలిపారు. అలాగే అడిగిన మరికొన్ని ప్రశ్నలకు కూడా

# కేసీఆర్ అసెంబ్లీకి వస్తే కృష్ణా జలాలపై చర్చ పెడదాం

కమీషన్ల కోసమే జూరాల నుంచి తీసుకోవాల్సిన నీళ్లను శ్రీశైలం బ్యాక్ వాటర్ ద్వారా తీసుకుంటామన్నది నిజం కాదా అని నిలదీశారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఉమ్మడి రాష్ట్రంలోనే 20 కి.మీ మేర పూర్తి చేశారని తెలిపారు. కేసీఆర్ పాలనలో ప్రాజెక్ట్ పనులే చేపట్టలేదన్నారు. ఎస్ఎల్‌బీసీ ప్రమాదంపై సానుభూతి చూపించాల్సిన బీఆర్ఎస్ నేతలు పైశాచిక ఆనందం పొందుతున్నారంటూ మండిపడ్డారు. 'మీ స్ట్రేచర్ గురించి ఉన్న ఆలోచన స్టేట్ ఫ్యూచర్ మీద లేదా. బీఆర్ఎస్ ఇప్పుడు మార్చురీలో ఉందని అన్నా.. తప్పేముంది. నేను కేసీఆర్‌ను కించపరిచినట్టు కేటీఆర్, హరీష్ రావు విమర్శిస్తున్నారు. కేసీఆర్ వందేళ్లు జీవించి ప్రతిపక్షంలోనే ఉండాలని కోరుకుంటున్నా' అంటూ సీఎం వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగ స్ఫూర్తితోనే వ్యవస్థలు ఏర్పడ్డాయని సీఎం అన్నారు. 2022 బడ్జెట్ సమావేశాలు గవర్నర్ ప్రసంగం లేకుండానే ప్రారంభించారని గుర్తుచేశారు. గత ప్రభుత్వానికి ప్రజాస్వామ్య విలువలు పాటించలేదని విమర్శించారు. మహిళా గవర్నర్‌ను గత ప్రభుత్వం అవమానించిందన్నారు. గవర్నర్ ప్రసంగం గాంధీభవన్‌లో కార్యకర్త ప్రసంగంలా ఉందని కొందరు తమ అజ్ఞానాన్ని బయట పెట్టుకున్నారని మండిపడ్డారు. గవర్నర్ ప్రసంగం కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకంగా ఉండదని.. తమ కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రజాపాలన అని స్పష్టం చేశారు. ప్రభుత్వాలు వ్యక్తుల ఆస్తి కాదన్నారు. బలహీనవర్గాలకు చెందిన మహిళా గవర్నర్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వం అవహేళన చేసిందంటూ వ్యాఖ్యలు చేశారు సీఎం. అయితే సీఎం మాట్లాడుతున్న సమయంలోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభ నుంచి వాకౌట్ చేశారు. కేసీఆర్‌పై సీఎం వ్యాఖ్యలకు నిరసనగా వాకౌట్ చేశారు. కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం ప్రసంగాన్ని వినబోమని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు. దీనిపై సీఎం స్పందిస్తూ.. బీఆర్ఎస్ నేతలు ఇలాగే వ్యవహరిస్తే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సున్నానే మిగులుతుందంటూ ఎద్దేవా చేశారు. కేబినెట్ ఆమోదం పొందిన అంశాలే గవర్నర్ ప్రసంగంలో ఉంటాయని తెలిపారు. కనీస అవగాహన లేకుండా విపక్ష నేతలు మాట్లాడుతున్నారన్నారు. ప్రజల కోసం విపక్షాలు సూచనలు చేస్తే స్వీకరిస్తామన్నారు. గత ప్రభుత్వం కేబినెట్ ఆమోదం లేకుండానే గవర్నర్ ప్రసంగం ఉందా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌కు గవర్నర్ వ్యవస్థపై నమ్మకం లేదన్నారు. అప్పులతోనే రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. మొదటి ఏడాదిలోనే రూ.20 వేల కోట్లకుపైగా రుణమాఫీ చేశామన్నారు. మార్చి 31 నాటికి రైతులందరికీ రైతు భరోసా ఇస్తామని స్పష్టం చేశారు. భూమి లేని రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇస్తున్నామన్నారు. రైతుల నుంచి ధాన్యం మొత్తాన్ని కొనుగోలు చేస్తామని వెల్లడించారు. సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇచ్చామన్నారు. గతంలో ఎక్కడ పంట పండినా కాళేశ్వరం వల్లే అన్నారని.. కానీ కాళేశ్వరం నీళ్లు లేకున్నా రికార్డ్ స్థాయిలో ధాన్యం పండిందని తెలిపారు. గత ప్రభుత్వం మిల్లర్లతో కుమ్మక్కై రైతులకు అన్యాయం చేసిందన్నారు. వరి వేసుకుంటే ఉరి వేసుకున్నట్టే అని కేసీఆర్ అనలేదా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు.

# బీజేపీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నాం

పంటలు ఎండుతుంటే కాంగ్రెస్‌కు పట్టదా అని నిలదీశారు. బీఆర్ఎస్‌ను జాకీ పెట్టి లేపినా ఇక లేవదని విమర్శించారు. డీలిమిటేషన్‌పై ఎలాంటి నిర్ణయం జరగలేదని అన్నారు. ఒక వర్గం, ప్రాంతం కోసం కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోదని తేల్చిచెప్పారు. కేంద్రం ప్రకటన చేయకముందే ప్రతిపక్షాలు హడావుడి చేస్తున్నాయని అన్నారు. హైదరాబాద్ డ్రగ్స్‌కు అడ్డాగా మారిందని బండి సంజయ్ ఆరోపించారు.

## 15 నెలల్లో రెండుసార్లు హాజరు

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై సమాధానం చెబుతూ.. ఎమ్మెల్యేగా కేసీఆర్ ఇప్పటివరకూ రూ.57 లక్షల జీతం తీసుకుని కేవలం రెండు సార్లు మాత్రమే అసెంబ్లీకి వచ్చారని మండిపడ్డారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..'కేసీఆర్ ఆరోగ్యంగా ఉండాలని, అసెంబ్లీకి రావాలని కోరుతున్నా. నిద్రపోయే వారిని లేపొచ్చు కానీ.. నటించే వారిని లేపలేం. సభకు వచ్చి కేసీఆర్ విలువైన సూచనలు ఇవ్వాలి. ఆయన సభకు రాకుండానే లక్షల రూపాయలు జీతం తీసుకుంటున్నారు. అసెంబ్లీకి కేసీఆర్ రారు.. ఆయన తన నియోజకవర్గంలోనూ క్షేత్రస్థాయిలో పర్యటించరని అన్నారు. . రైతుల ఆత్మహత్యలకు వారి అప్పులే ప్రధాన కారణం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేశాం. ఆరు నెలల్లోనే రూ.25 వేల కోట్ల రుణమాఫీ కింద చెల్లించాం. అన్నదాతలకు క్వింటాల్ వరికి రూ.500 బోనస్ ఇస్తున్నాం. కాళేశ్వరం నుంచి చుక్క నీరు రాకుండానే 1.57 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి సాధించాం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టింది కాళేశ్వరం కాదు.. కూలేశ్వరం అని ప్రజలే అంటున్నారు. కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టుల్లో రైతులకు నీరిస్తున్నాం. ఎన్నికల కోడ్ సాకుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు ఇవ్వలేదు. మేం అధికారంలోకి వచ్చాక రైతుబంధు చెల్లించాం. భూమి లేని రైతు కూలీలకు ఆత్మీయ భరోసా ఇచ్చాం. రైతు కూలీలకు ఏటా రూ.12 వేలు ఇచ్చే పథకం తెచ్చాం. కాళేశ్వరం నుంచి చుక్కనీరు లేకుండా రికార్డు స్థాయి పంటలు పండాయి. వరి వేసుకుంటే ఉరి వేసుకున్నట్లే అని గతంలో కేసీఆర్ అన్నారు. కానీ మేం మొత్తం ధాన్యం కొనుగోలు చేశాం. అలాగే మహిళా సాధికారతకు ఎన్నో పథకాలు చేపట్టాం. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాం. గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. దాని కోసం రూ.1,775 కోట్లు ఖర్చు చేస్తున్నాం. గతంలో కేసీఆర్ ఒక్క మహిళకైనా మంత్రి పదవి ఇచ్చారా?. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే మా లక్ష్యం. మహిళా సంఘాలకు వెయ్యి ఆర్టీసీ అ÷-దె బస్సులు ఇచ్చాం. వారికి వెయ్యి మెగావాట్ల సౌర విద్యుత్ ఎ÷-లాంట్లు అందిస్తాం. కేసీఆర్ విషయంలో స్పీకర్‌పై మాట్లాడిన మాటలకు కట్టుబడి ఉన్నామని రేవంత్ చెప్పారు. కాగా, తెలంగాణ శాసనమండలిలో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తుండగానే బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు పెద్దపెట్టున నిరసనకు దిగారు. కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలకు సీఎం రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం శాసనమండలి నుంచి బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు.

# విమానాశ్రయాల తరహాలో బేగంపేట రైల్వే స్టేషన్

రూ.26.55 కోట్లతో మొదటి విడత పనులు జరుగుతున్నాయని, మరో రూ.12 కోట్లతో రెండో విడత పనులు పూర్తి చేస్తామని కిషన్ రెడ్డి అన్నారు. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా దశల వారీగా అభివృద్ధి పనులను పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఒకప్పుడు రైల్వేస్టేషన్‌కు వస్తే ముక్కు మూసుకొని రావాల్సిన పరిస్థితి ఉండేదని, ప్రధాని నరేంద్ర మోదీ స్వచ్ఛభారత్ ద్వారా స్వచ్ఛ రైల్వేస్టేషన్ పేరుతో వినూత్న మార్పులను తీసుకొచ్చారని గుర్తు చేశారు. చర్లపల్లి రైల్వే స్టేషన్‌ని కూడా అధునాతనంగా నిర్మించుకొని ప్రారంభించుకున్నామని, బేగంపేట రైల్వేస్టేషన్‌లో అందరూ మహిళలే ఉద్యోగులు ఉండేలా చూస్తామని అన్నారు. త్రిభాషా విధానం దేశంలో కొత్తతి ఏమీ కాదని, కేంద్ర ప్రభుత్వం బలవంతంగా తమపై హిందీ రుద్దుతోందని దుష్ప్రచారం చేస్తున్నారని కిషన్?రెడ్డి పేర్కొన్నారు. ఏ ఒక్కరిపై కూడా బలవంతంగా హిందీని రుద్దే ప్రయత్నం చేయలేదని, ఏ భాష కావాలంటే అందులో చదువుకునే అవకాశం ఉందని తెలిపారు. తమిళ భాషలో తీసిన సినిమాలు హిందీలో డబ్ చేసి రూ.కోట్లు లాభాలను నిర్మాతలు పొందుతున్నారని, వాళ్లకా లాభాలు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు. భాష పేరుతో దేశాన్ని విభజించాలని చూడటం సరికాదని అన్నారు. సీఎంగా స్టాలిన్ ఏం చేశాడో చెప్పి తమిళనాడు ప్రజల్ని ఓట్లు అడగాలని కోరారు. ఆయనేం చేయలేదు కాబట్టే భాష పేరు మీద దుష్ప్రచారం చేస్తూ ఎన్నికలు దాటేయాలని చూస్తున్నారని అన్నారు. పునర్విభజనకు సంబంధించి 2009 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటి విధానాలే ఇప్పటికీ కొనసాగుతున్నాయని అన్నారు. పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనపై కొత్త విధానం రాలేదని, డీ లిమిటేషన్ చేస్తే సీట్లు తగ్గుతాయనేది దుష్ప్రచారం మాత్రమేనని అన్నారు. జాతీయ విద్యావిధానం హిందీని బలవంతంగా రుద్దలేదే అలాంటప్పుడు దానిని వ్యతిరేకించడం సరికాదు

# ఎక్స్ వేదికగా పవన్ కళ్యాణ్ వెల్లడి

అమరావతి : భాషా వివాదంపై ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఒక భాషను బలవంతంగా విధించడం లేదా ఒక భాషను వ్యతిరేకించడం సరికాదన్నారు. ఈ రెండూ భారత జాతీయ, సాంస్కృతిక ఏకీకరణ లక్ష్యాన్ని సాధించడంలో సహాయ పడవన్నారు. హిందీని ఒక భాషగా తానెప్పుడూ వ్యతిరేకించలేదని క్లారిటీ ఇచ్చారు పవన్. నేషనల్ ఎడ్యూకేషన్ పాలసీ హిందీని అమలు చేయనప్పుడు.. దాని విధింపు గురించి తప్పుడు కథనాలను వ్యాప్తి చేయడం ఎందుకు అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. ఇలా చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం తప్ప మరొకటి కాదన్నారు. నేషనల్ ఎడ్యూకేషన్ పాలసీ ప్రకారం.. విద్యార్థులు విదేశీ భాషతో పాటు ఏదైనా రెండు భారతీయ భాషలను(తమ మాతృభాషతో సహా) నేర్చుకునే సౌలభ్యాన్ని కలిగి ఉంటారన్నారు. హిందీ వద్దనుకుంటే.. తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, మరాఠీ, సంస్కృతం, గుజరాతీ, అస్సామీ, కాశ్మీరీ, ఒడియా, బెంగాలీ, పంజాబీ, సింధీ, బోడో, డోగ్రీ, కొంకణి, మైథిలీ, మైతేయి, నేపాలీ, సంతాలి, ఉర్దూ లేదా మరే ఇతర భారతీయ భాషనైనా ఎంచుకోవచ్చన్నవారు. బహుళ-భాషా విధానం ఎంపికతో విద్యార్థులను ప్రోత్సహించడానికి, జాతీయ ఐక్యతను ప్రోత్సహించడానికి, భారతదేశం గొప్ప భాషా వైవిధ్యాన్ని కాపాడడానికి ఉపకరిస్తుందన్నారు. రాజకీయ ఎజెండాల కోసం నూతన విద్యా విధానాన్ని తప్పుగా అర్థం చేసుకోవడం, పవన్ తన వైఖరిని మార్చుకున్నారని చెప్పడం సదరు వ్యక్తుల అవగాహనా రాహిత్యాన్ని ప్రతిబింబిస్తుందని విమర్శించారు. జనసేన పార్టీ ప్రతి భారతీయునికి భాషాపరమైన స్వేచ్ఛ, విద్యా ఎంపిక సూత్రానికి కట్టుబడి ఉందని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

# నా జీవితంలో ఎన్నో అలుపెరగని పోరాటాలు

సీఎం రిప్లై ఇచ్చారు. ఆరోగ్యశ్రీలో కొన్ని టెస్టులు చేయడం లేదని నందిని అనే మహిళ ప్రశ్నించారు. అలాగే పెన్షన్ కోసం సదరం సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసినా ఇవ్వడం లేదని మరొకరు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ముఖ్యమంత్రి సమాధానమిస్తూ.. 'నేను వచ్చింది మీకు బాధ్యతలు కూడా గుర్తు చేయడానికి. ఇలా ఏ సీఎం అయినా నాలాగా వచ్చారా.. ఎవరికైనా మైక్ ఇచ్చారా.. ఎవరైనా వచ్చినా పరదాలు కట్టుకుని వచ్చా రు.. విమానంలో అలా తిరిగి వెళ్ళిపోయేవారు. ఇది ప్రజా ప్రభుత్వం.. సంక్షేమం, అభివృద్ధి రెండు చేయాలనేదే నా అభిమతం. 2004లో టీడీపీని గెలిపించి ఉంటే ఏపీ ఎక్కడికో వెళ్ళిపోయేది. 2019లో నన్ను గెలిపించి ఉంటే, విభజన రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెంది ఉండేది. దానిలో నా తప్పు ఉంది. గుజరాత్‌లో స్థిరమైన ప్రభుత్వం వలన అభివృద్ధి సాధ్యమైంది. స్థిరమైన ప్రభుత్వం ఉంటే అభివృద్ధి స్థిరంగా సాగుతుంది" అని చెప్పుకొచ్చారు. ఏపీలో ఇప్పుడు ఉన్నది ప్రజాప్రభుత్వమన్నారు. వైసీపీకి అధికారం ఇస్తే ఏపీని అంధకారంలోకి నెట్టేశారని మండిపడ్డారు. వేరే వాళ్లు వస్తే ఏదో చేస్తారని ఓట్లేశారన్నారు. ఐదేళ్లలో విపరీ తంగా అపపులు చేసి వెళ్లారని సీఎం వ్యాఖ్యలు చేశారు. మన ఆరోగ్యానికి ఎందుకు ఇబ్బందులు వస్తున్నాయో ఆలోచించాలన్నారు. తిండి, తాగేనీరు, అపరిశుభ్రత వలన వస్తున్నాయని కూడా గమనించాలన్నారు. ఆరోగ్య శ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్‌తో 25 లక్షల వరకు ఆర్థిక సహాయం అందజేస్తున్నామని తెలిపారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ రూపొందించామన్నారు. విజన్ రూపొందించడమే కాదని.. తలసరి ఆదాయం పెరిగిందా లేదా అని పరిశీలిస్తున్నామని అన్నారు. వారసత్వంగా 87 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను వదిలిపోయారని...దానిని తీయడానికి నాలుగైదు నెలలు పడుతుందన్నారు. స్వర్ణాంధ్ర కోసం ఉద్యమం చేస్తూనే, స్వచ్ఛాంధ్ర కోసం ఉద్యమం చేయాలన్నారు. వేస్ట్ ఎనర్జీ కింద కంపోస్టు తయారుచేయడానికి ఒక టెక్నాలజీ వచ్చిందని తెలిపారు. బయో డైవర్సిటీ పేరుతో 10 లక్షలతో మెటీరియల్ పెడితే, కంపోస్టు తయారు చేయవచ్చని చెప్పారు. తణుకు ఎన్టీఆర్ పార్క్‌ను తాను డెవలప్ చేశానని.. కానీ దానిని నాశనం చేశారని ఫైర్ అయ్యారు. 'ఒక బాధ్యత కలిగిన ప్రభుత్వం వచ్చినపుడు, మీరు కూడా బాధ్యతతో వ్యవహరిస్తే, మంచి ఫలితాలు వస్తాయి. ఒకప్పుడు పారిశధ్య కార్మికులను చులకనగా చూసేవారు. వారు మన ఆరోగ్యాన్ని కాపాడుతున్నారు. వారిపై గౌరవం పెరిగింది.. మునిసిపల్ కార్మికులు అందరిని ఆదుకుంటాం. మీ పరిసరాలు, మీ ఇల్లు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. సమాజం కోసం, స్వర్ణాంధ్ర కోసం స్వచ్ఛందంగా పనిచేయడానికి ముందుకు వచ్చారు..వారిని అభినందించాలి. వారి కోసం ఒక యాప్‌ను రూపొందిస్తాం. ప్లాస్టిక్ చాలా ప్రమాదకరం.. పశు వులు వాటిని తిని, చనిపోతున్నాయి. ప్లాస్టిక్ వలన తినే తిండి కూడా విషం అయిపోతున్నది. క్యాన్సర్ వచ్చినప్పుడు బాధ పడుతున్నాం. కానీ క్యాన్సర్ కారణమైన ఆహారం గురించి ఆలోచించాలి. రాష్ట్రంలో క్యాన్సర్ రాకుండా చేయడానికి నోరి దత్తాత్రేయుడుని సలహాదారుగా నియమించాం. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై యుద్ధమే చేయాలి. దానివలన చెడు పరిణామాలు ఉన్నాయి. ప్రమాదకరమైన ప్లాస్టిక్ తయారుచేసే వారిని నియంత్రిదాం' అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

# భానుడు భగభగలు..

ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని.. బయటకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అమరావతి వాతావరణ కేంద్రం ప్రకారం.. దిగువ ట్రోపోఆవరణములో ఆంధ్రప్రదేశ్ – యానాంలో ఆగ్నేయ, నైరుతి దిశగా దిశగా గాలులు వీస్తున్నాయి. వీటి ఫలితంగా రాష్ట్రంలో రాగల మూడు రోజుల వరకు వాతావరణ సూచనలు ఈ కింది విధంగా ఉన్నాయి. ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ – యానాం:– శనివారం, ఆదివారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉంది. వేడి, తేమతో కూడిన అసౌకర్యమైన వాతావరణము ఏర్పడే ఉంది. సోమవారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉంది. గరిష్ట ఉష్ణోగ్గతలు క్రమముగా 2 నుండి 3 డిగ్రీల సెంటీగ్రేడ్ ఎక్కువగా నమోదయ్యే అవకాశముంది. దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్ :– శనివారం, ఆదివారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉంది. వేడి, తేమతో కూడిన అసౌకర్యమైన వాతావరణము ఏర్పడే ఉంది. సోమవారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉంది. గరిష్ట ఉష్ణోగ్గతలు క్రమముగా 2 నుండి 3 డిగ్రీల సెంటీగ్రేడ్ ఎక్కువగా నమోదయ్యే అవకాశముంది. శనివారం, ఆదివారం, సోమవారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉంది. గరిష్ట ఉష్ణోగ్గతలు క్రమముగా 2 నుండి 4 డిగ్రీల సెంటీగ్రేడ్ ఎక్కువగా నమోదయ్యే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. తెలంగాణలో కూడా భారీగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకారం.. శనివారం 8 జిల్లాల్లో 41 నుంచి 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యే చాన్స్ ఉంది.. ఈ మేరకు ఆదిలాబాద్, జగిత్యాల, కొమురం భీం, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఇక.. నిన్న కూడా ఆదిలాబాద్, నిజామాబాద్, భద్రాచలం, మహబూబ్‌నగర్, మెదక్, రామగుండంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయని వెల్లడించింది. రెండు, మూడు రోజుల వరకు రెండు నుంచి నాలుగు డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. వేసవి కాలం హడలెత్తిస్తోంది.. ఈసారి ఫిబ్రవరి నుంచే ఫుల్ ఫైర్ మీదున్నాడు భానుడు. ఉదయం తొమ్మిది గంటల నుంచే దంచికొడుతున్నాడు. సాయంత్రమైనా భూమి సెగలు.. పొగలు కక్కుతుందంటే టెంపర్ ఏ స్థాయిలో నమోదవుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇక ఇప్పట్నుంచే వణికిస్తున్న ఈ ఎండలకు కొత్తగా యూవీ రేస్.. అదే అతినీలలోహిత కిరణాల ఎఫెక్ట్ కూడా ఉంటుందంటున్నారు వాతావరణశాఖ అధికారులు. ఇప్పటికే కేరళను వణికిస్తున్న ఆ కిరణాలు.. తెలుగు రాష్ట్రాలపైనా విరుచుకుపడొచ్చంటూ వార్నింగ్ బెల్స్ మోగిస్తున్నారు. కేరళలో అతినీల లోహిత కిరణాలు తీవ్రరూపం దాల్చాయి. వాతావరణ కాలుష్యం, ఓజోన్ పొరకు రంధ్రాలు వంటి కారణాలతో యూవీ ఇండెక్స్ అత్యంత ప్రమాదకర కేటగిరీలోకి చేరింది. పలుచోట్ల యూవీ ఇండెక్స్ 11 పాయింట్లు దాటేసింది. దీంతో కేరళలకు చుక్కలు చూపిస్తున్నాడు సూర్యుడు. అత్యవసరమైతే తప్పా ఎవ్వరూ బయటకు రావొద్దంటూ కేరళ విపత్తు నిర్వహణ సంస్థ రెడ్ అలర్ట్ ప్రకటించింది. యూవీ కిరణాల ఎఫెక్ట్‌తో చర్మ సంబంధిత వ్యాధులు, ఐ ఇన్ఫెక్షన్స్ వచ్చే అవకాశాలున్నాయని హెచ్చరిస్తున్నారు. అంతేకాదు[illegible] స్కిన్ క్యాన్సర్ వచ్చే చాన్స్ కూడా ఉందని చెబుతున్నారు. అందుకే.. ప్రజలు అతినీలలోహిత కిరణాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ అలర్ట్ జారీ చేసింది.. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు దీని ప్రభావం ఉంటుందని.. అతినీలలోహిత కిరణాల బారినపడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

# శంషాబాద్‌లో డ్రగ్స్ విక్రేత పట్టివేత

## సికింద్రాబాద్‌లో గంజాయి ముఠా గుట్టు రట్టు

హైదరాబాద్ : అహ్మద్ నగర్ మహారాష్ట్రకు చెందిన అభిషేక్ సంజయ్ అనే వ్యక్తి శంషాబాద్ లో ఓ సినిమా థియేటర్ వద్ద 15 గ్రాముల ఎండిఎంఎ డ్రగ్స్ విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుడు గతంలో మహారాష్ట్ర లో కిరాణా షాపుతోపాటు వ్యవసాయం చేసుకుంటూ ఉండేవాడు. అయితే కుటుంబ కలహాలు ఆర్థిక ఇబ్బందులు రావడంతో బెంగళూరుకు మఖాం మార్చాడు. అక్కడ ఆన్ లైన్ లో డ్రగ్స్ కు సంబంధించి సెర్చింగ్ చేశాడు. దీంతో అతనికి నైజీరియన్ దేశానికి చెందిన ఓ వ్యక్తి పరిచయం అయ్యాడు. నైజీరియన్ వ్యక్తి ద్వారా ఎండిఎంఎ డ్రగ్స్ కొనుగోలు చేసి అతను తీసుకునేవాడు. కొన్నాళ్లు గడిచిన తర్వాత దానిని ఇతరులకు విక్రయించేవాడు. అదే తరహాలో శంషాబాద్ లో ఎండిఎం ఏ డ్రగ్స్ ను సినిమా థియేటర్ వద్ద విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా ఆర్జీఐఏ పోలీసులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. నిందితుని వద్ద 15 గ్రాముల ఎండిఎంఎ డ్రగ్స్ స్వాధీనం చేసుకుని నిందితునిపై కేసు నమోదు చేశారు. పట్టుబడ్డ ఎండి ఎంఎం డ్రగ్స్ విలువ లక్ష 80 వేల వరకు ఉంటుందని అంచనా వేశారు. అంతరాష్ట్ర గంజాయి ముఠా గుట్టు రట్టు చేశారు రైల్వే పోలీసులు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి వారి నుండి 28.50లక్షల విలువైన 57కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ లో జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆకస్మిక తనిఖీలలో కోణార్క్ ఎక్స్ ప్రెస్ రైలు లో ఒరిస్సా బర్హంపుర నుండి మహారాష్ట్ర లోని దాదర్ కు కు తరలిస్తున్న ఒరిస్సా కు చెందిన సుశాంత్ కుమార్ స్వేన్, మహారాష్ట్రకు చెందిన కరణ్ ఇయప్పన్ శెట్టి పట్టుబడినట్లు జీఆర్పీ డీఎస్పీ ఎస్ ఎన్ జావేద్ తెలిపారు. ప్రధాన నిందితుడు ఒరిస్సా కు చెందిన జీవన్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. చెడు వ్యసనాల కారణంగా అప్పుల పాలైన సుశాంత్, కారు డ్రైవింగ్ వలన వస్తున్న ఆదాయం సరిపోవడం లేదని అధిక సంపాదన కోసం పార్ట్ టైమ్ జాబ్ కోసం వెతుకుతున్న కరణ్ ల అవసరాలను ఆసరాగా చేసుకొని వారికి అధిక ఆదాయం సమకూరుస్తానని ఆశ చూపి బరంపురకు పిలిపించుకున్నాడు. అక్కడ గంజాయిని కొనుగోలు చేసి మహారాష్ట్రలో అమ్మడం ద్వారా ముగ్గురం సమానంగా పంచుకుందామని ఒప్పందం చేసుకున్నారు. గంజాయి బ్యాగ్ లను తమ సీట్ల కింద పెట్టుకొని పెట్టుకొని నిద్ర పోగా మధ్యలోనే జీవన్ అదృశ్యమయ్యాడు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ కి చేరుకున్న కోణార్క్ ఎక్స్ ప్రెస్ రైల్ లో వీరు తమకు పట్టుబడ్డట్లు డీఎస్పీ వివరించారు. వీరినుండి 28.50లక్షల విలువైన గంజయితో పాటు 4సెల్ ఫోన్ లు స్వాధీనం చేసుకొని రిమాండ్ కు తరలించినట్లు వెల్లడించారు.

# రెండోసారి మళ్లీ నేనే ముఖ్యమంత్రిని

శాయశక్తులా కృషి చేస్తా. ఇచ్చిన ప్రతి హామీ అమలుచేసి ప్రజల వద్దకు వెళతాం. సంక్షేమ పథకాల లబ్దిదారులే మా ఓటర్లు అని అన్నారు. నేను పనిని నమ్ముకొని ముందుకు వెళ్తున్నా. ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటాం. స్టేచర్ కాదు స్టేట్ ఫ్యూచర్ నాకు ముఖ్యం అన్నారు.. 25 లక్షల మందికిపైగా రైతులకు రుణమాఫీ జరిగింది. కోటి మంది మహిళలకు కచ్చితంగా లబ్ది చేకూరుస్తాం. వారంతా ఇప్పుడు మాట్లాడకపోయినా ఓటు మాకే వేస్తారు. గతంలో నేను చెప్పింది జరిగింది.. భవిష్యత్‌లోనూ నేను చెప్పిందే జరుగుతుంది. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు త్వరలో చెల్లిస్తాం. వచ్చే ఆర్థిక సంవత్సరంలోపు వందశాతం బకాయిలు చెల్లిస్తాం. ఆదాయాన్ని పెంచి..పేదలకు పంచడమే మా విధానం' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. చ్చిన ప్రతి హామీ అమలు చేసి ప్రజల వద్దకు వెళతానని ఆయన శాసనమండలిలో మీడియాతో ముచ్చటించిన సందర్భంలో అన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు కృషి చేస్తానని రేవంత్ చెప్పారు. . తాను పనిని నమ్ముకుని ముందుకు వెళుతున్నానని, సంక్షేమ పథకాల లబ్దిదారులే తమ ఓటర్లని సీఎం రేవంత్ అన్నారు. ఇప్పుడు ప్రజలు తనను నమ్మి మళ్లీ గెలిపిస్తారని రేవంత్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి శాయశక్తుల కృషి చేస్తానని చెప్పారు. తెలంగాణలో కోటి మంది మహిళలకు కచ్చితంగా లబ్ది చేకూరుస్తానని సీఎం హామీ ఇచ్చారు. మహిళలు ఇప్పుడు మాట్లాడకపోయినా ఓటు తమకే వేస్తారని సీఎం నమ్మకంగా చెప్పారు. గతంలో తాను చెప్పిందే జరిగిందని, భవిష్యత్?లో కూడా తాను చెప్పిందే జరుగుతుందని రేవంత్ చెప్పారు. జనాభా లెక్కలపై కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ అంచనాలు అడిగిందని, 2027లో జనాభా లెక్కలు నోటిపై చేస్తారని అంటున్నారని సీఎం రేవంత్ తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలు నష్టపోకుండా ప్రయత్నిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. తొలిసారి బీఆర్ఎస్‌పై వ్యతిరేకతతో ప్రజలు తమకు ఓటేసినా, రెండోసారి తమపై ప్రేమతో ఓటు వేస్తారని సీఎం రేవంత్ చెప్పడం గమనార్హం.

## తెలంగాణ కోసం పదవులు వదులుకున్న చరిత్ర మాది

నాడు కాంగ్రెస్ నేతలు మాట్లాడలేదని, పులిచింతల నిర్వాసితులకు తాము సహాయం చేశామని చెప్పారు. రాష్టాన్ని అభివృద్ధి చేసిన నాయకుడు కేసీఆర్‌పై సీఎం వ్యాఖ్యలను ఖండిస్తూ తాము ఆయన ప్రసంగాన్ని బాయ్‌కాట్ చేశామని తెలిపారు. కేసీఆర్ సభలో ప్రతిపక్ష నాయకుడని, ఆయనను అగౌరవపర్చడం సబబు కాదని సూచించారు. తమకు స్పీకర్ మైక్ ఇవ్వలేదని, సభలో ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలని కోరామని అన్నారు. కానీ రేవంత్‌రెడ్డి విజ్ఞత, సంస్కారం లేకుండా మాట్లాడారని హరీశ్‌రావు అన్నారు. ఇంత నీచపు మాటలు మాట్లాడే సీఎంను తానెప్పుడూ చూడలేదని చెప్పారు. ఉత్తమ్ కుమార్ పచ్చి అబద్దాలు మాట్లాడారని, కృష్ణా జలాలలో అన్యాయానికి కారణం కాంగ్రెస్ పార్టేనని ఆరోపించారు. విద్యాసాగర్ వెళ్లి తాత్కాలికంగా ఒప్పందం చేసుకున్నారని, అప్పుడు ప్రాజెక్టులు లేక 299 టీఎంసీలకు ఒక్క సంవత్సరానికి ఒప్పందం చేసుకున్నారని చెప్పారు. తెలంగాణ అధికారులు ఈ సంవత్సరం ఎందుకు ఒప్పుకున్నారని ప్రశ్నించారు. అప్పుడు పోతిరెడ్డిపాడు కోసం 40 రోజులు అసెంబ్లీని స్తంభింపజేసింది తామేనని మాజీ మంత్రి చెప్పారు. నాడు పదవుల కోసం ఉత్తమ్ పెదవులు మూసకున్నారని, తెలంగాణకు ద్రోహం చేసి ఉత్తమ్ మంత్రి అయ్యారని విమర్శించారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆయన సతీమణి చంద్రబాబు వద్ద భోజనం చేసి కృష్ణ నీటిని అప్పగించారని ఆరోపించారు.

# వాస్తవాలు చెబితే బిఆర్ఎస్ తట్టుకోవడం లేదు

సభను అడ్డుకునే ధోరణిని ప్రజలు గమనిస్తున్నారు,' అని కొండా సురేఖ హెచ్చరించారు. 'ఇకనైనా బీఆర్ఎస్ సభ్యులు తమ వైఖరిని మార్చుకోవాలి. ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ సభా విధులను కాపాడాలి.' అని ఆమె అన్నారు.

# రాజాసింగ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు

'అసదుద్దీన్ ఒవైసీ మెంటల్ అయిపోయిండు.. రేవంత్ రెడ్డి గారు మీ కొత్త దోస్తులకు మెంటల్ హాస్పిటల్లో ట్రీట్మెంట్ చేపియండి' అని రాజాసింగ్ సెటైర్లు గుప్పించారు.

# ఏప్రిల్ 20, 21 తేదీల్లో రజక మహాసభ

విజయవాడ : రాష్ట్ర వ్యాప్తంగా రజక వృత్తిదారులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అణచివేతకు గురవుతున్నారని ఎపి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వం రజక వృత్తిదారులకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లిలోని క్రాంతి హైస్కూల్‌లో ఎపి రజక వృత్తిదారుల సంఘం 7వ రాష్ట్ర మహాసభ ఆహ్వాన సంఘం కరపత్రాన్ని ఆయన శనివారం ఆవిష్కరించారు.

# ఆచరణకు సాధ్యంకాని మోసపూరిత బడ్జెట్



### మా పథకాలకే పేర్లుమార్చారు
### మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి

చెన్నై : అచరణకు సాధ్యం కాని ప్రకటనలతో బడ్జెట్ అంతా మోసపూరితంగా వుందని, గతంలో తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలకే కొత్తగా పేర్లు పెట్టి మసిపూసి మారేడు కాయ చేశారని మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ధ్వజమెత్తారు. అసెంబ్లీలో శుక్రవారం వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం అసెంబ్లీ బయట ఎడప్పాడి మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థికశాఖా మంత్రి తంగం తెన్నరసు ఆచరణకు సాధ్యం కాని ప్రకటనలతో మాత్రమే బడ్జెట్ సరిపెట్టారన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ 95శాతం హామీలను నెరవేర్చినట్లు ప్రకటించారని, అయితే 40శాతం హామీలు ఇంకా అలాగే వున్నాయని విమర్శించారు. నీట్ రద్దు చేస్తామని, అందుకు సంబంధించిన రహస్యం తమ వద్ద వుందని పలు వేదికలపై ప్రకటించిన ఉపముఖ్యమంత్రి ఉదయనిధి తన మాట నిలబెట్టుకోకుండా విద్యార్థులకు ద్రోహం తలపెట్టారన్నారు. ఉపాధి హామీ పథకాన్ని 150 రోజులుగా పెంచుతామన్న హామీ ఏమైందని ఈపీఎస్ ప్రశ్నించారు. గత 73ఏళ్ళలో రాష్ట్రప్రభుత్వం పొందిన అప్పు రూ.5లక్షల 18వేల కోట్లు మాత్రమేనని అయితే, డీఎంకే ప్రభుత్వం ఈ నాలుగేళ్ళలో రూ.3లక్షల 54వేల కోట్లు రుణం పొందిందని, దేశంలోనే అధిక రుణాలు పొందే రాష్ట్రంగా తమిళనాడు నిలిచిందని ఈపీఎస్ ఆరోపించారు. 2026 అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో వుంచుకుని రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌లో కొత్త పథకాలంటూ ఏమీ లేవన్నారు.

ప్రజలను విస్మరించిన బడ్జెట్

### - టీవీకే నేత విజయ్

రాష్ట్రప్రజలను విస్మరించే విధంగా డీఎంకే ప్రభుత్వ బడ్జెట్ ఉందని తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు, నటుడు విజయ్ విమర్శించారు. కేవలం ప్రకటనలపైనే శ్రద్ధ చూపుతున్న డీఎంకే మోడల్ ప్రభుత్వం రహదారుల స్థితిగతులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై బడ్జెట్‌లో ప్రకటించలేదన్నారు. కళాశాల విద్యార్థులకు మాత్రమే లాప్‌టాప్?లు పంపిణీ చేస్తామన్న ప్రభుత్వం, ప్లస్‌వన్, ప్లస్‌టూ విద్యార్థుల గురించి ప్రస్తావించలేదన్నారు. ఎన్నికల హామీలను గాలికి వదిలి, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలను ఆకట్టుకునే విధంగా ఈ బడ్జెట్ వుందని విజయ్ వ్యాఖ్యానించారు.

ఇది ఎన్నికల బడ్జెట్...

కేంద్రమంత్రి ఎల్.మురుగన్

కేంద్రప్రభుత్వం నిధులిచ్చే పథకాలకు ముఖ్యమంత్రి స్టాలిన్ తన తండ్రి కరుణానిధి పేరు పెట్టినంత మాత్రాన అది డీఎంకే సాధించిన విజయమవుతుందా? అని కేంద్రమంత్రి ఎల్.మురుగన్ విమర్శించారు. వచ్చే సంవత్సరం అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో 2026లో పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు అవకాశం లేనందున మధ్యంతర బడ్జెట్‌ను మాత్రమే ఈ డీఎంకే ప్రభుత్వం దాఖలు చేస్తుందని, అందువల్ల వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధిపొందాలనే ఏకైక దృష్టితోనే ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రభుత్వం ఈ బడ్జెట్‌ను రూపొందించిందన్నారు. ఈ నాలుగేళ్ళలో 57వేలకు పైగా పోస్టులను భర్తీచేసినట్లు బడ్జెటలో ప్రకటించిన ప్రభుత్వం వచ్చే సంవత్సరం 40వేల ప్రభుత్వ పోస్టులను ఎలా భర్తీ చేస్తుందన్న వివరాలు బడ్జెట్‌లో లేవని కేంద్రమంత్రి ఎల్.మురుగన్ అన్నారు.

పసలేని బడ్జెట్

### బీజేపీ ఫ్లోర్ లీడర్ నయినార్ నాగేంద్రన్

డీఎంకే ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో కొత్తగా అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి లేవని, ఇదో పసలేని బడ్జెట్ అని బీజేపీ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ నయినార్ నాగేంద్రన్ వ్యాఖ్యానించారు. టాస్మాక్ సంస్థలో ఇటీవల తనిఖీలు నిర్వహించిన ఎన్‌ఫోర్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు అందులో రూ.వెయ్యి కోట్ల మేర అవినీతి జరిగిందంటూ గురువారం ప్రకటించారని, అయితే ఎలాంటి అవినీతి జరగలేదని మంత్రి సెంథిల్‌బాలాజీ చెప్పడం హాస్యాస్పదంగా వుందన్నారు. ఈ అవినీతి గురించి చర్చించేందుకు అసెంబ్లీలో తమకు అవకాశం కల్పించాలంటూ స్పీకర్ అప్పావు వద్ద సావదాణ తీర్మానంకు సంబంధించి వినతిపత్రాన్ని తమ పార్టీ ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్ సమర్పించారని నాగేంద్రన్ తెలిపారు.

## భూ వివాదంతో బీజేపీ నేతను కాల్చి చంపిన పొరుగింటి వ్యక్తి

### నిందితుడిని హత్యచేసిన పోలీసులు

చండీగఢ్ : పొరుగింటికి చెందిన వ్యక్తి బీజేపీ నేతను కాల్చి చంపాడు. ఆయనను వెంబడించగా ఒక షాపులోకి వెళ్లాడు. అక్కడ గన్‌తో కాల్పులు జరిపి బీజేపీ నేతను హత్య చేశాడు. ఈ హత్యకు భూవివాదం కారణమని పోలీసులు తెలిపారు. బీజేపీ పాలిత హర్యానాలో ఈ సంఘటన జరిగింది. సోనిపట్‌కు చెందిన బీజేపీ నేత సురేంద్ర జవహర్, పొరుగింటికి చెందిన మోను బంధువుల నుంచి భూమిని కొనుగోలు చేశాడు. నాటి నుంచి భూమి విషయంలో వారిద్దరి మధ్య వివాదం నెలకొన్నది. ఈ నేపథ్యంలో ఆ భూమిలోకి అడుగుపెట్టవద్దని సురేంద్రను మోను హెచ్చరించాడు. కాగా, భూ వివాదాన్ని పరిష్కరించుకనేందుకు బీజేపీ నేత సురేంద్ర జవహర్ ప్రయత్నించాడు. శుక్రవారం రాత్రి ఆ భూమి వద్దకు ఆయన వెళ్లాడు. అయితే మోను దీనిపై ఆగ్రహించాడు. సురేంద్రపై గన్ ఎక్కుపెట్టడంతో ఆయన భయంతో అక్కడున్న ఒక షాపులోకి పరుగులు తీశాడు. మరోవైపు సురేంద్రను మోను వెంబడించాడు. షాపులోకి ప్రవేశించిన అతడ్ని అడ్డుకునేందుకు అక్కడున్న ముగ్గురు వ్యక్తులు ప్రయత్నించారు. అయినప్పటికీ చేతిలోని గన్‌తో సురేంద్ర తలపై మోను కాల్పులు జరిపాడు. దీంతో ఆయన అక్కడికక్కడే మరణించారు. కాగా, ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సురేంద్ర జవహర్ మృతదేహన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆయనను హత్య చేసిన నిందితుడు మోనును శనివారం ఉదయం అరెస్ట్ చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఓటర్-ఆధార్ కార్డు సీడింగ్‌పై సీఈసీ చర్చలు

న్యూఢిల్లీ : ఓటరు ఐడీల్లో జరిగిన అవకతవకల ఆ సమస్యను పరిష్కరించేందుకు భారత ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేశ్ కుమార్ కీలక నిర్ణయం తీసుకున్నారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శి, లెజిస్లేటివ్ సెక్రటరీతో పాటు యూఐడీఏఐ సీఈవోతో భేటీకానున్నారు. ఓటరు ఐడెంటిటీ కార్డును.. ఆధార్ కార్డుతో అనుసంధానం చేయాలన్న అంశంపై చీఫ్ ఎలక్షన్ కమీషనర్ నిర్ణయం తీసుకోనున్నారు. ఎలక్టోరల్ డేటాలో జరుగుతున్న అక్రమాలకు చెక్ పెట్టే ఆలోచనతో ఓటరు-ఆధార్ కార్డు సీడింగ్ గురించి చర్చించనున్నారు. అయితే వాలంటరీ పద్ధతిలో ఆధార్ డేటాబేస్‌తో ఓటరు ఐడీలను సీడింగ్ చేసే అవకాశం ఇప్పటికే ఉన్నది. కానీ అక్రమాలు ఎక్కువ అవుతున్న నేపథ్యంలో.. ఈ ప్రక్రియను కచ్చితంగా పాటించే రీతిలో చర్యలు చేపడుతున్నారు. ఉడాయ్ సీఈవోను కూడా చీఫ్ ఎన్నికల అధి కారి ఈ అంశంపై కలవనున్నారు. ఇటీవల ముగిసిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో .. ఓటరు రోల్స్‌లో భారీగా అక్రమాలు జరిగినట్లు ఆమ్ ఆద్మీ పార్టీ ఆరోపించింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు బీజేపీ ఓటర్ జాబితాలను మార్చేసినట్లు ఆమ్ ఆద్మీ ఆరోపించింది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఓటర్ల జాబితా నుంచి పేర్లను ఈసీఐ తొలగించినట్లు కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఎల్‌వీఎం3ఎం6 మిషన్..ఇస్రో క్రయోజెనిక్ ఇంజిన్ పరీక్ష విజయవంతం ఎల్‌వీఎం 3 ఎం6 మిషన్‌కు సంబంధించి క్రయోజెనిక్ హాట్ పరీక్షను విజయవంతంగా నెరవేర్చినట్లు ఇస్రో శనివారం వెల్లడించింది. తమిళనాడు లోని మహేంద్రగిరిలో ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్సులో ఈ పరీక్ష జరిగింది. ఎల్‌వీఎం 3 అనేది మూడు దశల మధ్యతరహా రాకెట్ ప్రయోగం. దీన్ని ఇండోస్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) అభివృద్ధి చేసింది. ప్రతి ప్రయోగం ముందు క్రయోజెనిక్ ఇంజిన్ పరీక్ష చేయడం సహజం. అయితే ఇంతవరకు ఈ క్రయోజెనిక్ ఇంజిన్ (సిఇ 20) హాట్ టెస్టులు కాంప్లెక్సు లోని వాక్యూమ్ పరిస్థితుల బట్టి సంక్లిష్ట సంస్థాపనలతో అనుకరించడమౌతోంది. గరిష్టంగా 25 నిమిషాల వ్యవధిలో వీటిని నిర్వహించడం జరుగుతోంది. అయితే ప్రస్తుత పరీక్షలో క్రయెజెనిక్ ఇంజిన్‌ను సుదీర్ఘ 100 నిమిషాల సమయంలో నిర్వహించడం విశేషంగా ఇస్రో వెల్లడించింది. దీనివల్ల అంతరిక్ష ప్రయోగాల్లో క్రయోజెనిక్ దశలు వేగంగా పూర్తి కావడానికి వీలవుతుందని ఇస్రో వెల్లడించింది.

## సెంట్రల్ యూనివర్సిటీ భూములు విక్రయిస్తే ఊరుకోం

### : ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్ : సెంట్రల్ యూనివర్సిటీ భూములను విక్రయిస్తే అడ్డుకుంటామని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య హెచ్చరించారు. ప్రభుత్వం నిర్వహించే వేలంలో ఎవరూ పాల్గొనవద్దని, ఆ భూములను కొనుగోలు చేస్తే అందులో అడుగుపెట్టనీయబోమన్నారు. భూముల విక్రయంపై ప్రధాని మోదీకి ఫిర్యాదు చేస్తామన్నారు. భూముల విక్రయాలను ఆపకపోతే ఏఐసీసీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కాచిగూడలోని ఓ హోటల్‌లో ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు జి.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడారు. గచ్చిబౌలిలో సెంట్రల్ యూనివర్సిటీ పరిధిలోని 400 ఎకరాల భూమిని అమ్మడానికి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని, ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివకుమార్, ఓయూ జేఏసీ ఛైర్మన్ రాజు, బీసీ సంఘాల నేతలు కోల జనార్దన్, నందగోపాల్, ఉదయ్, చెరుకు మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

## గుత్తా సుఖేందర్‌రెడ్డి అసహనం

### తప్పుపట్టిన ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్ : శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి శనివారం సభలో అసహనం ప్రదర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుపై కోపాన్ని చూపించారు. 'ఏందయ్యా నీ లొల్లి.. రోజూ న్యూసెన్స్ చేస్తున్నావ్..' అంటూ గద్దింపు ధోరణిలో మాట్లాడారు. సాటి సభ్యుల ముందు తాతా మధును అగౌరవపరిచారు. మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తీరును బీఆర్ఎస్ పార్టీ తప్పుపట్టింది. సభలో ఛైర్మన్ సుఖేందర్‌రెడ్డి తమ సభ్యుడిని ఉద్దేశించి న్యూసెన్స్ అనే పదం వాడటం కరెక్టు కాదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. దీనిపై ఆమె మండలిలో మాట్లాడుతూ.. సభలో మా సభ్యుడిని ఉద్దేశించి మీరు న్యూసెన్స్ అనే పదం వాడారని, తాను మీకు చెప్పేందుకు పెద్దదాన్ని కాదని, ఆ పదాన్ని దయచేసి రికార్డుల నుంచి తొలగించాలని కోరారు. కాగా, మండలి ఛైర్మన్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు మీడియా సమావేశం పెట్టనున్నట్లు తెలిసింది. మీడియా సమావేశం పెట్టి స్పీకర్ తీరును విమర్శించనున్నట్లు సమాచారం.

## అబద్ధాలతో పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

### : పల్లా రాజేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలతో పాలన సాగిస్తుందని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ ప్రభుత్వం రైతు రుణమాఫీపై అబద్ధాలు చెబుతోందని రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. అక్కడ 100 శాతం రుణమాఫీ చేసినం, ఇక్కడ 100 శాతం రుణమాఫీ చేసినం అని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోందని, తన జనగామ నియోజకవర్గంలో మాత్రం ఎక్కడా 100 శాతం రుణమాఫీ కాలేదని చెప్పారు. తన నియోజకవర్గంలో మొత్తం 127 గ్రామాలు ఉన్నాయని, ఆ 127 గ్రామాల్లో ఏ ఒక్క గ్రామంలో 100 శాతం రుణమాఫీ కాలేదని అన్నారు. తన నియోజకవర్గంలోని ఏ ఒక్క గ్రామంలో అయినా సరే 100 శాతం రుణమాఫీ జరిగినట్లుగా ప్రభుత్వం నిరూపిస్తే తాను ముక్కు నేలకు రాస్తానని పల్లా రాజేశ్వర్‌రెడ్డి శపథం చేశారు. అంతేకాదు తాను తన ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేస్తానని అన్నారు. వంద శాతం రుణమాఫీ చేశామని అబద్ధాలు చెప్పకుండా.. ఇంకా రుణాలు మాఫీ కాని రైతులకు కూడా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత కారణంగా విద్యాశాఖలో డ్రాపౌట్స్ పెరిగాయని ఆరోపించారు. కాంలగ్రెస్ 15 నెలల పాలనలో 2 లక్షల డ్రాపౌట్స్ నమోదయ్యాయని చెప్పారు. విద్యాసంస్థలకు నిధుల కేటాయింపులో కూడా ప్రభుత్వం విఫలమైందని అన్నారు.

## మేము వ్యతిరేకించేది హిందీని కాదు..

### మోదీ ఇతర భాషలను బలవంతంగా రుద్దే విధానాన్ని :
### డీఎంకే ప్రతినిధి డాక్టర్ సయ్యద్ హఫీజుల్లా

చెన్నై : తమిళనాడు ఎప్పుడూ హిందీని వ్యతిరేకించినట్టు కాదని, మేము వ్యతిరేకించేది ప్రజలపై హిందీ లేదా మరే ఇతర భాషను బలవంతంగా రూద్దొద్దని డాక్టర్ హఫీజుల్లా అన్నారు. తమిళనాడు సుదీర్ఘ కాలంగా హిందీకి బలవంతపు ప్రాధాన్యత ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో భాషా విధానం, విద్యలో ప్రాంతీయ భాషల ప్రాముఖ్యతను ప్రోత్సహించేందుకు డీఎంకే ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జాతీయ విద్యా విధానం ద్వారా కేంద్రం హిందీని ప్రజలపై రుద్దాలని ప్రయత్నిస్తోందని, అయితే తాము దీన్ని నిరంతరం వ్యతిరేకిస్తున్నామని ఆయన చెప్పారు. హిందీని స్వేచ్ఛగా నేర్చుకోవాలనుకునే వారికి ఎలాంటి అభ్యంతరం లేదని, ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ క్రమంలో తమిళనాడు భాషా విధానంపై పవన్ కల్యాణ్‌కు సరైన అవగాహన లేనట్లు ఉందన్నారు. తమిళ సినిమాలు హిందీలోకి డబ్ చేయడం వాణిజ్య ప్రయోజనాల కోసం మాత్రమేనని డీఎంకే నాయకులు అన్నారు. మూవీలు డబ్బింగ్ చేయడం ఒక వ్యాపార నిర్ణయం. కానీ భాషా విధానం ఒక సామాజిక, రాజకీయ అంశం. వీటిని కలిపి చూడటం తగదని హఫీజుల్లా స్పష్టం చేశారు. ప్రజలు తమ ఇష్టంతో హిందీ నేర్చుకోవాలనుకుంటే వారికి ఎలాంటి అడ్డంకులు లేవన్నారు. కానీ, ప్రభుత్వం అనుసరించాల్సిన భాషా విధానం వేరుగా ఉంటుందని డీఎంకే తెలిపింది. సీనియర్ డీఎంకే నాయకుడు టికెఎస్ ఎలంగోవన్ మాట్లాడుతూ తమిళనాడు భాషా విధానం చాలా కాలంగా స్థిరంగా ఉందని చెప్పారు. 1938 నుంచే తమిళనాడు హిందీకి వ్యతిరేకంగా పోరాడుతోంది. 1968లో ద్విభాషా విధానం అమలులోకి వచ్చింది. పవన్ కళ్యాణ్ అప్పటికీ జన్మించలేదు కూడా. తమిళనాడు భాషా విధానంపై ఆయనకు అవగాహన ఉండకపోవచ్చని ఎలంగోవన్ వ్యాఖ్యానించారు. పవన్ కళ్యాణ్ ఇటీవల తమిళనాడు రాజకీయ నాయకులపై విమర్శిస్తూ, తమిళ సినిమాలు వాణిజ్య ప్రయోజనాల కోసం హిందీలోకి డబ్ చేయించుకోవడం అర్థం అయితే, అదే హిందీని వ్యతిరేకించడమంటే ఏంటని ప్రశ్నించారు. ఆయన ఈ వ్యాఖ్యలు చేయడంతో డీఎంకే, ఇతర తమిళ రాజకీయ నేతలు తీవ్రంగా స్పందించారు.

## బాల్కొండలో రైతులకు రుణమాఫీ కాలేదు : వేముల

హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యుల మధ్య వాడీవేడి చర్చ జరుగుతోంది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానానికి సంబంధించిన చర్చలో పాల్గొన్న బీఆర్ఎస్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి.. ప్రభుత్వం చెబుతున్నట్టుగా రాష్ట్రంలో ఎక్కడా పూర్తి రుణమాఫీ కాలేదని అన్నారు. దీనికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందిస్తూ తాము పూర్తిస్థాయిలో రుణమాఫీ చేశామని, లెక్కలతో సహా వెల్లడిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా బాల్కొండ నియోజకవర్గం అంశాన్ని భట్టి ప్రస్తావించారు. బాల్కొండలో కూడా పూర్తిస్థాయిలో రుణమాఫీ అయ్యిందన్నారు. దీనిపై బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తన నియోకవర్గంలో మొత్తం 51 వేల మంది రైతులకు రుణమాఫీ జరగాల్సి ఉంటే కేవలం 20 వేల మందికే రుణాలు మాఫీ చేశారని చెప్పారు. ఇంకా 31 వేల మందికి రుణమాఫీ కాలేదని అన్నారు. అంతేగాక బీఆర్ఎస్ హయాంలో రెండు విడతల్లో చేసిన రుణమాఫీ కంటే ఇప్పటి కాంగ్రెస్ సర్కారు చేసిన రుణమాఫీ చాలా తక్కువగా ఉందని విమర్శించారు. నేను చెప్పింది అవాస్తవమైతే చర్చకు ఇచ్చే సమాధానంలో ఆ విషయాన్ని ప్రస్తావించాలని అన్నారు. రుణమాఫీ అంశంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయడంతో కాంగ్రెస్ సభ్యులు ఎదురుదాడికి దిగారు. మీ హయాంలో ఏం చేశారని ప్రశ్నంచారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ తీరును వేముల ఎద్దేవా చేశారు. మేం ఏం చేశామనేది గతమని, మీరేం చేస్తున్నారో చెబుతుంటే మా మీద ఏడవడం దేనికని ప్రశ్నించారు. మీరు అధికారంలోకి వచ్చి 17 నెలలు పూర్తయ్యిందని, 17 నెలలుగా మా మీద ఏడుస్తూనే ఉన్నారని, ఇంకెన్నాళ్లు ఏడుస్తారని..? వ్యంగ్యంగా ప్రశ్నించారు.

## పసుపు ధరలు పెంచి రైతులను ఆదుకోండి

### కేంద్రమంత్రికి మంత్రి తుమ్మల లేఖ

హైదరాబాద్ : పసుపు ధరలను పెంచి కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలనిమంత్రి తుమ్మల నాగేశ్వరరా రావు కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు ఆయన కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దృష్టికి తీసుకెళ్లారు. పసుపు ధర పడిపోయే సూచనలు కనిపిస్తున్నాయం మంత్రి లేఖ రాశారు. రాష్ట్రంలో పసుపు ధరలపై దృష్టి సారించి పసుపు రైతులను ఆదుకోవాలని తుమ్మల లేఖలో కోరారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం కింద పసుపును కొనుగోలు చేయాలని కోరారు. ఎన్ఏఎఫ్ఈడీ ద్వారా మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద పసుపు సేకరణ చేయాలనీ కేంద్రమంత్రి శివరాజ్ చౌహాన్‌ను మంత్రి తుమ్మల కోరారు. రాష్ట్రంలో పసుపు సాగు సుమారు 42,093 ఎకరాలు అని.. 1,25,436 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరిగిందన్నారు. ప్రస్తుతం, పసుపు ధర క్వింటాల్‌కు రూ.17,000 నుంచి రూ.11,000 మధ్య ఉందన్నారు. అయితే ఇది మరింత తగ్గే సూచనలు ఉన్నాయన్నారు. ఇంకా గత సంవత్సరం పసుపు నిల్వలు అమ్ముడుపోలేదని తెలిపారు. గత రెండు సంవత్సరాల్లో పసుపు ధరల నాణ్యత ఆధారంగా దాదాపు 17? నుంచి 27? వరకు తగ్గాయన్నారు. రైతులను ఆర్థిక నష్టాల నుంచి రక్షించడానికి తక్షణ జోక్యం చేసుకోవాలని వినతి చేశారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సు మేరకు సాగు ఖర్చు ఆధారంగా మార్కెట్ ఇంటర్వెన్షన్ ప్రైస్‌తో ఎన్ఏఎఫ్ఈడీ ద్వారా మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద పసుపును కొనుగోలు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖలో కోరారు. అంతకు ముందు కూడా కేంద్రమంత్రికి లేఖ రాసిన మంత్రి.. మార్చి నెలలో అధికమొత్తంలో పసుపు పంట మార్కెట్ కు వచ్చే అవకాశం ఉన్నందున రైతులు నష్టపోకుండా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని లేఖలో పేర్కొన్నారు. రాష్ట్రంలో పసుపు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. సీజన్ ప్రారంభం నుంచే సరైన గిట్టుబాటు ధర లేక రైతులు అల్లాడుతున్న పరిస్థితి. అంతేకాకుండా మార్కెట్‌లో దోపిడీకి అంతేలేకుండా పోయింది. చాలా ఏళ్ల నుంచి పసుపు సాగు చేస్తున్నప్పటికీ ఇల్లాంటి పరిస్థితి ఎప్పుడూ లేదని రైతులు వాపోతున్నారు. పసుపుకు గిట్టుబాటు ధర కల్పించాలంటూ రైతులు రో÷-డడెక్కి ధర్నాలు కూడా చేశారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని.. పసుపుకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## పబ్లిక్ సర్వీసెస్ రూల్స్ మార్పు చేస్తూ ఉత్తర్వులు

అమరావతి : స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా ఏపీ పబ్లిక్ సర్వీసెస్ డెలివరీ గ్యారంటీ రూల్స్‌ను సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. 2018లో తీసుకొచ్చిన ఏపీ పబ్లిక్ సర్వీసెస్ డెలివరీ గ్యారంటీ రూల్స్‌ను సవరిస్తున్నట్టు పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ నోటిఫికేషన్ జారీ చేశారు. లిఫ్ట్‌లు, ఎస్కలేటర్ల ఉత్పత్తి, ఏర్పాటు లైసెన్సులను 15-21 రోజుల్లోగా జారీ చేసేలా సర్వీస్ డెలివరీ గ్యారంటీ రూల్స్‌లో మార్పులు చేస్తూ ఆదేశాలు ఇచ్చారు. పారిశ్రామిక, వాణిజ్య నిర్మాణాల్లో వినియోగించే లిఫ్ట్‌లు, ఎస్కలేటర్ల ఉత్పత్తి, బిగింపు, లైసెన్సుల జారీ, రెన్యువల్ తదితర అనుమతుల కోసం ఈ సవరణ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ అంశానికి సంబంధించిన బిల్లును ఇటీవలే ఏపీ శాసనసభ కూడా ఆమోదించింది.

## తరచూ రాహుల్ వియత్నాం పర్యటన

### ఆ దేశంపై ఎందుకంత ప్రేమో
### విమర్శలు గుప్పించిన బిజెపి

న్యూఢిల్లీ : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలను లక్ష్యంగా చేసుకుని భాజపా మరోసారి విమర్శలు గుప్పించింది. కొంతకాలంగా ఆయన తరచూ వియత్నాం వెళ్తున్నారని.. ఒక్కసారిగా ఆ దేశం పట్ల అంత అనురాగం ఎందుకు కలిగిందని ప్రశ్నించింది. సొంత నియోజకవర్గంలో కన్నా వియత్నాంలోనే ఆయన ఎక్కువ సమయం గడుపుతున్నారని భాజపా నేత, కేంద్ర మాజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్ మీడియా సమావేశంలో విమర్శించారు. 'రాహుల్ గాంధీ ఎక్కడ ఉన్నారు? వియత్నాం వెళ్లారని విన్నాను. తన సొంత నియోజకవర్గం రాయ్‌బరేలీలోనూ ఆయన ఇన్ని రోజులు ఉండటం లేదు. తరచూ ఆ దేశాన్ని సందర్శిస్తుండటం ఆసక్తికరంగా ఉంది. నూతన ఏడాది సమయంలోనూ వియత్నాంలో ఉన్నారు. దాదాపు 22 రోజులు అక్కడ గడిపారు. ఆ దేశం పట్ల హఠాత్తుగా అంత ప్రేమ ఎందుకు పుట్టుకొచ్చిందో చెప్పాలి' అని రవిశంకర్ ప్రసాద్ వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష నేతగా ఆయన భారత్‌లో అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలను భాజపా చాలా కాలంగా రాజకీయ అస్త్రాలుగా మలుచుకుంటోంది. గతేడాది డిసెంబరులోనూ ఆయన వియత్నాం పర్యటనపై విరుచుకుపడింది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణంపై దేశమంతా సంతాపం వ్యక్తం చేస్తున్న వేళ.. కొత్త సంవత్సరం కోసం వియత్నాం వెళ్లారని ఆరోపించింది. కాంగ్రెస్ మాత్రం వీటిని కొట్టిపారేసింది. ఆయన ప్రైవేటు పర్యటనలను భాజపా రాజకీయం చేస్తోందని, ఒక వ్యక్తిగా ఆయనకు విదేశాలకు వెళ్లే హక్కు ఉందని స్పష్టం చేసింది.

# సంపాదకీయం

## దక్షిణాది తురుపుముక్క పవన్ కళ్యాణ్!

జనసేనాని,ఎపి డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ పిఠాపురం వేదికగా పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చేసిన ప్రసంగం పరిశీలిస్తే..ఆయనలో పరిణతి చెందిన రాజకీయ నాయకుడిని చూడవచ్చు. దేశం పట్ల, ప్రజల సమస్యల పట్ట నిబద్దత కలిగిన నాయకుడిని చూడవచ్చు. అలాగే దక్షిణాదిలో ఇక నాయకులకు కొరత లేదన్న విషయమూ గమనించవచ్చు. ఎంతో హుందాగా, ఉన్నది ఉన్నట్లుగా.. ముక్కుసూటిగా ఆయన తన అంతరంగాన్ని ఆవిష్కరించారు. పివి నరసింహారావు, జైపాల్ రెడ్డి, వెంకయ్య నాయుడు, విద్యాసాగర్ రావు లాంటి నేతల తరవాత అంతకన్నా బలమైన నాయకుడు ఆయనలో కనిపించాడు. తెలుగుదేశం నుంచి రామ్మోహన్ నాయుడు మంచి వక్తగా పేరు పొందారు. పార్లమెంటులో కూడా చురుకైనా పాత్ర పోషిస్తున్నారు. ఆయన కూడా దక్షిణాది నుంచి మంచి నేతగా ఎదిగే లక్షణాలను పుణికి పుచ్చు కున్నారు. అయితే పవన్ కళ్యాణ్ ఓ రకంగా దక్షిణాదికి తురుపుముక్కగా చెప్పుకోవచ్చు.

పవన్ మాట్లాడినప్పుడల్లా ప్రకాశ్ రాజ్ లాంటి వారు విమర్శలు చేస్తూనే ఉన్నారు. సనాతన ధర్మం గురించి మాట్లాడినా విమర్శించన ఘనుడు ప్రకాశ్ రాజ్. తాజాగా కూడా దక్షిణాన హిందీ గురించి పవన్ కళ్యాణ్ మాట్లాడిన దానికి విపరీత వ్యాఖ్యాలను చేశారు. ఇదంతా పక్కన పెడితే దక్షిణాదిలో గట్టిగా నిలబడే నాయకుడిగా పవన్ కళ్యాణ్ ఉంటారని చెప్పడంలో సందేహం లేదు. దేశం గురించి, సమస్యల గురించి బాగా అవగాహనతో ఉన్న నేత పవన్ కళ్యాణ్ అనడంలో సందేహం లేదు. ఆయన చేసిన ప్రసంగం, సమస్యలు, దేశం పట్ల ఉన్న అవగాహన ఇవన్నీ కూడా పరిణతి చెందిన నేతగా నిలబెట్టాయనడంలో సందేహం లేదు. జనసేన 11 ఏండ్ల ప్రస్థానంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని,..ఎన్నో కష్నష్టాలను ఓర్చుకుని..వేధింపులను తట్టుకుని...అరాచక పార్టీని అధికారం నుంచి దింపడమే కాదు...11 సీట్లకే పరిమితం చేశామని జనసేనాని తన పోరాట పటిమను, పడ్డ కష్టాలను వివరించారు. నిజానికి ఎపిలో జగన్ రాజ్యంలో విపక్ష నేతలను కట్టి పడేయడం లక్ష్యంగా పాలన సాగించారు. అసెంబ్లీ గేటును కూడా తాకనివ్వమని చెప్పిన వారిని అధికారానికి దూరం చేశామని పవన్ అందుకే అన్నారు. ఆయనలో ఉన్న కసి, పట్టుదలను ఈ సందర్భంగా మనం గమనించవచ్చు. ఎంతపట్టుదల, నమ్మకం, సమస్యల పట్ల అవగాహన, ప్రజల పట్ల విశ్వాసం ఉంటే తప్ప రాజకీయనేతగా నిలబడలేరు. ఎన్టీఆర్ తొలినాళ్లలో రాజకీయాల్లోకి వచ్చిన సందర్భంగా మాట్లాడిన తీరును బేరీజు వేసుకుంటే ఇప్పుడు..పవన్ కళ్యాణ్ తీరు అలాగే ఉంది. ఆయనకు దేశం పట్ల ఉన్న అంకితభావం కనిపిస్తోంది. హిందీభాష పట్ల జరుగుతున్న రగడ, సనాతన ధర్మాన్ని కించపరుస్తున్న తీరును కూడా ఆయన గట్టిగానే ఎదుర్కొన్నారు. పివి నరసింహారావు తరవాత దక్షిణాదిలో పలువురు నేతలు వెలుగులోకి వచ్చారు. ప్రముఖంగా వెంకయ్యనాయుడు, జైపాల్ రెడ్డి ఉన్నారు. వీరి తరవాత ఇప్పుడు నాయకులు లేకుండా పోయారు. భాషపై స్పష్టమైన ఆధిక్యం ఉండాలి. అలాగే తాను చేయగలనన్న ధైర్యం ఉండాలి. ఇవి పవన్‌లో చూస్తున్నాం. ఎన్నికల్లో ఓడినా అడుగు ముందుకే వేశామని, ఎన్నికల్లో విజయం సాధించామని పవన్ కళ్యాణ్ అనడంలో ఓ ధైర్యం కనిపించింది. 'మనం నిలబడ్డాం.. పార్టీని నిలబెట్టాం. నాలుగు దశాబ్దాల టీడీపీని నిలబెట్టాం. 2019లో మనం ఓడిపోయినప్పుడు మీసాలు మెలేశారు.. జబ్బలు చరిచారు. మన ఆడపడుచుల్ని అవమానించారు. ప్రజల్ని ఇబ్బంది పెట్టారు. ఇదేం న్యాయం అని వీర మహిళలు అడిగితే కేసులు పెట్టి జైళ్లలో వేశారు. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ అనుభవం ఉన్న నాయకుడిని కూడా జైల్లో పెట్టారు. నన్ను అణచివేసేందుకు అనేక కుట్రలు చేశారు. అసెంబ్లీ గేటు కూడా తాకనీయమని ఛాలెంజ్ చేశారు. 21 మంది ఎమ్మెల్యేలతో అసెంబ్లీలో, ఇద్దరు ఎంపీలతో పార్లమెంట్‌లో అడుగు పెట్టాం. దేశమంతా మన వైపు చూసేలా 100 శాతం స్ట్రయిక్ రేట్ సాధించాం అంటూ ఆయన ఉద్వేగపూరితంగా చేసిన ప్రసంగం నిజంగానే ధీరోదాత్త నాయకుడి పాత్రను ఆవిష్కరించారు. భయం లేదు కాబట్టే ఇంత దూరం వచ్చా. గుండె ధైర్యమే కవచం' అని పవన్ చేసిన ప్రసంగ పాఠం ఆయనలో లోలోతుగా ఉన్నా పరిణతి చెందిన నాయకుడిని చూడవచ్చు. 'జనసేన జన్మస్థలం తెలంగాణ.. కర్మస్థానం ఆంధ్రప్రదేశ్. నా తెలంగాణ కోటి రతనాల వీణ అంటూ దాశరథి కృష్ణమాచార్యుల కవిత్వంతో ఆయన తన ప్రసంగాన్ని ప్రారంభించడమే గాకుండా దేశం కోసం నిలబడ తామని ప్రకటించిన తీరును చూశాక తప్పకుండా పవన్ దక్షిణ్భాది రాజకీయాల్లో తనదైన ముద్ర వేస్తారనడం లో ఎలాంటి సందేహం లేదు. అలాగే ఆయన మాటమీద నిలబడతారని కూడా చెప్పవచ్చు. డిప్యూటి సిఎంగా ఇప్పటికే ఆయన చేపట్టిన పనులు ప్రజల్లో విశ్వాసం నింపాయి. సమస్యలపై పట్టుదలతో ముందుకు సాగుతున్న తీరు కూడా ప్రజల్లో ఆదరణను పెంచాయి. రుద్రవీణ వాయిస్తా.. అగ్నిధారలు కురిపిస్తాం.. అనే మాటలు నిజం చేశాం. బహు భాషలే భారతదేశానికి మంచిదని ప్రకటించారు. తమిళనాడు సహా అన్ని రాష్ట్రాలకు ఒకే సిద్ధాంతం ఉండాలని హిందీవ్యతిరేక తీరును గట్టిగానే తూర్పార బట్టారు. జనసేన వంద శాతం స్ట్రయిక్ రేట్ సాధించిందంటే.. అందుకు ఏడు సిద్ధాంతాలే కారణం. ఎంతో ఆలోచించి ఏడు సిద్ధాంతాలు పెట్టాం. సినిమాల్లోనూ దేశ భక్తి ఉండాలని తపించేవాడిని. సమాజంపై అవగాహన లేకుండానే పార్టీ పెట్టేస్తామా? సమాజంలో మార్పు కోసం వచ్చా.. ఓట్ల కోసం కాదు. భిన్నమైన వ్యక్తుల్లో ఏకత్వం చూడగలగడమే నా ఐడియాలజీ అని భావోద్వేగంతో చేసిన ప్రసంగం ఇప్పుడు రాకీయాల్లో మార్పుకు శ్రీకారం అవుతుందనడంలో సందేహం లేదు. రాజకీయాల్లో సైద్ధాంతిక విధానాన్నే ఎంచుకున్నా. ఎంత పోరాటం చేస్తే ఇక్కడికి వచ్చాం.. అర్థం చేసుకోవాలి. బలమైన దేశం కావాలంటే.. బలమైన ప్రజలు ఉండాలి. దేశం కోసం బలంగా నిలబడే యువత ఉంటేనే దేశం మారుతుంది. భవిష్యత్తును నిర్మించే యువ నాయకత్వం రావాలి. భవిష్యత్తుకు దిశా నిర్దేశర చేయాల్సిన సమయం. సనాతన ధర్మం నా రక్తంలోనే ఉంది.. నిరూపించుకోవాల్సిన అవసరం లేదని ఇలా చెబుతూ పోతుంటే...ఆయన ధృడసంకల్పాన్ని చూడవచ్చు. ఎవరెన్ని విమర్శలు చేసినా, రాజకీయంగా విభేదించినా పవన్ కళ్యాణ్ దక్షిణ భాతర దేశంలో మరో అద్భుతమైన నేతగా నిలబడతారనడంలో సందేహం లేదు.

# మరో వారం రోజుల్లో ఐపిఎల్



### వేసవిలో మజా ఇవ్వనున్న టోర్నీ

ముంబై : క్రికెట్‌లో మరో మజా గేమ్ ప్రారంభం కాబోతుంది. ఇప్పటికే ఛాంపియన్స్ ట్రోఫీని టీమిండియా కైవసం చేసుకోవడంతో క్రికెట్ అభిమానుల్లో మళ్లీ ఉత్సాహం నెలకొంది. ఈ క్రమంలో ఐపిఎల్‌కు తెరలేవనుంది. అభిమానులు ఎంతో ఆతృతతో ఎదురు చూస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఐపిఎల్ సీజన్ 2025కి మార్చి 22న ప్రారంభం కానుంది. మే 25న కోల్‌కతాలో జరిగే ఫైనల్ తో మెగా టోర్నీకి తెరపడుతుంది. ఈసారి కూడా పది జట్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి. డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్‌రాయల్ ఛాలెంజర్స్ జట్ల మధ్య మార్చి 23న కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరిగే మ్యాచ్‌తో టోర్నమెంట్ ప్రారంభమవుతోంది. ఈ సారి అన్ని జట్లు ట్రోఫీపై కన్నేశాయి. కిందటిసారి రన్నరప్‌గా నిలిచిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ఈసారి ఎలాగైనా ఛాంపియన్‌గా నిలవాలనే పట్టుదలతో ఉంది. కోల్‌కతా కూడా టైటిల్ నిలబెట్టుకోవాలనే లక్షంతో పోరుకు సిద్ధమైంది. ప్రస్తుత ఛాంపియన్ కోల్‌కతా కూడా టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. రహానె సారథిగా రావడంతో జట్టు ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే ఆటగాళ్లకు జట్టులో కొదవలేదు. ఇలా బరిలో ఉన్న పది జట్లలో కూడా ప్రతిభావంతులైన క్రికెటర్లు ఉండడంతో మెగా టోర్నమెంట్ ఆసక్తికరంగా సాగడం ఖాయం. ఇక ఆరంభం నుంచి టోర్నమెంట్‌లో ఆడుతున్నా ఒక్కసారి కూడా ట్రోఫీని సాధించడంలో విఫలమవుతూ వస్తున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ఢిల్లీ క్యాపిటల్స్, పంజాబ్ కింగ్స్ ఈసారి ఆ లోటును తీర్చుకోవాలని భావిస్తున్నాయి. మూడు జట్లు కూడా కొత్త కెప్టెన్ల సారథ్యంలో బరిలోకి దిగుతున్నాయి. ఢిల్లీ అక్షర్ పటేల్‌ను కెప్టెన్‌గా నియమించుకుంది. పంజాబ్ కింగ్స్ శ్రేయస్ అయ్యర్‌కు నాయకత్వ బాధ్యతలు అప్పగించింది. ఇక బెంగళూరు సారథిగా రజత్ పటిదార్ ఎంపికయ్యారు. కొత్త కెప్టెన్ల సారథ్యంలో ట్రోఫీని గెలుచుకోవాలని ఈ మూడు జట్లు తహతహలాడు తున్నాయి. ఇక ప్రస్తుత ఛాంపియన్ కోల్‌కతా కూడా కొత్త సారథిని ఎంపిక చేసింది. ఈసారి అజింక్య రహానె కోల్‌కతా టీమ్ కెప్టెన్సీ బాధ్యతలను చేపట్టనున్నాడు. కిందటి సీజన్‌లో సారథిగా ఉన్న శ్రేయస్ అయ్యర్‌ను కోల్‌కతా నైట్‌రైడర్స్ రిటేన్ చేసుకునేందుకు ఆసక్తి చూపించలేదు. దీంతో అతను వేలం పాటలో బరిలోకి దిగిన పంజాబ్‌కు ఎంపికయ్యాడు. పంజాబ్ టీమ్ భారీ మొత్తాన్ని వెచ్చించి శ్రేయస్‌ను సొంతం చేసుకుంది. మరోవైపు లక్నో సూపర్ జెయింట్స్ కూడా భారీ ఆశలతో కనిపిస్తోంది. మెగా వేలం పాటలో రిషబ్ పంత్ భారీ మొత్తాన్ని వెచ్చించి సొంతం చేసుకుంది. అనుకున్నట్టే రిషబ్‌కే సారథ్య బాధ్యతలను అప్పగించింది. అతని కెప్టెన్సీలో లక్నో తన అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. గుజరాత్ టైటాన్స్ కూడా భారీ ఆశలతో పోరుకు సిద్ధమైంది. ఈసారి కూడా శు భ్‌మన్ గిల్ జట్టుకు సారథ్యం వహిస్తున్నాడు. రషీద్ ఖాన్, ÷–లగెన్ ఫిలిప్స్, రాహుల్ తెవాటియా, జోస్ బట్లర్ వంటి టి20 స్పెషలిస్టులు జట్టులో ఉన్నారు. మాజీ ఛాంపియన్‌లు ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్‌లు కూడా మెరుగైన ప్రదర్శన ఇచ్చేందుకు సిద్ధమయ్యాయి. రెండు జట్లలోనూ ప్రతిభావంతులైన ఆటగాళ్లకు కొదవలేదు. ఈసారి ట్రోఫీని సాధించాలనే పట్టుదలతో రెండు జట్లు కనిపిస్తున్నాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్ కూడా టైటిల్‌పై కన్నేసింది. కమిన్స్ సారథ్యంలోని హైదరాబాద్ రెండు విభాగాల్లోనూ సమతూకంగా కనిపిస్తోంది. అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్, ఇషాన్ కిషన్, నితీష్ కుమార్ రెడ్డి, కమిందు మెండిస్‌లతో హైదరాబాద్ బలంగా ఉంది.


## సునీతా విలియమ్స్‌కు లైన్ క్లీచర్

### రోదసీలోకి దూసుకెళ్లిన ఫాల్కన్

వాషింగ్టన్ : మూడోసారి రోదసీలోకి వెళ్లి అంతరిక్షకేంద్రంలోనే చిక్కుకుపోయిన భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ త్వరలోనే భూమ్మీద కాలుమోపే దిశగా అడుగులు పడ్డాయి. నాసా-స్పేస్ ఎక్స్‌లు తాజాగా క్రూ-10 మిషన్‌ను చేపట్టాయి. నలుగురు వ్యోమగాములతో కూడిన ఫాల్కన్ 9 రాకెట్ భారత కాలమానం ప్రకారం శనివారం ఉదయం 4.33 గంటలకు కెన్నడీ స్పేస్‌సెంటర్ నుంచి నింగిలోకి తీసుకెళ్లింది. దాదాపు తొమ్మిది నెలలుగా సునీతా విలియమ్స్, బచ్ విల్మోర్‌అంతరిక్ష కేంద్రం లోనే ఉంటున్న విషయం తెలిసిందే. వారిని భూమిపైకి తీసుకొచ్చేందుకు మూడు రోజుల క్రితం క్రూ-10 మిషన్ ను చేపట్టేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. అయితే చివరి నిమిషంలో సాంకేతిక కారణాలతో ఆ ప్రయోగాన్ని నిలిపేశారు. తాజాగా వారిని తీసుకొచ్చేందుకు మళ్లీ ప్రయోగం చేపట్టారు. డ్రాగన్ క్యాప్సుల్‌లో ఐఎస్ఎస్‌కు వెళ్లిన వారిలో అన్నె మె÷–లకెయిన్, నికోల్ అయర్స్, టకుయా ఒనిషి, కిరిల్ పెస్కోవ్ వ్యోమగాములు ఉన్నారు. 2024 జూన్ 5న ప్రయోగించిన బోయింగ్ వ్యోమనౌక స్టార్‌లైనర్‌లో ఐఎస్ఎస్‌కు సునీతా విలియమ్స్, బచ్ విల్మోర్‌లు చేరుకున్నారు. స్టార్‌లైనర్‌లో సమస్యలు తలెత్తడంతో వారు లేకుండానే అది భూమిపైకి చేరింది. దీంతో వారిని తీసుకురావడానికి పలు అవాంతరాల దాదాపు తొమ్మిది నెలల తర్వాత నలుగురు వ్యోమగాములను ఐఎస్ఎస్‌కు పంపించారు.



## మరో దుందుడుకు చర్య దిశగా ట్రంప్?




### 41 దేశాలపై ట్రావెల్ బ్యాన్ విధించే యోచన

వాషింగ్టన్ : ఉద్యోగాల కోతలు, దేశాలపై సుంకాలతో దూకుడు పాలన సాగిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా మరో కీలక నిర్ణయానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. పదుల కొద్దీ దేశాలపై ట్రావెల్ బ్యాన్ విధించే అంశాన్ని ట్రంప్ సర్కారు పరిశీలిస్తున్నారని సమాచారం. 41 దేశాల పౌరులు అగ్రరాజ్యంలోకి రాకుండా త్వరలో ప్రయాణ ఆంక్షలు జారీ చేయనున్నట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఇందుకు సంబంధించి ఒక ఇంటర్నల్ మెమో బయటికొచ్చింది. అందులో మొత్తం ఈ 41 దేశాలను మూడు గ్రూప్‌లుగా విభజించినట్లు సమాచారం. పది దేశాలతో ఉన్న మొదటి గ్రూప్‌లో అఎ÷–గానిస్థాన్, ఇరాన్, సిరియా, క్యూబా, ఉత్తరకొరియా వంటివి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ దేశాల పౌరులకు వీసాల జారీ పూర్తిగా నిలిపివేయ నున్నారని ప్రచారం. ఇక, రెండో గ్రూప్‌లో ఇరిట్రియా, హైతీ, లావోస్, మయన్మార్, దక్షిణ సూడాన్ దేశాలున్నాయి. వీటిపై పాక్షిక ఆంక్షలు అమలుచేయనున్నారని ఆ మెమోలో పేర్కొన్నారు. ఈ దేశాలకు పర్యటక, విద్యార్థి వీసాల వంటివి జారీ చేయకూడదని భావిస్తున్నారు. అయితే వీటికి కొన్ని మినహాయింపులు కల్పించే అవకాశాలున్నాయి. మూడో గ్రూప్‌లో పాకిస్థాన్, భూటాన్ సహా 26 దేశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ దేశాలు 60 రోజుల్లోపు తమ 'లోపాలను పరిష్కరించు కోవడానికి' ప్రయత్నాలు చేయకపోతే అక్కడి పౌరులకు వీసా జారీని పాక్షికంగా నిలిపివేయాలని యూఎస్ యంత్రాంగం భావిస్తున్నట్లు ఆ మెమోలో ఉంది. ప్రస్తుతానికి ఈ జాబితాను అమెరికా మీడియా సంస్థలు ప్రచారం చేయగా.. ఇందులో మార్పులు ఉండొచ్చని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఆమోదం తర్వాత దీనిపై అధికారిక ప్రకటన వెలువడనున్నట్లు సమాచారం. ట్రంప్ తొలిసారి అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనూ ఇలాంటి నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇరాన్ సహా ఏడు ముస్లిం మెజారిటీ దేశాల ప్రయాణికులపై నిషేధం విధించారు. అప్పట్లో ఈ నిర్ణయాన్ని అమెరికా సుప్రీంకోర్టు కూడా సమర్థించింది. ఇక, 2023లోనూ ట్రంప్ ఈ ప్రణాళికల గురించి ప్రస్తావించారు. రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపడితే గాజా స్ట్రిప్, లిబియా, సోమాలియా, సిరియా యెమెన్ వంటి దేశాల నుంచి పౌరుల రాకపై ఆంక్షలు విధిస్తానని తెలిపారు. దేశ భద్రతకు ముప్పు అని భావించేవారిని అమెరికాలోనికి ఎన్నటికీ రానివ్వబోమని అన్నారు.

## పశ్చాత్తాప శ్రమ దినాలు

మానవుడు ఎంతటి మహనీయుడో, తప్పులు చేసి అంతటి బలహీనుడైపోతాడు కూడా. ఆ బలహీనత నుంచి మళ్లీ కోలుకోవాలి. తిరిగి శక్తిని పుంజుకోవాలి. ఇక్కడే ప్రతి మనిషీ తన మతాన్ని, దైవశక్తినీ ఆశ్రయిస్తాడు. ఈ ప్రక్రియలో భాగంగా ఒక్కో మతం ఒక్కో రకమైన నియమాలు సూచిస్తున్నది. క్రైస్తవ సమాజం నలభైరోజులపాటు క్రీస్తుకు శిలువ వేసిన సంఘటనలు ధ్యానించుకొంటుంది. శుభ శుక్రవారానికి కచ్చితంగా నలభై రోజుల ముందు నుంచే ఈ నియమాలు పాటిస్తారు. ప్రభువు మరణానికి సంబంధించి ఆయన ప్రజల కోసం పడిన పాట్లు ధ్యానించుకుంటారు. ఈ నేపథ్యంలో తాము చేసిన తప్పులు, పాపాలను తలుచుకుంటారు. అంటే అబద్ధాలు ఆడటం దగ్గర నుంచి ఇతరుల్ని మోసం చేయడం, హింసించడం, ద్వేషించడం, సోమరితనానికి అలవాటు పడి ఇతరుల శ్రమను దోచుకోవడం లాంటి దుష్కార్యాలను సంస్కరించుకుంటారు. ఇలాంటి పనులు ఇక మీదట చేయకూడదని మనసు మార్చుకొనే ప్రయత్నం చేస్తారు. తమ ప్రవర్తనను మార్చుకోవడానికి ప్రభువు బోధనలను స్మరించుకుంటారు. ఇందుకోసం ఈ నలభై రోజులను ఆధ్యాత్మికంగా గడిపే ప్రయత్నం చేస్తారు. క్రైస్తవ సమాజం ఈ నలభై రోజులను పశ్చాత్తాప శ్రమ దినాలుగా పేర్కొన్నది. ఈ కాలంలో క్రీస్తుకు దగ్గర కావడానికి కొంత శ్రమపూరిత జీవన విధానంతో, చిత్తశు ద్ధితో పాటించి తీరాలని నిర్ణయించుకొంటారు. ముఖ్యంగా విలాసవంతమైన ఆహారపానీయాలకు దూరంగా ఉంటారు. సుఖసౌఖ్య భోగాల్ని తగ్గించుకుంటారు. త్యాగమయ జీవనాన్ని కొనసాగిస్తారు. ఉపవాసాలు ఆచరిస్తారు, ఉపదేశాలను వింటారు. జీవన విలువ తెలుసుకొని, జీవిత పరమార్థం సాధించుకోడానికి ప్రయత్నిస్తారు.



ఆధ్యాత్మికం

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమని కలిసిన ధర్మపురి కోర్ట్ ఏజిపి ఇమ్మడి శ్రీనివాస్



ధర్మపురి, మార్చి 15, (ది క్రైమ్ న్యూస్): జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమనీ శనివారం ధర్మపురి కోర్ట్ ఏజిపి ఇమ్మడి శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిశారు. ధర్మపురి కోర్ట్ ఏజిపి ఇమ్మడి శ్రీనివాస్ ధర్మపురి జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ నూతనంగా భాద్యతలు స్వీకరించిన సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమనీ కలిసి ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి చిత్ర పటం, స్వామి వారి ప్రసాదం అందజేశారు.

## మంథనిలో బాబాసాహెబ్ డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆధునికరించాలి

- దళిత ప్రజా సంఘాల, నాయకులడిమాండ్



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)మార్చి 15:** మంథని పట్టణంలోని అంబేద్కర్ ప్రధాన చౌరస్తాలో గల బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం చుట్టూ ఉన్న బేస్మెంట్ గద్దె చుట్టూ రాజ్యాంగంలోని సూక్తు లతో కూడిన నూతన టైల్స్ అమర్చి ఆధునికరించాలని దళిత ప్రజా సంఘాల నాయకులు ఈరోజు మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్ కి విన్నతి పత్రం ఇవ్వడం జరిగింది. ఏప్రిల్ 14వ తేదీన భారత రాజ్యాంగ నిర్మాత,ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవ కార్యక్రమం కంటే ముందే చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహాన్ని నూతన హంగులతో ఆధునీకరించి వాటర్ ఫౌంటెన్ రిపేరు చేపించి లైటింగ్స్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో దళిత, ప్రజా సంఘాల నాయకులు బూడిద తిరుపతి, బూడిద గణేష్, మంథని రాకేష్, గొర్రెంకల సురేష్, మంథని లింగయ్య, మంథని రాజేశం, పోయిల తిరుపతి, బాబు, రవి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వసంతోత్సవ వేడుకలు



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)మార్చి 15:** హెూలీ పండుగ సందర్భంగా స్థానిక శ్రీలేశ్వర-సిద్దేశ్వర దేవాలయంలో స్వామి-అమ్మ వార్లకు శుక్రవారం రాత్రి ఘనంగా వసంతోత్సవము నిర్వహించారు. వేదపండితులు మారుపాక ప్రశాంత్ శర్మ, నల్గొండ గోపాల్ ల ఆధ్వర్యంలో లోకే సుధాకర్ రావు-సతీదేవి దంపతులు వేదోక్తంగా పూజ, వసంత ఉత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద ప్రసాదాల వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్తలు లోకే సుధాకర్ రావు, లోకే మనోహర్ రావు, శ్రీధర్ రావు, భక్తులు రావికంటి మనోహర్, అవధానుల శ్రీనివాస్, కొత్త శ్రీనివాస్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## బడుగులకు రాజ్యాధికారంతో కాన్షీరాంకు నివాళి



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** బడుగులకు రాజ్యాధికారం సాధించడంతోనే కాన్షీరాంకు అసలైన నివాళి అని మాదిగ శక్తి వ్యవస్థాపకుడు బొంకూరి సురేందర్ సన్నీ అన్నారు.మాదిగ శక్తి అద్వర్యంలో శనివారం పెద్దపల్లిలో ఘనంగా కాన్షీరాం జయంతి వేడుకలు నిర్వహించారు. జెండా వద్ద కాన్షీరాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా సన్నీ మాట్లాడుతూ కాన్షీరాం ఆశయాలకు అనుగుణంగా రానున్న రోజుల్లో బిసి అభ్యర్తులను ఎమ్మెల్యేలుగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. మాదిగ శక్తి జిల్లా అధ్యక్షులు కల్లెపల్లి రవి అధ్వర్యంలో కాన్షీరాం 91వ జయంతోత్సవాన్ని నిర్వహించగా తాడూరి శ్రీమాన్, మంద భాస్కర్ యాదవ్, రామగిరి చంద్రమౌళి, గద్దల వినయ్ కుమార్, తూముల శ్రీనివాస్, బొడ్డుపల్లి రామ్మూర్తి, బొంకూరి నరేందర్, కుక్క అశోక్, కల్లెపల్లి సతీష్, తాళ్లపల్లి అంజయ్య, బొరగల్ల రాంబాబు, ఆర్నకొండ ఈశ్వర్, పులిపాక రాజు, కుక్క శ్రవణ్, బొంకూరి నవీన్, పల్లె రాజేందర్, భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

# సమ్మర్ సీజన్‌లో నిర్దేశిత పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

- మార్చి 20 లోపు సిసి రోడ్ల బిల్లులు సమర్పించాలి
- పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ పై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పంచాయతీరాజ్ శాఖ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను సమ్మర్ సీజన్ వినియోగించుకొని వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.శనివారం పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ పై సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ గ్రామీణ పంచాయతీ రాజ్ విభాగానికి సంబంధించి పురోగతి ఉన్న పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని అన్నారు. జిల్లాలోని హెల్త్ సెంటర్స్ మరమ్మత్తు పనులు, సబ్ సెంటర్ భవనాలు, పాఠశాలల మరమ్మత్తు, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు, రెసిడెన్షియల్ పాఠశాలల ,హస్టల్స్ మరమ్మత్తు పనులకు నిధులు మంజూరు చేయడం జరిగిందని, అందుబాటులో ఉన్న నిధులను వినియోగించుకుంటూ సమ్మర్ సీజన్ పూర్తయ్యే లోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఉపాధి హామీ కింద మంజూరు చేసిన సి సి రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి మార్చి 20 లోపు బిల్లులు సమర్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో ఈఈ పంచాయతీరాజ్ గిరీష్ బాబు, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్అండ్ఆర్ కాలనీలో అవసరమైన వసతుల కల్పనకు చర్యలు

- త్రాగునీటి సమస్య పరిష్కారానికి సింగరేణి కృషి చేయాలి
- రోడ్లు, కాల్వల మళ్ళింపు పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- ఓసిపి-టు, లద్నాపూర్, రాజాపూర్, గ్రామాలలో పర్యటించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)మార్చి-15:** సింగరేణికి సంబంధించి లద్నాపూర్ ఆర్ అండ్ ఆర్ కాలనీలో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రామగిరి మండలంలోని సింగరేణి ఓపెన్ కాస్ట్ మైనింగ్-టు, లద్నాపూర్, రాజాపూర్ గ్రామాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ లద్నాపూర్ గ్రామంలో ఉన్న ఇండ్ల క్రింద ఉన్న 88 ఎకరాల భూమిని సైతం తప్పనిసరిగా సింగరేణి కు అప్పగించాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. లద్నాపూర్ గ్రామ ఆర్అండ్ఆర్ కాలనీ వద్ద అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.రోడ్డు మళ్లింపు, నీటి పారుదల శాఖ కాల్వల మళ్ళింపు చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలను సంబంధిత శాఖ అధికారులు సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. లద్నాపూర్ గ్రామంలోని శ్రీరాముని ఆలయంలో రాబోయే శ్రీరామనవమి వేడుకల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని, త్రాగునీటి సమస్య లేకుండా సింగరేణి అధికారులు చూసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. డిసెంబర్ 4, 2024 నాడు వచ్చిన స్వల్ప భూకంపం వల్ల పెద్దపల్లి మంథని రోడ్డు, కాల్వలో చిన్న క్రాక్స్ ఏర్పడ్డాయని, వీటిని సరి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట మంథని రెవెన్యూ డివిజన్ అధికారి సురేష్, సింగరేణి రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు, ఈఈ ఆర్ అండ్ బీ భావ్ సింగ్, రామగిరి తహసిల్దార్ సుమన్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వేలిముద్రలు పడక ఇబ్బంది పడుతున్న తాపీ మేస్త్రీలు

- లేబర్ కార్యాలయాల్లో ఐరీస్ మిషన్లు ఏర్పాటు చేయాలి
- కార్మికులకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలి
- భవన నిర్మాణ కార్మిక సమైక్య సంఘం అధ్యక్షులు చిలువేరు స్వామి



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)మార్చి 15:** తాపీ పని చేస్తున్న మేస్త్రీలకు క్లెయిమ్స్ రెన్యువల్ చేసే సమయంలో వేలిముద్రలు పడక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని భవన నిర్మాణ కార్మిక సమైక్య సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు చిలువేరు స్వామి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లేబర్ కార్డుకు ఆధార్ అనుసంధానం చేయడంతో సిమెంటు పని చేస్తున్న తాపీ మేస్త్రీలకు వేలిముద్రలు పడక సంక్షేమ పథకాల వల్ల వచ్చే డబ్బులు కోల్పోవాల్సి వస్తుందన్నారు. క్లెయిమ్స్ మరియు కార్డు రెన్యువల్ చేసే సమయంలో సమస్యలు తలెత్తుతున్నాయి అన్నారు. వెంటనే ఆన్లైన్ సమస్యలను మెరుగుపరిచి కార్మిక శాఖ కార్యాలయాల్లో, మీసేవ కేంద్రాలలో "ఐరిష్" మిషన్ ఏర్పాటు చేయాలన్నారు. పెండింగ్ క్లెయిమ్స్ లను త్వరగా పరిష్కరించాలన్నారు.55 సంవత్సరములు నిండిన కార్మికులకు 5 వేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ప్రమాద బీమా 10.లక్షల రూపాయలు, సాధారణ మరణం 5.లక్షలు, మ్యారేజ్ గిఫ్ట్, మెటర్నటీ 1.లక్ష ఇవ్వాలని, నిర్మాణ కార్మికులకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని, అడ్డాల వద్ద రెస్ట్ షెడ్, టాయిలెట్, కనీస సదుపాయాలు కల్పించాలని, వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్కే షరీఫ్, కొయ్యడ సంపత్,కుసుమ సురేష్, బండి తిరుపతి,రాములు, రాజమల్లు, రమేష్, అంజయ్య, సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గు రవాణాలో అంతరాయం ఏర్పడకుండా చూడాలి

- సింగరేణి జీఎం బి.వెంకటయ్య



**యైటింక్లయిన్ కాలని. (ది క్రైమ్ న్యూస్):** బొగ్గు రవాణాలో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా తగు శ్రద్ధ చూపాలని సింగరేణి ఆపరేషన్స్ డైరెక్టర్ ఎల్.వి.సూర్యనారాయణ సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం ఉదయం డైరెక్టర్ రామగుండం రెండవ ఏరియా జనరల్ మేనేజర్ బి. వెంకటయ్య తో కలిసి ఏరియా లోని ఓసిపి-3 ప్రాజెక్టు కోల్ హ్యాండ్లింగ్ ప్లాంటు నుండి జరుగుతున్న బొగ్గు రవాణాను పరిశీలించారు. బొగ్గు రవాణా జరుగుతున్న తీరును, ప్లాంటు ఆవరణలో రవాణా చేసేందుకు సిద్ధం చేసిన బొగ్గు నిలువలను, యంత్రాల పనితీరు, బంకర్ సామర్థ్యం తదితర విషయాలను అధికారులతో చర్చించి, స్వయంగా జైల్ బంకర్ లోనికి వెళ్ళి యంత్రాల పనితీరును కూడా ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవాణాకు ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా, తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆదే క్రమంలో ప్లాంటు నుండి రైల్వే రేకుల రవాణాను పెంచుతూ, రవాణాకు అనుగుణంగా బొగ్గు నిల్వలు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సంభద్దిత అధికారులను ఆదేశించారు. వార్షిక లక్షల సాధనకు 15 రోజుల సమయం మాత్రమే ఉన్నందున, అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని డైరెక్టర్ సూచించారు. ఇంకా డైరెక్టర్ వెంట ప్రాజెక్ట్ అధికారి ఎస్ మధుసూదన్, ఏరియా ఇంజినీర్ నరసింహారావ్, ఎస్ఓ టు జీఎం ఎం.రాముడు, డీజీఎం మురళీకృష్ణ, ప్లాంటు ఇంచార్జ్ సదానందం, ఏరియా సెక్యూరిటి అధికారి షరీఫ్ మహమ్మద్ ఉన్నారు.



# డ్రగ్స్ నష్టాల పై విస్తృత ప్రచారం కల్పించాలి

## • మాదక ద్రవ్యాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించిన అదనపు కలెక్టర్‌డి.వేణు

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జిల్లాలో మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై విస్తృత ప్రచారం కల్పించాలని అదనపు కలెక్టర్ డి.వేణు సంబంధిత అధికారులను ఆదేశించారు.శనివారం అదనపు కలెక్టర్ డి.వేణు సమీకృత జిల్లా కలెక్టరేట్ లో మాదక ద్రవ్యాల, డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టిన చర్యలపై సంబంధిత అధికారులతో జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశాన్ని నిర్వహించారు.

జిల్లా నార్కోటిక్ కంట్రోల్ సమావేశంలో జిల్లాలో నమోదవుతున్న ఎన్.డి.పి.ఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాధక ద్రవ్యాల వాడకం నియంత్రణ చర్యలు, మాదక ద్రవ్యాల నివారణ కోసం శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి చేయాల్సిన విస్తృత ప్రచారం వంటి పలు అంశాలను సుదీర్ఘంగా చర్చించారు. అదనపు కలెక్టర్ డి.వేణు మాట్లాడుతూ డ్రగ్స్, మాదకద్రవ్యాల నియంత్రణ కోసం జిల్లా నార్కోటిక్ సమావేశంలో పాల్గొనే ప్రతి శాఖ ప్రత్యేక కార్యచరణ రూపొందించుకొని అమలు చేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు.జిల్లాలో ఉన్న కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, మోడల్ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో డ్రగ్స్, మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై వైద్య అధికారులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు.డ్రగ్స్ వల్ల కలిగే విపరీత పరిణామాలపై అవగాహన వివరిస్తూనే సమాంతరంగా వాటి నియంత్రణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, మాదక ద్రవ్యాల రవాణా, సాగు, వినియోగం నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు.మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి అవసరమైన చికిత్స, కౌన్సిలింగ్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలనీ వైద్యారోగ్య శాఖ అధికారులకు సూచించారు. గోదావరిఖని ఆసుపత్రిలో 10 పడకల డీ అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేయడం



జరిగిందని, అవసరమైన వారికి ఇక్కడ చికిత్స అందించాలని అదనపు కలెక్టర్ సూచించారు. అటవీ శాఖ అధికారులు వారి పరిధిలోని అటవీ భూములు పరిశీలించి గంజాయి సాగు కనిపిస్తే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. జిల్లా లోని ఆసుపత్రులు, మెడికల్ షాపులలో స్టాక్ వివరాలను ప్రతి నెల తనిఖీ చేయాలని అదనపు కలెక్టర్ డ్రగ్ ఇన్స్ పెక్టర్ కు సూచించారు. చెడు అలవాట్ల వల్ల ఆరోగ్యం దెబ్బ తింటుందని, ఆలోచనా విధానం, ఆలోచనా శక్తి నశిస్తాయని అన్నారు. భావితరాలు మాదక ద్రవ్యాల పట్ల ఆకర్షితులు కాకుండా వారికి సమాజంలో మంచి, చెడు తెలియ జేయాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, పెద్దపల్లి ఏసిపి జి. క్రిష్ణ, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రకాష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మనిషికి మనిషి తోడు

- సాటి మనిషికి సహాయం చేయాలి
- మనిషికి మరో మనిషి భరోసా ఇవ్వాలి..
- మాజీ జడ్పీటీసీ మైదం భారతి-వరప్రసాద్



రామగిరి(ది క్రైమ్ న్యూస్)మార్చి 15:-మానవత్వంలో దైవాత్వాన్ని ఇముడ్చుకుని సాటి వ్యక్తులకు వారి కష్ట సుఖాలలో భారోసానిద్దాం, బాసటగా నిలుద్దాం, చేతనైన సహాయం చేద్దామని మాజీ జడ్పీటీసీ మైదం భారతి - వరప్రసాద్ అన్నారు. రామగిరి మండలం ఆదివారం పేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త జక్కుల దినేష్ కిడ్నీ సంబంధిత వ్యాధితో చికిత్సకొరకై కరీంనగర్ లో అక్షయ హాస్పిటల్ ఉండగా అతని కలిసి పరామర్శించి అతని చికిత్స కొరకై అతని కుటుంబ సభ్యులకు మాజీ జడ్పీటీసీ మైదం భారతి-వరప్రసాద్ అయిదు వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే వారితో పాటు మాజీ సర్పంచి వేపచెట్టు రాజేష్ రెండు వేలరూపాయలు, మాజీ ఉపసర్పంచ్ అట్టే తిరుపతిరెడ్డి రెండు వేల రూపాయలు, కుర్రె కొమురయ్య రెండు వేల రూపాయలు, దాసి పెల్లి రాజిరెడ్డి వెయ్యి రూపాయలు, మైదం ఓదల్ వెయ్యి రూపాయలు, కళ్లెం రాజిరెడ్డి వెయ్యి రూపాయలు తదితరులు అతని కుటుంబానికి ఆర్థిక సహాయం అందించినారు.

# 10 వ తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించి మన జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి

## • జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**భూపాలపల్లి, మార్చి -15:(ది క్రైమ్ న్యూస్):** శనివారం భూపాలపల్లి మండలం, గుర్రంపేట జడ్పి హెచ్ ఎస్ పాఠశాలల్లో 10 వ తరగతి విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ప్రేరరణ కరపత్రాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుండి 10వ తరగతి పరీక్షలు వ్రాస్తున్న విద్యార్థులకు జిల్లా కలెక్టర్ సంతకం చేసిన ప్రేరరణ కరపత్రాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు పరిక్షలంటే బయపడొద్దని, బాగా వ్రాయాలని మనో ధైర్యాన్ని నింపారు. ఈ సందర్భంగా విద్యార్థులను సబ్జెక్టులపై ప్రశ్నలు వేసి వారి మేధోశక్తిని పరిశీలించారు. త్వరలో జరుగనున్న 10 వ తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించి మన జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని సూచించారు. సబ్జెక్టులల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు పరిక్షలంటే బయ పడొద్దని వత్తిడిని జయించాలని అపుడే విజయం వరిస్తుందని ఆయన పేర్కొన్నారు. పరీక్షల సమయంలో ఆరోగ్య పరిరక్షణ చాలా ముఖ్యమని తగు జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ సూచించారు. విద్య మాత్రమే మనిషిని ఉన్నతస్థాయికి చేర్చగలదని, అందరూ బాగా



చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రాజేందర్, ఎంఈఓ లక్ష్మణ్, తహసీల్దార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# రామగిరి మండలంలో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- బిజెపి రామగిరి మండల అధ్యక్షుడు కొండు లక్ష్మణ్



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)మార్చి 15**: రామగిరి మండలంలో ఆధార్ కేంద్రాలు అందుబాటులో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రామగిరి మండల బిజెపి అధ్యక్షుడు కొండు లక్ష్మణ్ అన్నారు. త్వరగా ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని రామగిరి మండల తహసిల్దార్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా దృష్ట్యా సుమారు 40,000 మంది జనాభా కలిగిన అతి పెద్ద మండలం. జనాభా ప్రతిపాదికన రామగిరిమండలంలో మూడు లేదా నాలుగు ఆధార్ కేంద్రాలు అందుబాటులో ఉండాలి కానీ ఇక్కడ ఒక్క ఆధార్ కేంద్రం కూడా అందుబాటులో లేక ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారని, ఆధార్ కార్డు సవరణల కోసం జిల్లా కేంద్రానికి వెళ్లవలసిన పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. చిన్నపిల్లల మరియు ఆడపిల్లల ఆధార్ అప్డేట్ లేకపోవడంతో ఆర్టీసీ బస్సులలో వారి యొక్క ఆధార్ కార్డు అంగీకరించడం లేదు దీంతో ప్రజలు ఉచిత బస్సు సౌకర్యం పొందలేకపోతున్నారు. కావున ఇప్పటికైనా ప్రజల ఇబ్బందులను గ్రహించి మండలంలో జనాభాకు సరిపడు ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ తోట్ల రాజు, బిజెపి నాయకులు నాంసాని మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీను బాబు



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)మార్చి 15:** రామగిరి మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యులు, మేకల వ్యాపారి దంపతులు ఒర్రె స్వరూప-సదయ్య యాదవ్‌ల కుమారుడు హైదరాబాదులో ఎక్సవేషన్ (ఆర్కే కన్స్ట్రక్షన్స్) కాంట్రాక్టరుగా పనిచేస్తున్న సందీప్-లక్ష్మీ శ్రావణిల వివాహం ఇటీవల జరగగా శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు వారి నివాసానికి వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించి, నూతన వస్త్రాలను అందజేసి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు వారి వెంట రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రోడ్డబాపు, రామగిరి మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు కండె పోషం,నాగేపెల్లి మాజీ సర్పంచ్ ఎరుకల బాపురావు, కల్వచర్ల కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు కొలిపాక సారయ్య, సెంటనరీ కాలనీ టౌన్ అధ్యక్షులు కాటం సత్యం, రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మట్ట రాజ్ కుమార్, బంకు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 17న జరిగే అంగన్వాడి ధర్నా జయప్రదం చేయండి



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)మార్చి 15:** అంగన్వాడి టీచర్లకు హెల్పర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయాలని తెలంగాణ అంగన్వాడి అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సిడీపీఓ ఆఫీసులో విన్నతి పత్రం ఇవ్వడం జరిగింది. సిఐటియు జిల్లా నాయకులు మాట్లాడుతూ అంగన్వాడి టీచర్లకు హెల్పర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయాలని, అలాగే 18 వేల రూపాయలు వేతనం ఈ బడ్జెట్లోనే ప్రకటించాలని మే నెల అంతా సెలవులు ప్రకటించాలని ఐసిడిఎస్ ని నిర్వీర్యం చేసే పిఎం శ్రీ ఉపసంహరించాలని రిటైర్మెంట్స్ బెనిఫిట్స్ జీవో వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఈ నెల 17 పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జరిగే ధర్నా కార్యక్రమాలలో అంగన్వాడీ పాల్గొనాలని తెలంగాణ అంగన్వాడి అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు జిల్లా అధ్యక్షురాలు వనజారాణి, ప్రధాన కార్యదర్శి జ్యోతి, సిఐటియు జిల్లా నాయకులు గణేష్, జి.రవి లు పిలుపునిచ్చారు.

# ఘనంగా తాళ్ళపల్లి సంపత్ గౌడ్ జన్మదిన వేడుకలు



**మానకొండూర్ (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం గంగిపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సంపత్ గౌడ్ జన్మదిన వేడుకలను మండలకేంద్రంలోని పల్లె మీద చౌరస్తా వద్ద మండల కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.సంపత్ గౌడ్ కేక్ కోయగా నాయకులు కేకును తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు నందగిరి రవీంద్ర చారి, మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ తిరుమల్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, మాతంగి సహదేవ్, గ్రామ శాఖ అధ్యక్షులు తాళ్లపల్లి నరేష్, శ్రీనివాస్, టేకుమట్ల అంజయ్య కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఒగ్గు కథ కళాకారుడు "సింగరవేణి" కి ఉగాది పురస్కారం



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)మార్చి 15:** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం నవాబ్ పేట గ్రామానికి చెందిన ప్రముఖ ఒగ్గు కథ కళాకారుడు సింగర వేణి మల్లేష్ యాదవ్ కు ఉగాది పురస్కారం దక్కింది. తార ఆర్ట్స్ అకాడమీ వారు శుక్రవారం హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో విశ్వ వాసు నామ ఉగాది కళోత్సవం - 2025 ఉగాది పురస్కారాలను అందజేశారు. జానపద కేటగిరీలో జానపద ఒగ్గు కథ కళాకారుడు మల్లేష్ యాదవ్ ఉగాది పురస్కారానికి ఎంపిక కాగా సినీ ఆర్టిస్ట్ సుమన్, ఐఏఎస్ పరికిపండ్ల నరహరి చేతుల మీదుగా అందుకున్నారు. తన కళను గుర్తించి ఉగాది పురస్కారానికి ఎంపిక చేయడంతో పాటు, ప్రాచీన కళలను ప్రోత్సహిస్తున్న తార ఆర్ట్స్ అకాడమీ ఫౌండర్ అధ్యక్షులు సంకె రాజేష్‌తో పాటు, అకాడమీ సభ్యులకు మల్లేష్ యాదవ్ ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# జీవో ప్రకారం నర్సరీ మహిళా కార్మికులకు వేతనాలు చెల్లించాలి

- తెలంగాణ కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్



**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** సింగరేణి కోల్ బెల్ట్ ఏరియా వ్యాప్తంగా నర్సరీలలో పనిచేస్తున్న మహిళా కాంట్రాక్టు కార్మికులకు జీవో ప్రకారం వేతనాలు ఇవ్వాలని తెలంగాణ కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సింగరేణి కోల్ బెల్ట్ ఏరియా వ్యాప్తంగా నర్సరీలలో పనిచేస్తున్న మహిళా కాంట్రాక్టు కార్మికులు సరైన వేతనాలు లేక చాలీచాలని జీతాలతో శ్రమ దోపిడీకి గురవుతూ కాలం వెల్లదీస్తున్నారని అన్నారు. సింగరేణిలో కాలుష్యాన్ని నివారించేందుకు మొక్కలను సాగు చేస్తూ ఎంతో కృషి చేస్తున్న మహిళా కాంట్రాక్టు కార్మికుల పట్ల యాజమాన్యం చిన్న చూపు చూస్తుందని అన్నారు. నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటున్న నేపథ్యంలో చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ, పిల్లల చదువులకు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మహిళా కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై గతంలో రాముగండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ దృష్టికి తీసుకుపోయామని, వెంటనే దీనిపై సింగరేణి సిఅండ్ఎండి ఎన్.బలరాం నాయక్‌తో, అధికారులతో మాట్లాడి జీవో ప్రకారం వేతనాలు అందించేందుకు సర్క్యులర్ కూడా జారీ చేయించారని తెలిపారు. జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని సర్క్యులర్ జారీ చేసినప్పటికీ అమలుకు నోచుకోవడం లేదని, ఇప్పటికైనా విడుదల సర్క్యులర్‌ను అమలు చేసి, మహిళా కాంట్రాక్టు కార్మికులకు జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

# అర్ధరాత్రి మట్టి దందా.. లారీ సీజ్..

- లారీ యజమానికి 15 వేలు జరిమాన
- ఆక్రమ మట్టి రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు
- ఎంసీ పల్లి తహసీల్దార్



**శామీర్ పేట, మార్చి 15 (ది క్రైమ్ న్యూస్):** అర్ధరాత్రి అక్రమంగా ప్రభుత్వ అనుమతులు లేకుండా లింగాపూర్ తాండ నుండీ మట్టిని తరలిస్తున్నారనే సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు దాడి చేసి మట్టి తరలిస్తున్న ఒక టిప్పర్ ను పట్టుకొని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. శనివారం రెవెన్యూ ఇన్స్పెక్టర్ రజనీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మండలం, లింగాపూర్ తాండ గ్రామం నుంచి అర్ధరాత్రి భారీ ఎత్తున మట్టిని తరలిస్తున్నారు. గత కొన్ని రోజులుగా అక్రమ మట్టి రవాణా జరుగుతున్నా రెవెన్యూ అధికారులు కనీస చర్యలు తీసుకోకపోవడం పై పలు ఆరోపణలు వచ్చాయి. నమ్మదగిన సమాచారం మేరకు రెవెన్యూ ఇన్స్పెక్టర్ రజనీకాంత్ తమ సిబ్బందితో కలిసి గురువారం రాత్రి లింగాపూర్ తండాకు చేరుకున్నారు. అర్ధరాత్రి మట్టిని తరలిస్తున్న టిప్పర్ లారీని పట్టుకుని మండల తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. అక్రమంగా మట్టిని తరలిస్తున్న లారీ యజమానికి 15 వేల రూపాయల జరిమాన విధించినట్లు మండల తహసీల్దార్ వెంకట నర్సింహా రెడ్డి తెలిపారు. అనుమతులు లేకుండా ఆక్రమ మట్టి రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

# ప్రతి సోమవారం జిల్లాలో, మండల తహసిల్దార్ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాలను నిర్వహించాలి

## •భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**భూపాలపల్లి, మార్చి - 15:(ది క్రైమ్ న్యూస్):** జిల్లాలో ప్రజా సమస్యలను సమర్ధవంతంగా పరిష్కరించేందుకు ప్రతి సోమవారం జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండలాల తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. శనివారం ఐడిఓసి కార్యాలయం నుండి ప్రతి సోమవారం జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండలాలలో ప్రజావాణి ఈ కార్యక్రమం నిర్వహణ, సంక్షేమ వసతి గృహాల్లో సౌకర్యాలు, మెనూ అమలు, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు, సిబ్బంది సమయ పాలన, భోజన ఏర్పాట్లు నాణ్యతలు తనిఖీ తదితర అంశాలపై అన్ని శాఖల జిల్లా అధికారులు, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపిడిఓలతోటెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిసినందున యంత్రాంగం పరిపాలనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. పెండింగ్ ఫైల్స్ పరిష్కరించాలని సూచించారు. వచ్చే సోమవారం నుండి ఉదయం 10.30 గంటల నుండి అన్ని మండలాల్లో ప్రజావాణి నిర్వహించి ప్రజల సమస్యలపై దరకాస్తులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి సోమవారం ఎన్ని దరకాస్తులు వచ్చాయి, ఎన్ని పరిష్కారం అయ్యాయో జిల్లా అధికారులు, తహసీల్దార్లు నివేదిక ఇవ్వాలని సూచించారు. జిల్లా కేంద్రంలో అధికారులు, మండల కేంద్రంలో అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని, హాజరు నివేదిక అందచేయాలని ఆయన స్పష్టం చేశారు. సెలవులు కొరకు ముందస్తు తన అనుమతి తీసుకోవాలని, తదుపరి ప్రజావాణికి హాజరయ్యే సిబ్బంది వివరాలు ఇవ్వాలని, ముందస్తు లేకుండా గైర్హాజరు అయితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల ప్రత్యేక అధికారులు ప్రతి వారంలో కనీసం రెండు రోజులకు తగ్గకుండా మండలాలు, గ్రామాల్లో పర్యటించి సంక్షేమ వసతి గృహాల్లో సౌకర్యాలు, మెనూ అమలు, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, ఆసుపత్రుల్లో వైద్య సేవలు, సిబ్బంది సమయ పాలన, భోజన ఏర్పాట్లను తనిఖీ చేయాలని, తనిఖీ నివేదిక అందచేయాలని ఆదేశించారు. అధికారులు గ్రామస్థాయిలో ప్రజల సమస్యల



పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అన్ని శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలోని ప్రతీ గ్రామం నుండి వాలంటీర్లు ముందుకు రావాలి

## - జిల్లా ప్రధాన న్యాయమూర్తి ,న్యాయసేవాధికార సంస్థ పి. నారాయణ బాబు



**భూపాలపల్లి, మార్చి -15:(ది క్రైమ్ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రతీ గ్రామంనుండి డిగ్రీ చదువుకొని ఉచితంగా సేవచేయాలనే గుణం కలిగిన యువత కమ్యూనిటీ మీడియేషన్ వాలంటీర్లుగా పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ గౌరవనీయులు శ్రీ పి . నారాయణ బాబు గారు తెలిపారు. కేసులను గ్రామస్థాయిలోనే పరిష్కరించాలనే బృహత్తర కార్యక్రమానికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ శ్రీకారం చుట్టిందని వారు అన్నారు. కోర్టులు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగి విలువైన డబ్బులు మరియు సమయాన్ని కోల్పోతున్నారని, వివాదలు లేని సమాజ నిర్మాణం కోసం రాజి మార్గంలో కేసులను పరిష్కారం చేయడం జరుగుతుందని జడ్జి గారు అన్నారు. ప్రతి గ్రామం లోని ప్రతి కమ్యూనిటీ నుంచి డిగ్రీ చదువుకున్నటువంటి యువత (ముగ్గురు యువకులు, ఒక యువతి) డబ్బులు ఆశించకుండా, స్వచ్ఛంధంగా సేవచేయాలనే గుణం కలిగిన వారు జిల్లా న్యాయసేవాధికార సంస్థలో సంప్రదించాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# జిల్లా పంచాయతీ అధికారిని కలిసిన నూతన కార్యవర్గం



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** టిఎన్జివో అనుబంధ తెలంగాణ పంచాయతీ సెక్రటరీ సెంటర్ ఫోరం పెద్దపల్లి జిల్లా నూతన కార్యవర్గం శనివారం పెద్దపల్లి జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్యను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని డిపివోను కోరగా సమస్యలు ఉన్నతధికారులకు సిపార్సు చేస్తానని డిపివో హామీ ఇచ్చారు. డిపివోను కలిసిన వారిలో టిఎన్జివో జిల్లా అధ్యక్షులు బొంకురి శంకర్, పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షులు నిశాంత్ రావు, ప్రధాన కార్యదర్శి మహేందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిలగాని శ్రీధర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కమిటీ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీ ని డిపివో ఆవిష్కరించారు.

# ప్రమాదవశాత్తు చెరువులో మునిగి వ్యక్తి మృతి



**ముత్తారం.మార్చి.15.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండలం లక్కారం గ్రామానికి చెందిన ముదురుకోళ్ల సమ్మయ్య (45) లక్కారం చెరువులోకి స్నానానికి వెళ్లి మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది.ఎస్సై గోపతి సరేష్ తెలిపిన వివరాల ప్రకారం ముదురుకోళ్ల సమ్మయ్య గ్రామంలో అందరిని డబ్బులు అడుక్కుంటూ జీవనం సాగించేవాడు.హోలి సందర్భంగా ఊరిలో వారిని డబ్బులు అడుక్కొని మద్యం సేవించాడు. శుక్రవారం సాయంత్రం లక్కారం గ్రామంలోని చెరువు వద్ద స్థానికులు సమ్మయ్య ఆధార్ కార్డు, బట్టలు గుర్తించి వారి కుటుంబ సభ్యులకు తెలుపగా అవి సమ్మయ్య బట్టలే అని నిర్దారించి చెరువు చూట్టు పక్కల చూడగా సమ్మయ్య ఆచుకీ లబించలేదు. శనివారం ఉదయం చెరువులో సమ్మయ్య మృతదేహన్ని గుర్తించారు. మద్యం మత్తులో స్నానానికి వెళ్లగా ఈత రావడంతో ప్రమాదవశాత్తు నీళ్లలో మునిగి చనిపోయినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుని తండ్రి కొమురయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపతి నరేష్ తెలిపాడు.

# కనుల విందుగా ఉగ్ర నారసింహుని తెప్పోత్సవం, డోలోత్సవం





**ధర్మపురి, మార్చి 14, (ది క్రైమ్ న్యూస్):** జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం శ్రీ ఉగ్ర కొత్త నారసింహుని తెప్పోత్సవం, డోలోత్సవం ఆలయ అధికారులు కనులవిందుగా నిర్వహించారు. సాయంత్రం ఆలయ సనాతన ధర్మం ప్రకారం శ్రీ ఉగ్ర కొత్త నారసింహ స్వామి వారిని ప్రధానాలయం నుండి స్వామివారి ఉత్సవ మూర్తులను వేదపండితులు మంత్రోచ్చారణలు కావించగా, మంగళ వాయిద్యాల నడుమ జయజయ ద్వానాలతో భక్త జనులు తోడురాగ స్వామి వారి ఉత్సవ మూర్తులను ఆలయంలో నిత్య కృత్యమై సేవ మోసే బోయిలు (గంగపుత్రులు) ఊరేగింపుగా బ్రహ్మపుష్కరిని అయిన కోనేరులోకి ఉత్తర ద్వారం గుండా లోనికి తెచ్చి కోనేరులోని హంస వాహనంపై ఉత్సవ మూర్తులను ఆసీనులను చేశారు. భక్త జనం సందోహం నడుమ శ్రీ ధర్మపురి లక్ష్మీ నృసింహ స్వామి గోవిందా గోవింద అంటూ భక్తులు కరచాలన ధ్వనులు చేస్తూ ఉండగా స్వామివారు ఐదు ప్రదక్షిణలు పూర్తిచేశారు. అనంతరం బ్రహ్మపుష్కరనిలోని మండపంలో భక్తుల దర్శనార్థం ఆలయ అధికారులు డోలోత్సవం నిర్వహించారు. స్వామివారి దర్శనానికి వివిధ ప్రాంతాలనుండి భక్తులు బారులు తీరగా తమ ఇష్ట దైవం అయిన శ్రీ ఉగ్ర నారసింహునికి బుక్కాగులాల్ చల్లుతూ తమ భక్తి ప్రపత్తిని చాటుకున్నారు. ఈ డోలోత్సవం కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడిగా జక్కు రవీందర్, కమిటీ సభ్యులు గా ఎదులపురం మహేందర్, బాదినేని వెంకటేష్, బొల్లారపు పోచన్న, గుడ్ల రవీందర్, కొమురెల్లి పవన్ కుమార్, మందుల్ల మల్లేష్, నేదునూరి శ్రీధర్, రాపర్తి సాయికిరణ్, సంబేట తిరుపతి, స్థంబంకాడి గణేష్ కుమార్, వొజ్జల సౌజన్య, అవ్వ సుధాకర్ లు కమిటీ సభ్యులుగా హాజరు కాగా ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సంగన బట్ల దినేష్, ఉపాధ్యక్షుడు వేముల రాజేష్, పట్టణాధ్యక్షుడు చిపిరిశెట్టి రాజేష్, సీనియర్ నాయకులు చిల్మూల లక్ష్మణ్, సింహారాజు ప్రసాద్, జక్కు రవీందర్, రమేష్, అశెట్టి శ్రీనివాస్, సుముఖ్, మొగిలి, సాగర్, షౌకత్, పోచన్న, అప్పం తిరుపతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో ట్యాబ్ల అపహరణ





**మానకొండూర్ (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలో గల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం రాత్రి 23 ట్యాబ్ లు అపహరణకు గురయ్యాయి. గత 15రోజుల క్రితం పీఎం శ్రీ ద్వారా అందిన 23ట్యాబ్లను పాఠశాల కార్యాలయంలో సిబ్బంది భద్రపరిచారు. శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కార్యాలయం పైన ఉన్న వెంటిలెటర్ ను పగులగొట్టి గదిలోకి దూరి రెండు బిరువాలలో ఉన్న ట్యాబ్లన్నింటిని ఎత్తుకెళ్లడంతో శనివారం ఉదయం విదులకు వచ్చిన అంటెండర్ పాక శివ దొంగతనం జరిగిందని గుర్తించి వెంటనే విషయాన్ని ప్రధానోపాధ్యాయులు దాసి శ్రీనివాస్ కు తెలిపారు. శ్రీనివాస్ పాఠశాలకు చేరుకుని రెండు రోజులలో ట్యాబ్ ల ద్వారా విద్యార్థులకు పాఠాలు చెప్పడం ప్రారంభం కానున్న నేపథ్యంలో పాఠశాల గురించి పూర్తిగా తెలిసిన వారి పనే అని ఘటనపై అనుమానం వ్యక్తం చేస్తూ స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ప్రాదానోపాద్యాయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని క్లూస్ టీం సహాయంతో ఘటనా స్థలాన్ని పరిశీలిస్తూ వేలి ముద్రలు సేకరించారు. పూర్తి దర్యాప్తు అనంతరం వివరాలు వెల్లడిస్తామని సిఐ లక్ష్మీనారాయణ తెలిపారు. రూరల్ ఎసిపి నాగ్రాలి శుభం ప్రకాష్, ఫింగర్ ప్రింట్ సి.ఐ స్వర్ణ జ్యోతి, ట్రైనీ ఎస్సై క్రాంతి కుమార్, క్లూస్ టీం సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించిన వారిలో ఉన్నారు.

# ఎంపిడిఓ ఆధ్వర్యంలో గ్రామసభ





**ముత్తారం.మార్చి.15.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండలంలోని అడవిశ్రీరాంపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు ఎంపిడిఓ ఆధ్వర్యంలో శనివారం గ్రామ సభను నిర్వహించారు. ఈ గ్రామసభలో గ్రామస్తులు త్రాగు నీరు,సాగు నీరు రావట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి త్రాగునీరు అందించాలని,గ్రామంలో ఓ వ్యక్తి ఇంట్లో నిర్మిస్తున్న ఎయిర్టెల్ 5 జీ టవర్ పనులను నిలిపివేయాలని దాంతో పాటు ఎస్సారెస్పీ నీరు అందక పొట్ట దశకు వచ్చిన పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషయాలపై నివేదికను రూపొందించి ఉన్నత అధికారులకు పంపిస్తామని ఎంపీవోవో సురేష్ తెలిపాడు.ఈ కార్యక్రమంలో ఎంపీవో గోవర్ధన్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ కీర్తణ,గ్రిడ్ ఏఈ శ్రేయ,ఇరిగేషన్ ఏఈ సమీయోద్దిన్, కార్యదర్శి మల్లీశ్వరి, ఫీల్డ్ అసిస్టెంట్ పావని, ఆశాలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ విక్రయాలు ఆందోళన కలిగిస్తున్నాయి

- భేటీ బచావో భేటీ పడావో అద్భుత ఫలితాలనిస్తోంది - అమ్మాయి పుడితే భారం కాదు...భరోసా
- కరీంనగర్"బేటీ బచావో బేటీ పఢావో" కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు




**కరీంనగర్ టౌన్, మార్చ్ 15(ది క్రైమ్ న్యూస్):** డ్రగ్స్ విక్రయాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. చిన్న పిల్లల ద్వారా డ్రగ్స్ ను విక్రయిస్తు దందా కొనసాగిస్తున్నారని చెప్పారు. డ్రగ్స్ దందాపై ఉక్కు పాదం మోపాలని పోలీసులను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఈ విషయంలో పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని సూచించారు."బేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా ఈరోజు కరీంనగర్ లోని టీఎన్జీవో హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, కమిషనర్ ఆలం, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ తదితరులతో కలిసి బండి సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ ఆడపిల్లను రక్షించండి, ఆడపిల్లని రక్షించండి అనే నినాదంతో ప్రధానమంత్రి మోదీ 2015లో ప్రారంభించారు. గతంలో ఆడపిల్ల అంటే భారమని భావించే పరిస్థితుల నుండి ఆడపిల్ల అంటే భరోసా అని భావించే స్థాయికి తీసుకొచ్చిన ఘనత మోదీదే. ఆడపిల్ల పుడితే 'భేటీ జన్మోత్సవ్' పేరుతో పండుగలా సంబురాలు జరుపుకుంటున్నాం. ఆడపిల్ల పుడితే 'సెల్ఫీ విత్ డాటర్స్' వంటి కార్యక్రమాలతో ప్రచారం చేస్తున్నం. అమ్మాయిలు లేని ఇల్లు శోభనివ్వదు. ఏ మాత్రం కళ లేనిదిగా ఉంటుంది. విద్య, ఉద్యోగాల్లో అమ్మాయిలు పోటీ పడుతున్నారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఇందుకు నిదర్శనం. అద్భుతంగా పనిచేస్తున్నారు. ఈరోజు కలెక్టర్ ఆధ్వర్యంలో 100 మందికి సైకిళ్లు ఇవ్వడం సంతోషంగా ఉంది. అట్లాగే 9వ తరగతి నుండి 10 వ తరగతికి వెళ్లే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులందరికీ ఎంపీ లాడ్స్ నిధులతో సైకిళ్లు అందిస్తా. అట్లాగే ప్రతి హాస్టల్ కు సీఎస్సార్ ఫండ్స్ తో వాషింగ్ మిషన్స్ కు అందజేస్తా. సీఎస్సార్ ఫండ్స్ లేదా ఎంపీ లాడ్స్ తో కరీంనగర్ స్పోర్ట్ స్కూల్ లో అన్ని సౌకర్యాలు కల్పించేందుకు క్రుషి చేస్తా,మోదీ తీసుకున్న నిర్ణయాలవల్ల అమ్మాయిల రక్షణతోపాటు మహిళా అభ్యున్నతి విషయంలో అద్భుతమైన ఫలితాలొచ్చాయి. లింగ వివక్షను కఠినంగా అణిచివేయగలిగినం. మిషన్ ఇంద్రధనుష్ పథకాన్ని తీసుకొచ్చి గర్భిణీ స్త్రీలను ఆరోగ్యంగా ఉంచుతున్నం. గర్భిణీ స్త్రీలు, పుట్టబోయే పిల్లలకు పూర్తి రోగనిరోధక శక్తిని అందించేందుకు సకాలంలో అన్నిరకాల టీకాలు వేయిస్తూ మాతా, శిశు మరణాలను రేటును గణనీయంగా తగ్గించినం. అట్లాగే ప్రధాన మంత్రి మాతృ వందన యోజన పథకం తీసుకొచ్చి గర్భిణీలు, పాలిచ్చే తల్లులకు 5 నుండి 6 వేల రూపాయల చొప్పున 3 విడతలుగా ఆర్థిక సాయం అందిస్తున్నం.కిశోరి శక్తి యోజన పథకం ద్వారా 11-18 సంవత్సరాల వయస్సు గల బాలికలకు విద్య, వైద్యం అందిస్తున్నం. ముద్ర యోజన పేరుతో ఆడపిల్లలకు పెద్ద ఎత్తున రుణాలిస్తున్నం. ఆడపిల్లల పట్ల హేళనగా వ్యహరిస్తే కఠిన చర్యలూ తీసుకుంటున్నాం.బాధాకరమైన విషయం ఏందంటే కొన్ని కళాశాలలు డ్రగ్స్ కు అడ్డాగా మారాయి. ఇయాళ గల్లీ గల్లీలో చిన్న పిల్లల ద్వారా డ్రగ్స్ ను విక్రయిస్తున్నారు. దీనివల్ల సమాజంలో అనర్ధాలు జరిగే ప్రమాముంది. ఈ విషయంలో పాలకులు పోలీసులు పూర్తి స్వేచ్ఛ నివ్వాలి. డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపాలి. ఎంతటి వారినైనా సరే కఠినంగా వ్యవహరించేలా అధికారాలివ్వాలి. దయచేసి రాజకీయ కోణంతో ఆలోచించకుండా డ్రగ్స్ రహిత సమాజంగా మార్చాలని కోరుతున్నా. డ్రగ్స్ దందా చేసే వాళ్లతోపాటు మీడియేటర్స్ పైనా ఉక్కుపాదం మోపాలి.

# సైబర్ కేఫ్ భాదితుడిని విచారించిన సిఐ లక్ష్మీనారాయణ

**మానకొండూర్ (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం రంగపేటకు చెందిన కొక్కిరాల మదుకర్ రెడ్డి అనే వ్యక్తి మయన్మార్ సైబర్ క్రైమ్ వలలో చిక్కుకున్నాడంటూ గత నెల 23న బాదితుడి తండ్రి లక్ష్మారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మానకొండూర్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కాగా మయన్మార్ లోని సైబర్ కేఫ్ లో బందీలుగా ఉన్న తెలంగాణకు చెందిన 24మంది రెండురోజుల క్రితం వారి వారి స్వగ్రామాలకు సురక్షితంగా చేరుకోవడంతో రంగపేటకు చేరుకున్న మదుకర్ ను మానకొండూర్ పోలీసులు శనివారం విచారించారు. మదుకర్ ను పూర్తి స్థాయిలో విచారణ చేయగా మదుకర్ 2016లో వర్క్ విసా ద్వారా దుబాయ్ వెళ్ళి 8సంవత్సరాలపాటు అక్కడే పని చేస్తుండగా లక్ష ఇవైవేల జీతంతో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగమంటూ ఆన్లైన్లో వచ్చిన ప్రకటనను చూసి గత డిసెంబర్ 18తారీఖున గుజరాత్ లోని పోరుబందర్ కు చెందిన హితేష్, జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన ఎస్.రాజశేఖర్ ల ద్వారా చైనా కంపెనీకి సంభందించిన ఒక ఇంటర్వ్యూకు మధుకర్ హాజరవడంతో కంపెనీ వాళ్ళు తాయ్ లాండ్ వరకు వర్క్ వీసాపై లీగల్ గా తీసుకెళ్ళి అక్కడి నుండి తాయ్ లాండ్ మయన్మార్ ను కలిపే ఒక నదిని అనుకొని ఉన్న మైవాడీ పట్టణానికి ఎటువంటి వీసా లేకుండా ఒక బోట్ మార్గం ద్వారా మధుకర్ ను తీసుకెళ్లి అక్కడున్న సైబర్ కేఫ్ భవనంలో బందీని చేసి సైబర్ క్రైమ్ చేయమని బలవంతం చేయడంతో మధుకర్ తన భావ సతీష్ ద్వారా తన తండ్రి కొక్కిరాల లక్ష్మారెడ్డికి తెలియజేసినట్లు విచారణలో తేందని సిఐ లక్ష్మీనారాయణ తెలిపారు.



# గసగసాలు గట్టిగా తినండి.. మధుమేహం నుండి గుండె జబ్బుల వరకు పరార్..!

గసగసాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వేసవిలో గసగసాలు తినడం వల్ల ఆరోగ్యానికి చాలా ప్రయోజనాలు కలుగుతాయి. ఎందుకంటే ఇవి చల్లటి గుణాన్ని కలిగి ఉంటాయి. అద్భుత ఔషధ గుణాలు కలిగి ఉన్న గసగసాలు తినటం ద్వారా పీచు, కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, జింక్, ద విటమిన్లు సమృద్ధిగా లభిస్తాయి. అనేక వ్యాధుల నుండి రక్షిస్తుంది. నాడీ వ్యాధులు, మధుమేహం, గుండె జబ్బులు వంటి వివిధ రకాల ఆరోగ్య సమస్యలను దూరం చేయడంలో గసగసాలు ఉపయోగపడతాయి. గసగసాలు తినడం వల్ల పొట్టకు చల్లదనం చేకూరుతుంది. ఇది ఎసిడిటీ, మలబద్ధకం సమస్య నుంచి ఉపశమనం కలిగిస్తుంది. గసగసాలు తినడం వల్ల శరీరంలో రక్తం కొరత తీరుతుంది. ఇవి ఎముకలను దృఢంగా చేస్తాయి. వేసవిలో తినడం వల్ల శరీరానికి లెక్కలేనన్ని ప్రయోజనాలు కలుగుతాయి. గసగసాల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇక్కడ తెలుసుకుందాం. మెదడు సామర్థ్యం: మెదడుకు నరాల, రక్త కణాల ప్రవాహాన్ని నియంత్రించే సామర్థ్యం గసగసాలకు ఉంది. మెదడులోని నాడీ కణాలు ఉత్తేజితం కావడం వల్ల మెదడు సామర్థ్యం పెరుగుతుంది. కాబట్టి పాలలో ఉడకబెట్టిన గసగసాలు తింటే పిల్లల్లో జ్ఞాపకశక్తి మెరుగవుతుంది. పెద్దలు గసగసాల పాలను తాగడం వల్ల ప్రయోజనం పొందుతారు. ఎముకల ఆరోగ్యం: గసగసాలలో కాల్షియం, కాపర్ పుష్కలంగా ఉంటాయి. ఈ రెండు పోషకాలు ఎముకల ఆరోగ్యానికి ముఖ్యమైనవి. అలాగే ఎముకల మధ్య బంధన కణజాలాన్ని బలపరుస్తుంది. దీంతో కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం పొందవచ్చు. రక్త ప్రసరణ: గసగసాలలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది హానికరమైన చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో, శరీరంలో మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచడంలో సహాయపడుతుంది. గసగసాలలో ఐరన్ కూడా పుష్కలంగా ఉంటుంది. అందువల్ల, ఇది రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. నిద్రలేమి: నిద్రలేమితో బాధపడేవారు రాత్రిపూట గసగసాలు ఎక్కువగా తీసుకుంటే మంచి ఫలితాలు పొందవచ్చు. ఒత్తిడిని తగ్గిస్తుంది. మనస్సును ప్రశాంతంగా ఉంచుతుంది. ఆందోళనను తగ్గిస్తుంది. ప్రశాంతమైన నిద్రను ప్రోత్సహిస్తుంది. రోగనిరోధక శక్తి:మన రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి విటమిన్ సి ఎంత ముఖ్యమైనదో జింక్ కూడా అంతే ముఖ్యం. గసగసాలలో జింక్ పుష్కలంగా ఉంటుంది. దీనిని రెగ్యులర్ గా తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. థైరాయిడ్ సమస్య:థైరాయిడ్ గ్రంధికి జింక్ చాలా ముఖ్యమైన పోషకం. ఇది థైరాయిడ్ హార్మోన్లను సమతుల్యం చేస్తుంది. కాబట్టి, థైరాయిడ్ సమస్యలు ఉన్నవారు జింక్ పుష్కలంగా ఉండే గసగసాలను తీసుకోవచ్చు. నోటి పుండు:తరచుగా నోటిపూత వచ్చినప్పుడు గసగసాలు తింటే ఉపశమనం లభిస్తుంది. యాంటీ బాక్టీరియల్ కాకుండా, గసగసాలు శరీరాన్ని చల్లబరుస్తాయి. రాత్రి పూట గసగసాలు మెత్తగా చేసి పాలలో మరిగించి తాగాలి. ఇది ఆరోగ్యానికి అన్ని విధాలుగా మేలు చేస్తుంది.



## పద్మనాయక వెలమ సంఘం ఆధ్వర్యంలో సన్మానం



**కరీంనగర్ టౌన్, మార్చ్ 15(ది క్రైమ్ న్యూస్):** యాదగిరి సునీల్ రావుని కలిసి తన ఐదు సంవత్సరాల పదవి కాలాన్ని దిగ్విజయంగా కరీంనగర్ నగరని పూర్తి స్థాయి అభివృద్ధి చేసిన యాదగిరి సునీల్ రావు ని పద్మనాయక వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షులు వేణుగోపాల్ రావు, ప్రధాన కార్యదర్శి ప్రకాష్ రావు, ఉప అధ్యక్షులు సంపత్ రావు , కోశాధికారి బీమ్ రావు కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలపడం జరిగింది.

# కరీంనగర్ వాసికి వరించిన సాహితీ రత్న జాతీయ అవార్డు




**మానకొండూర్ (ది క్రైమ్ న్యూస్):** హైదరాబాదులోని రవీంద్ర భారతిలో కరీంనగర్ పట్టణానికి చెందిన కవి, రచయిత, లఘు చిత్రాల రైటర్, నిర్మాత, దర్శకుడు పసుల రవి కుమార్ సహితీ రత్న జాతీయ అవార్డును అందుకున్నారు.తార ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు సంకె రాజేష్, బీసీ కమిషన్ చైర్మన్ వకులభరణం కృష్ణ మోహన్ రావు ఆద్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రముఖ చలన చిత్ర నటులు సుమన్ తల్వార్ ముఖ్య అతిథిగా హాజరై రవి కుమార్ కు అవార్డును అందజేసి శాలువాతో సత్కరించారు. ఎక్సైజ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తూ రవికుమార్ చేస్తున్న సాహిత్య, సామాజిక సేవలను గుర్తించి 2025 ఉగాదికి ముందే అవార్డును అందజేశారు.ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఈ అవార్డును అందుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని, తారా ఆర్ట్స్ అకాడమీ అవార్డునందించి తనకు మరింత భాద్యతను పెంచిందని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రణయ్ కుమార్, ఘంటాడి కృష్ణ, గంటాడి కృష్ణ, మల్కాజ్గిరి డిసిపి వెంకటరమణ యూట్యూబ్ నటుడు శీలం శ్రీనివాస్రావు తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రిజ్‌లో పెట్టిన పుచ్చకాయ తింటే.. శరీరంలో ఏమవుతుందంటే..!

సమ్మర్ సీజన్ మొదలైంది. ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 10దాటిందంటే.. సూర్యుడు ప్రతాపం మొదలవుతుంది. ఇంట్లోంచి బయటకు అడుగు పెట్టామంటే.. చాలు ఉక్కపోత చెమట పట్టడం సహజం. బయటకు వెళ్లాక బట్టలన్నీ చెమటతో తడిసిపోతున్నాయి. మన శరీరం నుండి పోషకాలు కోల్పోవడమే దీనికి కారణం. అయితే దీన్ని బ్యాలెన్స్ చేసేందుకు చాలామంది వేసవిలో పుచ్చకాయ ఎక్కువగా తింటుంటారు. పుచ్చకాయలో లైకోపీన్, యాంటీ ఆక్సిడెంట్ ఎలిమెంట్స్, విటమిన్ ఎ, విటమిన్ సి, పొటాషియం, అమినో యాసిడ్స్ అధికంగా ఉంటాయి. అలాగే బరువు తగ్గాలని ప్రయత్నించే వారికి కూడా ఈ పండు బాగా ఉపయోగపడుతుంది. ఇందులో క్యాలరీలు చాలా తక్కువ కాబట్టి, ఈ పండును తీసుకోవడం వల్ల మన పొట్ట ఎక్కువ సమయం నిండుగా ఉంటుంది. ఈ పండు వేసవిలో ఎండ వేడిమి నుండి మన శరీరాన్ని చల్లగా ఉంచుతుంది. అలాగే ఇందులో 92శాతం నీరు ఉంటుంది. కాబట్టి ఇది మన శరీరానికి ఎక్కువ వాటర్ కంటెంట్ అందిస్తుంది. తాజా పుచ్చకాయలో సిట్రులిన్ అనే ముఖ్యమైన అమైనో ఆమ్లం ఉంటుంది. ఈ సిట్రులైన్ నైట్రిక్ ఆక్సైడ్ 6 ను ఉత్పత్తి చేస్తుంది. ఫలితంగా రక్తపోటు అదుపులో ఉంటుంది. పుచ్చకాయలో కేలరీలు తక్కువగా ఉంటాయి. ఫలితంగా, పుచ్చకాయ శరీరంలో చక్కెర పరిమాణాన్ని నియంత్రిస్తుంది. డైటింగ్ చేసేవారికి కూడా పుచ్చకాయ చాలా మంచిది. కానీ కొందరు పుచ్చకాయను రిఫ్రిజిరేటర్ లో ఉంచి తింటారు. కానీ ఇలా చేయడం వల్ల పోషక విలువలు తగ్గుతాయని మీకు తెలుసా..సాధారణంగా కొంతమంది మార్కెట్ నుండి పండ్లను కొనుగోలు చేసి ఇంటికి తెచ్చిన తర్వాత వాటిని ఫ్రిజ్‌లో ఉంచుతారు. అయితే పండ్లను కోసి ఫ్రిజ్‌లో ఉంచే అలవాటు ఉంటే మాత్రం వెంటనే దానిని వదిలేయండి. ముఖ్యంగా పుచ్చకాయను ఫ్రిజ్‌లో పొరపాటున కూడా పెట్టకూడదు. పుచ్చకాయను రిఫ్రిజిరేటర్‌లో ఉంచడం కంటే గది ఉష్ణోగ్రత వద్ద ఉంచడం మంచిదని పరిశోధనలు చెబుతున్నాయి. ఎంత ఎండలోనైనా పుచ్చకాయ చాలా చల్లగా ఉంటుంది. తినడానికి రుచికరమైనది. కానీ కట్ చేసిన పుచ్చకాయను ఫ్రిజ్ లో ఉంచితే ఫుడ్ పాయిజన్ అయ్యే అవకాశం ఉంది. సాధారణంగా కోసిన పుచ్చకాయపై బ్యాక్టీరియా పెరగడం ప్రారంభమవుతుంది. ఇది ఆరోగ్యానికి చాలా హానికరం.

# నేలపై పడుకుంటే ఇన్ని లాభాలా..? తెలిస్తే బెడ్‌కు గుడ్ బై చెప్పేస్తారు..!

కాలం మారింది.. దాంతో పాటుగానే ప్రజల జీవన విధానాలు మారిపోతున్నాయి. సౌకర్యాల విషయానికి వస్తే చాలా మంది ప్రజలు లగ్జరీ లైఫ్ కోసం పరుగులు పెడుతున్నారు.కానీ నేటికీ నేలపై పడుకునే పాత సంప్రదాయం ఇప్పటికీ సరైనదని మరోసారి నిరూపించబడింది ఈ ఆధునిక యుగంలో అందరూ మంచాలు, సుతిమెత్తటి బెడ్‌లను వాడుతున్నారు. కానీ, అలాంటి మంచాన్ని వదిలి నేలపై పడుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలేంటో తెలుసా..? ఆ లాభాలు తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. నేలపై పడుకోవడం వల్ల కలిగే అసంఖ్యాక ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.. నేల మీద పడుకోవడం వల్ల మానసిక ఆరోగ్యం: మనస్తత్వవేత్తలు నేలపై పడుకోవడం వల్ల శరీరం రిలాక్సేషన్, నేలతో అనుబంధం ఏర్పడుతుందని అంటున్నారు. నేలపై పడుకోవడం వల్ల శరీర భంగిమ సరైన రీతిలో ఉంటుంది. అదే బెడ్‌పై పడుకున్నప్పుడు మనం నిద్రించే సమయంలో కుంగి ఉంటాయి. ఇది అసౌకర్యాన్ని కలిగిస్తుంది. నేలపై పడుకోవడం వల్ల వెన్నెముక నిటారుగా ఉంటుంది. మనం నేలపై పడుకున్నప్పుడు మన శరీరం పూర్తిగా రిలాక్స్ అవుతుంది. మనం పూర్తి విశ్రాంతి తీసుకుంటాము. ఇది వెన్నునొప్పిని తగ్గిస్తుంది. వెన్నెముకపై ఒత్తిడి తగ్గించుకునేందుకు పిల్లోను వాడుకోవచ్చు. నడుము భాగంలో పలుచని పిల్లోను పెట్టుకుని నిద్రించాలన్నది వైద్యుల సూచన. నేలపై పడుకోవడం వల్ల కలిగే ఆధ్యాత్మిక ప్రయోజనాలు: నేలపై పడుకోవడం వల్ల మన శరీరానికి కావలసిన సహజమైన విశ్రాంతి లభిస్తుంది. ఇది మన వీపును నిటారుగా ఉంచుతుంది. కండరాలను రిలాక్స్ చేస్తుంది. మీరు ఫ్లాట్ ఫ్లోర్‌లో పడుకున్నప్పుడు, మీ మనస్సులోని ఆందోళనలు కూడా తగ్గుతాయి. నేటి బీజీ లైఫ్ అత్యధిక ఒత్తిడితో కూడిన యుగంలో నేలపై నిద్రపోవడం మనల్ని ప్రకృతికి దగ్గర చేస్తుంది. భూమితో అనుసంధానం చేయడం ద్వారా మనం మరింత సమతుల్యత, ప్రశాంతతను పొందవచ్చు. నేలపై పడుకోవడం వల్ల మంచి నిద్రపడుతుంది. అదే విధంగా నిద్రలో సహజ శరీర కదలిక ఉంటుంది. పరుపులు, దిండ్ల ఒత్తిడి ఉండదు. మంచి రక్త ప్రసరణ ఉంటుంది. వేసవిలో నేలపై పడుకోవడం వల్ల శరీరానికి కాస్త చల్లగా అనిపిస్తుంది. నేల చల్లదనానికి, శరీర ఉష్ణోగ్రత నెమ్మదిగా తగ్గిపోతుంది. దీనివల్ల మరింత గాఢంగా నిద్ర పోవచ్చు. అంతేకాదు, చాలా మంది ఆఫీసు, ఇంటి పనితో అలసిపోతుంటారు. బాడీ పెయిన్స్ తో బాధ పడుతుంటారు. ఆ పెయిన్స్ ఉన్న వారు బెడ్ కి గుడ్ బై చెప్పి నేల మీద పడుకోవడం అలవాటు చేసుకోండి. ఆ హాయిని మీరు ఆస్వాదిస్తారు.

# ఇంగ్లాండ్ సిరీస్‌లో రోహిత్ కెప్టెన్‌గా కొనసాగేనా?

ఇటీవల రోహిత్ శర్మ కెప్టెన్సీలో టీం ఇండియా ఛాంపియన్ ట్రోఫీని గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు భారత జట్టు జూన్‌లో మైదానంలోకి అడుగుపెడుతుంది. అది ఐదు టెస్ట్ మ్యాచ్‌లు ఆడేందుకు ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లాల్సి ఉంది. కానీ ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే రోహిత్ శర్మ ఈ పర్యటనలో టీం ఇండియా తరఫున ఆడతాడా.. ఆ సమయంలో అతడు కెప్టెన్ గా వ్యవహరిస్తాడా లేదా ? అతని కెప్టెన్సీలో భారత జట్టు ఆస్ట్రేలియా పర్యటనలో ఘోర పరాజయాన్ని చవిచూడాల్సి వచ్చింది కాబట్టి ఈ ప్రశ్నలన్నీ తలెత్తుతున్నాయి. ఈ పర్యటన సందర్భంగా రోహిత్ టెస్టుల నుంచి రిటైర్మెంట్ ప్రకటించే అవకాశం ఉందని కూడా వార్తలు వచ్చాయి. అయితే ఇటీవల తన రిటైర్మెంట్ వార్తలను తిరస్కరించారు. ఇప్పుడు అతని కెప్టెన్సీ గురించి కూడా ఒక కీలక అప్ డేట్ వచ్చింది. ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన తర్వాత రోహిత్ శర్మ కెరీర్‌లో ఒక పెద్ద మలుపు తిరిగింది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో వచ్చిన ఒక నివేదిక ప్రకారం.. రోహిత్ శర్మ మరో పెద్ద పర్యటనకు జట్టును కెప్టెన్‌గా నియమించడానికి భారత క్రికెట్ నియంత్రణ మండలి, దాని సెలక్షన్ ప్యానెల్ సపోర్ట్ దక్కించుకున్నాడు. దీని అర్థం ఇంగ్లాండ్ పర్యటనలో రోహిత్ శర్మ కెప్టెన్‌గా కొనసాగే అవకాశం ఉంది. ఛాంపియన్స్ ట్రోఫీ గెలవడం వల్ల రోహిత్ టెస్ట్ కెరీర్ కొనసాగుతుందని అర్థం అవుతుంది. 2024-25 ఆస్ట్రేలియా పర్యటనలో టీం ఇండియా 3-1 తేడాతో ఓటమిని ఎదుర్కోవలసి వచ్చింది. ఈ సమయంలో రోహిత్ ప్రదర్శన పై విమర్శలు వచ్చాయి. రోహిత్ సిరీస్ చివరి మ్యాచ్‌లో ఆడకూడదని నిర్ణయించుకున్నాడు.



రోహిత్ శర్మ విశ్రాంతి తీసుకోవడంతో ఈ సిరీస్ ముగిసిన వెంటనే అతను టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్ అవుతాడని అభిమానుల్లో పుకార్లు వ్యాపించడం ప్రారంభించాయి. కొంతమంది సీనియర్లు కూడా రోహిత్ టెస్ట్ ఫార్మాట్‌ను విడిచిపెట్టాలని భావించారు. కానీ రోహిత్ తన విమర్శకులకు తగిన సమాధానం ఇస్తూ ఒక పెద్ద ప్రకటన ఇచ్చాడు. సిడ్నీ టెస్ట్ రెండో రోజు లంచ్ సమయంలో స్టార్ స్పోర్ట్స్‌తో మాట్లాడుతూ రోహిత్ శర్మ మాట్లాడుతూ, 'ఇప్పుడు పరుగులు రావడం లేదు, కానీ 5 నెలల తర్వాత కూడా అవి రావని హామీ లేదు. నేను కష్టపడి పనిచేస్తాను. కానీ ఈ నిర్ణయం రిటైర్మెంట్ గురించి కాదు. బయట ల్యాప్‌టాప్, పెన్ను, కాగితం పట్టుకుని కూర్చున్న వ్యక్తులు రిటైర్మెంట్ ఎప్పుడు వస్తుందో, నేను ఏ నిర్ణయాలు తీసుకుంటారో అని ఆత్రుతగా ఎదురు చూస్తున్నారని అన్నారు. ఈ సిరీస్‌లోని 3 మ్యాచ్‌లలో రోహిత్ 3, 6, 10, 2, 9 పరుగులు చేశాడు. అంటే భారత కెప్టెన్ 5 ఇన్నింగ్స్‌లలో 6.20 సగటుతో మొత్తం 31 పరుగులు చేశాడు. ఆ తర్వాత ఇంగ్లాండ్ సిరీస్‌లో బిసిసిఐ కొత్త కెప్టెన్‌తో వెళ్లవచ్చని ప్రచారం జరిగింది. కానీ ప్రస్తుతానికి అది జరిగేలా కనిపించడం లేదు.

# స్పోర్ట్స్



## నా దినచర్య, అభ్యాసాన్ని మార్చుకున్నా

### భారత మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి

భారత మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ప్రస్తుతం టీమ్ ఇండియాలో సుపరిచితమైన పేరు. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం యశస్వి జైస్వాల్ స్థానంలో చివరి నిమిషంలో అతన్ని జట్టులోకి తీసుకున్నారు. జట్టులోకి వచ్చినందుకు అతను సెలెక్టర్లు , కెప్టెన్ రోహిత్ శర్మ నుండి విమర్శలను కూడా ఎదుర్కొన్నాడు. అయితే, అతను ఆటతీరుతో అందర్నీ ఆకట్టుకున్నాడు. జట్టు టైటిల్ గెలవడంలో ముఖ్యమైన పాత్ర పోషించాడు. 2021 టీ20 ప్రపంచ కప్ నుంచి టీమిండియా ముందుగానే నిష్క్రమించిన తర్వాత తనకు బెదిరింపు కాల్స్ వచ్చాయని అతను వెల్లడించిన షాకింగ్ విషయం ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. ఈ సమయంలో అతను తన జీవితంలోని కొన్ని కఠినమైన అనుభవాలను పంచుకున్నాడు. టోర్నమెంట్ నుంచి భారత్ నిష్క్రమించిన తర్వాత, భారతదేశానికి తిరిగి రావద్దని తనను హెచ్చరించారని, చెన్నైలోని తన ఇంట్లో వారిని కూడా బెదిరించినట్లు వరుణ్ వెల్లడించాడు. 'ఇది నాకు చెడ్డ సమయం' అని వరుణ్ ఒక యూట్యూబ్ షోలో ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు. ప్రపంచ కప్‌కు ఎంపిక కావడానికి నేను న్యాయం చేయలేకపోతున్నానని భావించి నేను నిరాశకు గురయ్యాను. నేను ఒక్క వికెట్ కూడా తీయలేకపోయానని బాధపడ్డాను. ఆ తర్వాత మూడు సంవత్సరాలు నన్ను ఎంపిక చేయలేదు. కాబట్టి, నా అరంగేట్రం కంటే జట్టులోకి తిరిగి వచ్చే మార్గం చాలా కష్టమని నేను భావిస్తున్నాను. 2021 %u%20 ప్రపంచ కప్ తర్వాత జట్టు నుండి తొలగించిన తర్వాత తన అంతర్జాతీయ క్రికెట్ కెరీర్ ముగిసిపోవచ్చని వరుణ్ భావించినట్లు తెలిపాడు. రెండవ అవకాశం లభిస్తుందనే హామీ లేకుండా తాను ఎలా మార్పును ఎదుర్కోవలసి వచ్చిందో.. కష్టపడి పనిచేయాల్సి వచ్చిందో వివరించాడు. '2021 సంవత్సరం తర్వాత నేను నా గురించి చాలా విషయాలు మార్చుకోవాల్సి వచ్చింది. నా దినచర్య, అభ్యాసాన్ని మార్చుకోవలసి వచ్చింది. గతంలో నేను ఒక సెషన్‌లో 50 బంతులు ప్రాక్టీస్ చేసేవాడిని, తర్వాత దాన్ని రెట్టింపు చేశాను. సెలెక్టర్లు నన్ను తిరిగి పిలుస్తారో లేదో తెలియకపోవడం కష్టంగా ఉంది. మూడవ సంవత్సరం తర్వాత, అంతా అయిపోయిందని నాకు అనిపించింది. మేము ఐపీఎల్ గెలిచాము, ఆపై నాకు కాల్ వచ్చింది. దీనితో నేను చాలా సంతోషించాను అని తెలిపాడు.

## ఈసారి మరింత బలంగా టైటాన్స్

ఐపీఎల్లో 2022లో ప్రవేశించిన గుజరాత్ టైటాన్స్ జట్టు.. కొద్ది కాలంలోనే తన ఆటతో అందరి దృష్టిని ఆకర్షించింది. ఆడిన తొలి సీజన్ లో నే విజేతగా నిలిచిన టైటాన్స్.. తర్వాత సీజన్లో రన్నరప్ గా నిలిచింది. ఇక గతేడాది మాత్రం ఎనిమిదో స్థానంలో నిరాశపర్చింది. తొలి రెండు సీజన్లలో అటు బ్యాట్, ఇటు బంతితో కెప్టెన్ గా హార్దిక్ పాండ్యా జట్టును ముందుకు నడిపించాడు. గత సీజన్ లో అతను వెళ్లిపోవడంతో శుభమాన్ గిల్ సారథ్య బాధ్యతలు మోశాడు. ఇక గతేడాది మెగావేలంలో తాము ఎక్కడైతే బలహీనంగా ఉన్నామో, అక్కడ ఫోకస్ పెట్టి, మెరికల్లాంటి ప్లేయర్లను కొనుగోలు చేయడం ప్లస్ పాయింట్. పేపర్ పై చూస్తే చాలా బలంగా కనిపిస్తున్న టైటాన్స్, మైదానంలో అలాంటి ప్రదర్శన చేయాలని ఆ జట్టు అభిమానులు కోరుకుంటున్నారు. గతేడాది మెగావేలం సందర్భంగా కొంతమంది కీలక ప్లేయర్లను వదిలేయక తప్పలేదు. డేవిడ్ మిల్లర్, మోహిత్ శర్మ, మహ్మద్ షమీ, నూర్ అహ్మద్ లాంటి వాళ్లను రిలీజ్ చేసి, వేలంలో జోస్ బట్లర్, కగిసో రబాడ, గ్లెన్ ఫిలిప్స్ లతో పాటు కొంతమందిని కొనుగోలు చేసింది. జట్టు బ్యాటింగ్ విషయానికొస్తే కెప్టెన్ గిల్, బట్లర్, సాయి సుదర్శన్, రాహుల్ తెవాటియా, గ్లెన్ ఫిలిప్స్, షారూఖ్ ఖాన్ లతో పటిష్టంగానే ఉంది. ఆల్ రౌండర్ గా రషీద్,వాషింగ్టన్ సుందర్ అటు బ్యాట్ తోనూ, ఇటు బంతితోనూ సత్తా చాటగలరు. ఇక బౌలింగ్ విషయానికొస్తే భారత పేసర్లు మహ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, ఇషాంత్ శర్మలతోపాటు విదేశీ ప్లేయర్లు రబాడ, గెరాల్డ్ కొయెట్జీలతో బలంగా కనిపిస్తోంది. సరైన కూర్పుతో ముందుకు వెళితే నాకౌట్ లోకి ఈజీగా వెళ్లగలుగుతుంది. వేలానిక ముందు మిల్లర్ ను రిలీజ్ చేసి టైటాన్స్ తప్పు చేసిందా..? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మిడిలార్డర్లో తను వేగంగా పరుగులు సాధించి, ఒంటిచేత్తో మ్యాచ్ ను మలుపు తిప్పగల సామర్థ్యం అతని సొంతం. అలాంటి ప్లేయర్ ప్రస్తుతం జట్టులో లేడు. అయినప్పటికీ టాపార్డర్ లో మాత్రం బట్లర్ లాంటి విధ్వంసకర ఆటగాళ్లతో ప్రమాదకరంగా ఉంది. అతను స్థాయికి తగ్గ ప్రదర్శన చేస్తే ప్రత్యర్థులకు గడ్డు కాలమే. ఏదేమైనా మరోసారి ఈ సీజన్ లో టాప్-2లో ఉండాలని ఆ జట్టు టార్గెట్ పెట్టుకుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

## సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు గుడ్‌న్యూస్

### ఐపీఎల్‌లో బరిలో నితీశ్‌కుమార్ రెడ్డి

### నితీశ్‌కు బీసీసీఐ గ్రీన్ సిగ్నల్

సన్?రైజర్స్ హైదరాబాద్‌కు గుడ్‌న్యూస్. యంగ్ ఆల్?రౌండర్ నితీశ్?కుమార్ రెడ్డి ఈ ఐపీఎల్‌లో బరిలో దిగడం ఖాయంగా కనిపిస్తోంది. ఇటీవల ఇంగ్లాండ్?తో జరిగిన టీ20 సిరీస్?లో గాయపడ్డ నితీశ్ ప్రస్తుతం నేషనల్ క్రికెట్ అకాడమీ కోలుకుంటున్నాడు. తాజాగా అతడు పూర్తి ఫిట్?నెస్ సాధించాడు. ఈ మేరకు బీసీసీఐ నుంచి నితీశ్?కు ఫిట్‌నెస్ క్లియరెన్స్ వచ్చినట్లు తెలుస్తోంది. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో జరిగిన ఫిట్‌నెస్ టెస్టులను నితీశ్ దిగ్విజయంగా పూర్తి చేశాడని క్రికెట్ వర్గాలు తెలిపాయి. యో-యో టెస్టు కూడా పాస్ క్లియర్ చేశాడని సమాచారం. దీంతో ఐపీఎల్?లో ఆడేందుకు బీసీసీఐ నితీశ్?కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసినట్లు తెలిసింది. ఇక త్వరలోనే నితీశ్ సన్?రైజర్స్ క్యాంప్?లో కలవనున్నాడు.? అయితే దీని గురించి ఇంకా అధికారిక పకటన రావాల్సి ఉంది. కాగా, 2025 ఐపీఎల్? కోసం నితీశ్?ను సన్?రైజర్స్ రూ.6 కోట్లకు రిటైన్ చేసుకుంది. 2023లో ఐపీఎల్ అరంగేట్రం చేసినా, గతేడాదే నితీశ్ వెలుగులోకి వచ్చాడు. 13 ఇన్నింగ్స్?లో 303 పరుగులు బాది సత్తా చాటాడు. అందులో రెండు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఇక బంతితోనూ రాణించి 3 వికెట్లు తీశాడు. ఈ క్రమంలో సన్?రైజర్స్?కు కీలక ప్లేయర్?గా మారిపోయాడు.





## సూర్యకుమార్‌కు ముంబయి జట్టు పగ్గాలు?

### పాండ్య, బుమ్రా గైర్హాజరీతో నిర్ణయం

2025 ఐపీఎల్?కు రంగం సిద్ధమైంది. మరో వారం రోజుల్లో టోర్నమెంట్? ప్రారంభం కానుంది. మార్చి 22న కోల్?కతా- ఆర్సీబీ మ్యాచ్?తో ఈ ఎడిషన్?కు తెర లేవనుంది. ఈ క్రమంలో ఈసారి ఏయే జట్టుకు ఎవరు కెప్టెన్?గా వ్యవహరించనున్నారో క్లారిటీ వచ్చేసింది. అయితే మోస్ట్? సక్సెస్?ఫుల్ ముంబయి ఇండియన్స్? జట్టు కెప్టెన్సీలో మాత్రం మార్పు జరిగే ఛాన్స్ ఉంది! ఎందుకంటే? ఈ ఎడిషన్?లో ముంబయి మార్చి 23న చెన్నై సూపర్ కింగ్స్?తో తమ తొలి మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్?కు చెన్నై చెపాక్ స్టేడియం వేదిక కానుంది. అయితే ఈ మ్యాచ్?లో ముంబయి జట్టుకు రెగ్యులర్ సారథి హార్దిక్ పాండ్య కాకుండా స్టార్ ప్లేయర్? సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్?గా వ్యవహరించే ఛాన్స్ ఉంది. ఆ మ్యాచ్?కు పాండ్య దూరం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.2024 ఎడిషన్?లో ముంబయి మూడుసార్లు స్లో ఓవర్ రేట్?కు గురైంది. ఐపీఎల్ నిబంధనల ప్రకారం సింగిల్ సీజన్?లో ఓ జట్టు మూడు లేదా అంతకంటే ఎక్కువ సార్లు స్లో ఓవర్ రేట్?కు గురైతే, ఆ టీమ్ కెప్టెన్?కు రూ.30 లక్షల జరిమానా, ఒక మ్యాచ్? నిషేధం పడుతుంది. ఈ క్రమంలో గత సీజన్? లీగ్ దశలోనే హార్దిక్ సస్పెన్షన్?కు గురయ్యాడు. అయితే ఆ సీజన్?లో ముంబయి క్వాలిఫైయర్?కు అర్హత సాధించకపోవడం వల్ల, హార్దిక్?పై సస్పెన్షన్ కొనసాగుతూ వచ్చింది. ఇలా ఐపీఎల్? నిబంధనలతో పాండ్యకు షాక్ తగిలినట్లైంది! దీంతో తాజా ఎడిషన్?లో తొలి మ్యాచ్?కు దూరం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక వైస్?కెప్టెన్ జస్ప్రీత్ బుమ్రా కూడా గాయం కారణంగా తొలి రౌండ్ మ్యాచ్?లకు దూరం కానున్నాడు. దీంతో పాండ్య, బుమ్రా గైర్హాజరీలో సూర్య కెప్టెన్?గా జట్టును నడిపించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. మరోవైపు జట్టులో మోస్ట్ సక్సెస్?ఫుల్ కెప్టెన్ రోహిత్ శర్మ ఉన్నప్పటికీ, అకడు సారథ్యం బాధ్యతలు తీసుకోకపోవచ్చు. అందుకే మేనేజ్?మెంట్? కూడా సూర్యకే తాత్కాలిక బాధ్యతలు అప్పగించే ఛాన్స్ ఉంది. ఇక మిగిలిన సీజన్? మొత్తానికి హార్దిక్ మళ్లీ కెప్టెన్?గా వ్యవహరిస్తాడు. ముంబయి జట్టు ఐపీఎల్ 2025 : రోహిత్ శర్మ, జస్ప్రీత్ బుమ్రా, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్య, తిలక్ వర్మ, ట్రెంట్ బౌల్ట్, నమన్ ధీర్, రాబిన్ మింజ్, కరణ్ శర్మ, దీపక్ చాహర్, ర్యాన్ రికెల్టన్, విల్ జాక్స్, అశ్వని కుమార్, మిచెల్ సాంట్నర్, రీస్ టోప్లీ, శ్రీజిత్, రాజ్ అంగద్ బావా, బెవాన్ జాకబ్స్, వెంకట పెన్మెట్సా, అర్జున్ తెండూల్కర్, లిజాడ్ విలియమ్స్, విగ్నేష్ పుత్తూరు, ముజీబ్ అర్ రహ్మాన్

## ధోనీ కెప్టెన్సీ అద్భుతం.. ధోనీది మాస్టర్ మైండ్స్

### వెంకటేశ్ అయ్యర్ కీలక వ్యాఖ్యలు

ఐపీఎల్లో అత్యంత ఖరీదైన ఆటగాళ్లలో ఒకరు కోల్ కతా నైట్ రైడర్స్ కి చెందిన వెంకటేశ్ అయ్యర్.. గతేడాది ఐపీఎల్ టైటిల్ సాధించడంలో తను కీలకపాత్ర పోషించాడు. బ్యాట్ తో మెరుపులు మెరిపించడంతోపాటు, బౌలింగ్ లోనూ ఒక చేయి వేయగల సిసలైన ఆల్ రౌండర్ తను. అందుకే రూ.23.75 కోట్ల భారీ మొత్తాన్ని వెచ్చించి కేకేఆర్ అతడిని కొనుగోలు చేసింది. రిషభ్ పంత్ (రూ.27 కోట్లు), శ్రేయస్ అయ్యర్ (రూ.26.75 కోట్లు) తర్వాత అత్యంత ఖరీదైన ప్లేయర్ గా తను నిలిచాడు. ప్రజెంట్ కేకేఆర్ కెప్టెన్ గా వెటరన్ అజింక్య రహానేను ప్రకటించినా, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వెంకటేశ్ ను వైస్ కెప్టెన్ గా నియమించారు. ఇక గతంలో కెప్టెన్సీకి సంబంధించి చెన్నై సూపర్ కింగ్ మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ నుంచి 2023లో తను నేర్చుకున్న విషయాన్ని వెంకటేశ్ పంచుకున్నాడు. చెన్నైతో మ్యాచ్ ఆడుతున్నప్పుడు ఒక ఫీల్డర్ స్థానాన్ని మార్చి తనను ఔట్ చేసినట్లు వెంకటేశ్ తెలిపాడు. నిజానికి ఆ మ్యాచ్ లో 4 బంతుల్లో 9 పరుగులు చేసిన తను.. దీపక్ చాహర్ బౌలింగ్ తో తర్వాతి బంతి కోసం ఎదురు చూస్తున్నట్లు తెలిపాడు. అయితే ఇంతలో డీప్ స్క్వేర్ లెగ్ లో ఉన్న ప్లేయర్ ను మార్చి, అతడి స్థానాన్ని థర్డ్ మ్యాన్ దిశగా పెట్టాడని పేర్కొన్నాడు. అది కూడా కొంచెం ఎడంగా పెట్టినట్లు గుర్తు చేసుకున్నాడు. అయితే ఆ తర్వాతి బంతికే తను నేరుగా ఆ ఫీల్డర్ చేతిలోకి బంతిని కొట్టి ఔటైనట్లు పేర్కొన్నాడు. మ్యాచ్ తర్వాత ధోనీతో ఈ విషయంపై సంప్రదింపులు జరిపానని, ధోనీ చెప్పిన



విషయం విని తను షాక్ కు గురైనట్లు తెలిపాడు. అప్పటికే తన బ్యాటింగ్ పై ఒక అంచనాకు వచ్చిన ఎంఎస్ ధోనీ.. ఫీల్డింగ్ లో మార్పులు చేసినట్లు మ్యాచ్ ముగిసిన అనంతరం తనతో చెప్పినట్లు వెంకటేశ్ పేర్కొన్నాడు. తను బంతిని కొడుతున్న విధానం, యాంగిల్ ను చూసి, ఫీల్డర్ ను అక్కడ మోహరించినట్లు వెల్లడించాడు. అప్పటికే ఈ విషయాన్ని పదే పదే రీప్లేలో కెమెరాల్లో ప్రసారం అవుతుందని గుర్తు చేసుకున్నాడు. మొత్తానికి బ్యాటర్ల బలానికి అనుగుణంగా ఫీల్డర్లను పెట్టి, ధోనీ పై చేయి సాధించినట్లు వెంకటేశ్ పేర్కొన్నాడు. ఇక ఐపీఎల్ ఈనెల 22 నుంచి ప్రారంభం అవుతుండగా, తొలి మ్యాచ్ లో డిఫెండింగ్ చాంపియన్ గా కేకేఆర్ బరిలోకి దిగుతోంది. ఈడెన్ గార్డెన్స్ లో జరిగే ఈ మ్యాచ్ లో మూడుసార్లు ఫైనలిస్టు.. రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో తలపడనుంది. తర్వాతి రోజు హైదరాబాద్ కు చెందిన ఫ్రాంచైజీ సన్ రైజర్స్ హైదరాబాద్ బరిలోకి దిగనుంది. ఉప్పల్ మైదానంలో జరిగే ఈ మ్యాచ్ లో రాజస్థాన్ రాయల్స్ తో సన్ రైజర్స్ తలపడనున్నారు. అలాగే అదే రోజు చెన్నై తో ముంబై ఇండియన్స్ అమీతుమీ తేల్చు కోనుంది.

# బ్యూటీ

# వేసవిలో చర్మం మెరిసిపోవాలంటే.. ఈ " గ్లో జ్యూస్" ట్రై చేయండి!



ప్రతి ఒక్కరూ మెరిసే, ఆరోగ్యకరమైన చర్మాన్ని కోరుకుంటారు. ఇది అందాన్ని పెంచడమే కాకుండా, మన ఆరోగ్యాన్ని కూడా ప్రతిబింబిస్తుంది. మార్కెట్లో లభించే సౌందర్య ఉత్పత్తులు ఎన్నో ఉన్నప్పటికీ, సహజమైన పద్ధతిలో చర్మాన్ని మెరుగుపరుచుకోవడం ఎప్పుడూ ఉత్తమమైన ఎంపిక. అలాంటి ఒక అద్భుతమైన సహజ పరిష్కారమే ' గ్లో జ్యూస్' . ఈ సింపుల్ రెసిపీ మీ చర్మానికి సహజమైన మెరుపును అందిస్తుంది, లోపలి నుండి ఆరోగ్యాన్ని పెంపొందిస్తుంది. మెరిసే చర్మం కోసం సహజ మార్గం: మెరిసే చర్మం కోసం వెతుకుతున్నారా? రసాయనాలతో నిండిన ఉత్పత్తులకు బదులుగా, ప్రకృతి అందించే అద్భుతమైన పదార్థాలతో మీ చర్మానికి కావలసిన పోషణను అందించవచ్చు. ' గ్లో జ్యూస్' అలాంటి ఒక దివ్యమైన పానీయం. దీనిలో ఉపయోగించే ప్రతి పదార్థం చర్మ సౌందర్యాన్ని పెంపొందించడానికి ప్రత్యేకంగా సహాయపడుతుంది. ఈ జ్యూస్‌ను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల మీ చర్మం లోపలి నుండి మెరుస్తుంది, మచ్చలు తగ్గుతాయి, చర్మం యవ్వనంగా కనిపిస్తుంది. %ూాశ్రీంశీ =ఝం% మద్యం ధరలు పెంపు - ఏ బ్రాండ్ ఎంత..!? క్యారెట్: క్యారెట్ విటమిన్ ఎ మరియు బీటా కెరోటిన్‌కు గొప్ప మూలం. విటమిన్ ఎ చర్మ కణాలను ఆరోగ్యంగా ఉంచడానికి, చర్మం పొడిబారకుండా ఉండటానికి సహాయపడుతుంది. బీటా కెరోటిన్ శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్, ఇది చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ నుండి రక్షిస్తుంది మరియు చర్మానికి సహజమైన మెరుపును ఇస్తుంది. బీట్‌రూట్: బీట్‌రూట్ యాంటీఆక్సిడెంట్స్ మరియు విటమిన్ సి సమృద్ధిగా కలిగి ఉంటుంది. ఇది రక్తాన్ని శుద్ధి చేయడానికి, చర్మ కణాలను పునరుత్పత్తి చేయడానికి సహాయపడుతుంది. బీట్‌రూట్ చర్మానికి సహజమైన గులాబీ రంగును అందిస్తుంది మరియు చర్మం కాంతివంతంగా కనిపించేలా చేస్తుంది. అల్లం: అల్లం యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటుంది. ఇది చర్మంపై వాపులు, మొటిమలు మరియు ఇతర చర్మ సమస్యలను తగ్గించడానికి సహాయపడుతుంది. అల్లం రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది, ఇది చర్మానికి పోషకాలు సరిగా అందేలా చేస్తుంది. నిమ్మకాయ: నిమ్మకాయ విటమిన్ సి యొక్క గొప్ప మూలం. విటమిన్ సి చర్మంలో కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతుంది, ఇది చర్మాన్ని దృఢంగా మరియు యవ్వనంగా ఉంచడానికి సహాయపడుతుంది. నిమ్మకాయ చర్మాన్ని కాంతివంతం చేయడానికి, మచ్చలను తగ్గించడానికి కూడా ఉపయోగపడుతుంది. యాపిల్: యాపిల్ ఫైబర్ మరియు విటమిన్లు సమృద్ధిగా కలిగి ఉంటుంది. ఫైబర్ శరీరం నుండి విష పదార్థాలను తొలగించడానికి సహాయపడుతుంది, ఇది చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. యాపిల్ చర్మాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచడానికి కూడా సహాయపడుతుంది. పసుపు: పసుపులో కర్కుమిన్ అనే శక్తివంతమైన యాంటీ ఇన్ఫ్లమేటరీ మరియు యాంటీఆక్సిడెంట్ ఉంటుంది. ఇది చర్మాన్ని కాంతివంతం చేయడానికి, మచ్చలను తగ్గించడానికి మరియు చర్మ సమస్యలను నివారించడానికి సహాయపడుతుంది. " గ్లో జ్యూస్ రెసిపీ తయారు చేసే విధానం: ఈ జ్యూస్ తయారు చేయడం చాలా సులభం, మరియు దీనికి కావలసిన పదార్థాలు మీ ఇంటి వంటగదిలోనే సులభంగా లభిస్తాయి. కావలసిన పదార్థాలు: క్యారెట్: 2 మీడియం సైజు బీట్‌రూట్: 1 మీడియం సైజు అల్లం: చిన్న ముక్క (సుమారు 1 ఇంచ్) %ూాంజవతీఱంవఎవత్% నిమ్మకాయ: 1/2 చెక్క యాపిల్: 1 చిన్నది (ఆప్షనల్) పసుపు: చిటికెడు (ఆప్షనల్) తయారీ విధానం: క్యారెట్, బీట్‌రూట్, యాపిల్ (ఉపయోగిస్తే), అల్లం ముక్కలను శుభ్రంగా కడగాలి. వాటిని చిన్న ముక్కలుగా కట్ చేయాలి. జ్యూసర్ లో ఈ ముక్కలను వేసి జ్యూస్ తీయాలి. జ్యూస్‌ను గ్లాసులోకి వడకట్టి, నిమ్మరసం మరియు పసుపు (ఉపయోగిస్తే) వేసి బాగా కలపాలి. ఈ జ్యూస్‌ను ఉదయం ఖాళీ కడుపుతో లేదా భోజనానికి గంట ముందు తీసుకోవడం ఉత్తమం. వారానికి 3-4 సార్లు తీసుకోవడం వల్ల మంచి ఫలితాలు కనిపిస్తాయి. ఈ జ్యూస్ ఎలా పనిచేస్తుంది? ' గ్లో జ్యూస్'లోని పదార్థాలు ఒకదానితో ఒకటి కలిసి పనిచేసి చర్మానికి అవసరమైన పోషణను అందిస్తాయి. ఈ జ్యూస్ శరీరాన్ని డీటాక్స్ఫై చేస్తుంది, రక్తాన్ని శుద్ధి చేస్తుంది. చర్మ కణాల పునరుత్పత్తిని ప్రోత్సహిస్తుంది. ఇది చర్మాన్ని లోపలి నుండి ఆరోగ్యంగా మరియు మెరిసేలా చేస్తుంది. ఈ ' గ్లో జ్యూస్'తో పాటు చర్మాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచడానికి రోజుకు కనీసం 8 గ్లాసుల నీరు త్రాగాలి. పండ్లు, కూరగాయలు మరియు పోషకాలు సమృద్ధిగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి. రోజుకు 7-8 గంటలు నిద్రపోవడం చర్మ ఆరోగ్యానికి చాలా ముఖ్యం.



# బరువు పెరిగితే ఎముకలకు డేంజర్... జాగ్రత్త!

ఊబకాయం అనేక సమస్యలకు కారణం అవుతుంది. ఒక్కసారి బరువు పెరిగితే దానివల్ల వచ్చే సైడ్ ఎఫెక్ట్స్ అన్ని ఇన్ని కాదు. బరువు పెరగడం వల్ల శరీరంలో అనేక కొత్త అనారోగ్య సమస్యలు గూడుకట్టుకుంటాయి. బరువుతో ఎముకలకు సమస్య వచ్చి పడుతుంది. బరువుతో పాటు ఎముకల సమస్యలు చాలామంది చిన్న వయసునుండే వెన్నెముక సమస్యలను ఎదుర్కొంటూ ఉంటారు. అయితే దీనికి ప్రధాన కారణం వారి బరువే అని వైద్యులు చెబుతున్నారు. మన శరీరానికి వెన్నెముక ఊతాన్ని ఇస్తుంది. అధికంగా బరువు పెరిగినప్పుడు ఆ బరువు ప్రభావం ఒత్తిడిగా మారి వెన్నెముకపై పడుతుంది. అప్పుడు అది బలహీనపడుతుంది. దీని కారణంగా నడుము నొప్పి వంటి సమస్యలు వస్తాయి. నడుమునొప్పికి, వెన్నెముకపై ప్రభావానికి కారణం అదే మరీ ముఖ్యంగా ఆడవాళ్ళల్లో ఎముకలకు సంబంధించి ఆస్టియో పోరోసిస్ అనే ఎముకల వ్యాధి వస్తుంది. దీని కారణంగా ఆడవాళ్ళల్లో నడుము నొప్పి సాధారణంగా ఉంటుంది. ఇక మగవారిలో కూడా నడుపు నొప్పికి ముఖ్య కారణం అధిక బరువే. అధిక బరువు కారణంగా డిస్కులు ఒత్తిడికి గురవుతాయి. ఫలితంగా వారికి వెన్ను నొప్పి వస్తుంది వెన్నెముకలోని లోయర్ బ్యాక్ లో అధిక బరువు ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఎముకల ధృఢత్వానికి కావాల్సిన పోషకాల లోపం ఎక్కువగా బరువు ఉన్నప్పుడు అక్కడ ధృఢత్వం తగ్గుతుంది. ఎక్కువ దూరం నడవడానికి కూడా ఇబ్బంది పడతారు. ఇక బరువు ఎక్కువగా ఉన్నవారు తక్కువ తినాలని ఆలోచన చేస్తారు. ఆహారాన్ని తక్కువ తీసుకోవడం మాత్రమే కాకుండా, పోషకాలను కూడా తక్కువగా తీసుకుంటూ ఉంటారు. ఇలా చేయడం వల్ల ఎముకల ధృఢత్వానికి అవసరమయ్యే కాల్షియం, విటమిన్ డి, మెగ్నీషియం వంటివి లోపంగా మారుతుంది. మన బంగారం మంచిది కానప్పుడు..: వర్మా.. వాట్ నెక్స్ట్? ఒబేసిటీతో ఎముకలకు డేంజర్ ఇలా.. జాగ్రత్త ఒబేసిటీ కారణంగా శరీరాన్ని ఎక్కువగా కదిలించలేకపోవడం వల్ల ఎముకలు, కీళ్లు నొప్పులు వస్తాయి. ఎముకలు పెళుసుగా మారడానికి ఇది కూడా ఒక కారణం. ఒబేసిటీ కారణంగా ఎముకలకు సంబంధించి సమస్యలు వస్తాయి. కాబట్టి బరువు తగ్గడానికి ప్రతి రోజు ఒక క్రమ పద్ధతిలో ప్రాక్టీస్ చేయాలి. రోజు వ్యాయామం చేయడంతో పాటు క్యాల్షియం ఎక్కువగా లభించే ఆహారాన్ని తీసుకోవాలి. సమస్య తీవ్రంగా ఉంటే వైద్యులను సంప్రదించాలి.

# మొలల వ్యాధికి గుడ్ బై.. రోజూ ఈ దివ్యౌషధం తీసుకుంటే ఉపశమనం!



మొలలు, వీటినే హెమోరాయిడ్స్ అని కూడా అంటారు, ఇవి మలద్వారం మరియు పురీషనాళం లోపల వాపు, నొప్పి మరియు రక్తస్రావం కలిగించే సిరలు. ఈ సమస్యతో బాధపడేవారికి ఇది చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. కూర్చోవడం, నడవడం, చివరికి మలవిసర్జన చేయడం కూడా కష్టంగా మారుతుంది. అయితే, శుభవార్త ఏమిటంటే, మనకు ప్రకృతి ప్రసాదించిన ముల్లంగి ఈ సమస్యకు ఒక సహజ పరిష్కారంగా ఉపయోగపడుతుంది. ముల్లంగిలో దాగి ఉన్న అద్భుత గుణాలు: ముల్లంగిలో అధిక మొత్తంలో పీచుపదార్థం ఉంటుంది. ఇది మలబద్ధకాన్ని నివారిస్తుంది, మలం సులభంగా కదిలేలా చేస్తుంది. తద్వారా మొలలపై ఒత్తిడి తగ్గుతుంది. దీనిలో నీటి శాతం అధికంగా ఉంటుంది. ఇది శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచడంలో సహాయపడుతుంది, మలాన్ని మృదువుగా చేస్తుంది. ముల్లంగిలో ఉండే యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు మొలల వల్ల కలిగే వాపు , నొప్పిని తగ్గించడంలో సహాయపడతాయి. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, తద్వారా మలబద్ధకం మరియు మొలల సమస్యలు రాకుండా చూస్తుంది. అంతే కాకుండా. ముల్లంగి రసం రక్తస్రావాన్ని ఆపడానికి సహాయపడుతుంది. ముల్లంగిని ఎలా ఉపయోగించాలి? ప్రతిరోజూ ఉదయం పరగడుపున ఒక గ్లాసు ముల్లంగి రసం తాగడం వల్ల మొలల సమస్య తగ్గుతుంది. ముల్లంగిని సన్నగా తురిమి, పెరుగు, నిమ్మరసం, కొత్తిమీరతో కలిపి సలాడ్ లాగా తయారుచేసుకోవచ్చు. ముల్లంగితో కూర, పచ్చడి వంటివి తయారుచేసుకొని ఆహారంలో భాగంగా చేసుకోవచ్చు. అంతే కాకుండా వీటిని మెత్తగా పేస్ట్ చేసి, మొలలపై రాయడం వలన నొప్పి , వాపు తగ్గుతాయి. ముల్లంగితో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలు: రోజుకు కనీసం 8 గ్లాసుల నీరు తాగడం వల్ల శరీరం హైడ్రేటెడ్‌గా ఉంటుంది మరియు మలబద్ధకం నివారించబడుతుంది. పీచుపదార్థం అధికంగా ఉండే పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు వంటివి ఆహారంలో ఎక్కువగా తీసుకోండి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. మలబద్ధకం తగ్గుతుంది. మలవిసర్జన సమయంలో ఎక్కువ ఒత్తిడి పెట్టడం వల్ల మొలలు మరింత ఇబ్బంది పెడతాయి. మొలల సమస్యతో బాధపడేవారికి ముల్లంగి ఒక వరం లాంటిది. దీనిని సరైన పద్ధతిలో ఉపయోగించడం ద్వారా మొలల వల్ల కలిగే బాధల నుండి సహజంగా ఉపశమనం పొందవచ్చు. అయితే, సరైన ఆహారపు అలవాట్లు, జీవనశైలి మార్పులు చేసుకోవడం కూడా చాలా ముఖ్యం.

# పరగడుపున వేపాకు తింటే మీ శరీరంలో జరిగే అద్భుతాలు అన్నీ ఇన్నీ కావు!


వేపాకు.. ఆయుర్వేదంలో వేపాకుకు ఉండే పాత్ర అంతా ఇంతా కాదు. వేపాకు తింటే చాలా ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ప్రతిరోజు వేపాకును నమలటం అలవాటు చేసుకుంటే కలిగే ఆరోగ్య ప్రయోజనాలు అన్ని ఇన్ని కావు. మరి వేపాకుతో మనకు కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటో ప్రస్తుతం మనం తెలుసుకుందాం. వేపాకును తింటే బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు వేపాకును ప్రతిరోజు పరగడుపున తినడం వల్ల జీర్ణశక్తి మెరుగుపడుతుంది. వేపాకు మన శరీరంలో వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలను కంట్రోల్ చేస్తుంది. దయాబెటిస్ బాధితులు ప్రతిరోజు ఉదయం వేపాకును తినడం ఎంతో మంచిది. వేపాకులో ఉండే గుణాలు జీర్ణవ్యవస్థను శుభ్రం చేసి, మనకు జీర్ణ సంబంధిత వ్యాధులు రాకుండా చూస్తాయి. వేపాకులో ఉండే పోషకాలు మన వ్యాధి నిరోధక శక్తిని పెంచి అనారోగ్యాల నుండి కాపాడతాయి. గ్రీన్ కార్డు ఉన్నా తరిమేస్తాం- తేల్చేసిన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్..! లివర్‌కు, రక్త శుద్ధికి వేపాకు బెస్ట్ ప్రతిరోజు ఉదయం వేపాకు తినడం కాలేయానికి మేలు చేస్తుంది. కాలేయ సంబంధిత సమస్యలు వేపాకు తింటే మాయమవుతాయి. వేపాకు మన శరీరంలోని రక్తాన్ని శుద్ధి చేస్తుంది. మన చర్మాన్ని కాపాడుతుంది. ఇతర అవయవాలకు కూడా మేలు చేస్తుంది. వేపాకును ప్రతిరోజు తీసుకుంటే వేపాకులో ఉండే యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాల వల్ల చర్మం పైన వచ్చే మొటిమలు, మచ్చలు, ఇతర ఇన్ఫెక్షన్లు మాయమవుతాయి. వేపాకుతో ఒత్తిడికి చెక్ ఇక ప్రతిరోజు పరగడుపున వేపాకును తినడం వల్ల ఒత్తిడి తగ్గుతుంది. మానసిక ఆందోళనలు నయం చేయడంలో వేపాకు కీలకంగా పనిచేస్తుంది. ఇక వేపాకులో ఉండే ఫైబర్ కారణంగా మలబద్ధకం వంటి సమస్యలు పోతాయి. అయితే ప్రతిరోజు ఉదయాన్నే పరగడుపున మూడు నుంచి నాలుగు వేపాకులను నమిలి తినాలి. వేపాకులను తినలేకుంటే వేపాకు రసం కూడా తీసుకోవచ్చు .

# మార్కెట్

## నయా కార్లతో జోష్

**ఈ నెలలో విడుదలకానున్న నాలుగు మాడళ్లు**

**వీటిలో రెండు ఈవీ, మరో రెండు అప్‌డేటెడ్ కార్లు**




న్యూఢిల్లీ : దేశీయ రోడ్లపైకి మరో నాలుగు కొత్త మాడళ్లు దూసుకుపోవడానికి రెడీ అవుతున్నాయి. కార్ల తయారీలో అగ్రగామి సంస్థలైన మారుతితోపాటు ఎంజీ, వొల్వో, కియాలు తమ కొత్త మాడళ్లను అందుబాటులోకి తీసుకురాబోతున్నాయి. వీటిలో రెండు ఎలక్ట్రిక్ వాహనాలు కాగా, మరో రెండు ఎస్‌యూవీలు. ఈ మాడళ్లను ఈ నెల చివర్లో మార్కెట్‌కు పరిచయం చేస్తున్నాయి. వాటి వివరాలు..

మారుతి ఈ-విటారా... దేశవ్యాప్తంగా ఈవీ కార్ల విక్రయాలు టాప్‌గేర్‌లో దూసుకుపోతున్నాయి. దీంతో కార్ల తయారీ సంస్థలు వీటిపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నాయి. దీంట్లోభాగంగా మారుతి కూడా తన ఈ-విటారాను ఈ నెలలోనే మార్కెట్‌కు పరిచయం చేయబోతున్నది. ఢిల్లీలో జరిగిన భారత్ మొబిలిటీ ఎక్స్‌పో 2025లో ప్రదర్శించిన ఈ మాడల్..విడుదలకంటే ముందే షోరూంలలో ప్రదర్శిస్తున్నది కూడా. సింగిల్ చార్జింగ్‌తో 500 కిలోమీటర్లకు పైగా ప్రయాణించనున్న ఈ మాడల్ ధర రూ.18 లక్షల నుంచి రూ.26.5 లక్షల మధ్యలో ఉంటుందని అంచనా.

ఎంజీ సైబర్‌స్టార్... చైనాకు చెందిన ఆటోమొబైల్ దిగ్గజం ఎంజీ..మరో ఈవీ మాడల్‌ను దేశీయ మార్కెట్‌కు పరిచయం చేయబోతున్నది. రెండు సీట్లు కలిగిన ఎలక్ట్రిక్ స్పోర్ట్ కారు సైబర్‌స్టర్‌ను ఈ నెలలోనే అందుబాటులోకి తీసుకురాబోతున్నది. 77 కిలోవాట్ల బ్యాటరీతో తయారైన ఈ కారు కూడా 600 కిలోమీటర్లు ప్రయాణించనున్నదని అంచనా. ప్రస్తుతానికి ఈ మాడల్ ధరను విడుదల చేయకపోయినప్పటికీ దీని ధర రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షల మధ్యలో నిర్ణయించింది.


# పసిడి ధర పైపైకి.. త్వరలో లక్ష మార్క్కుకు!

**రూ.90వేల చేరువలో తులం విలువ**

**హైదరాబాద్‌లో 24 క్యారెట్ రూ.89,780**

**రూ.82,300 వద్ద 22 క్యారెట్ రేటు**

**తొందర్లోనే లక్షకు వెళ్తుందన్న అంచనాలు**



హైదరాబాద్ : బంగారం ధరలు మళ్లీ పరుగులు పెడుతున్నాయి. దేశీయ మార్కెట్‌లో ఆల్‌టైమ్ హైని తాకుతూ తులం రేటు రూ.90,000కు చేరువైంది మరి. హైదరాబాద్‌లో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల పసిడి విలువ శుక్రవారం మునుపెన్నడూ లేనివిధంగా గరిష్ఠ స్థాయిలో రూ.89,780గా నమోదైంది. గురువారం ముగింపుతో పోల్చితే ఒక్కరోజే రూ.1,200 పుంజుకోవడం గమనార్హం. నాడు రూ.88, 580గానే ఉన్నది. ఇక ఆభరణాల తయారీకి వినియోగించే 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) గోల్డ్ రేటు రూ.82,300గా ఉన్నది. అంతకుముందు రూ.81,200గా ఉండగా.. ఒక్కరోజే రూ.1,100 ఎగిసింది. పుత్తడి ధరలు ఒక్క భారతీయ మార్కెట్‌లోనేగాక, అంతర్జాతీయ మార్కెట్‌లోనూ దౌడు తీస్తున్నాయి. తొలిసారి ఔన్సు 3వేల డాలర్లను దాటేసింది. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రావడంతో.. మార్కెట్‌లో సమీకరణాలన్నీ వేగంగా మారిపోయాయి. ట్రంప్ సుంకాల హెచ్చరికలు.. గ్లోబల్ ట్రేడ్ వార్‌కు దారితీస్తాయన్న భయాందోళనలు ఇన్వెస్టర్లలో నెలకొన్నాయి. ఈ క్రమంలోనే స్టాక్ మార్కెట్ల నుంచి వారు పెట్టుబడులను వెనక్కి తీసుకుంటున్నారు. అలాగే ప్రత్యామ్నాయంగా కనిపించే బంగారం వైపు వాటిని మళ్లిస్తున్నారు. గోల్డ్ రేట్లు ఎగబాకడానికి ఇది కూడా ఓ బలమైన కారణమే. డిమాండ్ క్రమేణా పుంజుకుంటుండటంతో సహజంగానే ధరలు పెరుగుతూపోతున్నాయని మార్కెట్ నిపుణులు ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. అంతేగాక మున్ముందు ధరలు ఇంకా పెరగవచ్చన్న అంచనాలనూ వెలిబుచ్చుతున్నారు. వచ్చే నెల భారత్‌సహా మరికొన్ని దేశాలపై అధిక సుంకాలు అమల్లోకి వస్తాయని ట్రంప్ చెప్తున్న విషయం తెలిసిందే. ఇదే జరిగితే స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతాయని, పెట్టుబడులు గోల్డ్ ఇతర ప్రత్యామ్నాయ మార్గాల్లోకి వెళ్లిపోతాయని వారు అభిప్రాయపడుతున్నారు. ఫలితంగా భారతీయ మార్కెట్‌లో బంగారం ధరలు ఇంకా పెరిగిపోయేందుకు వీలున్నదని అంటున్నారు. త్వరలో లక్ష మార్కుకు.. దేశీయ మార్కెట్‌లో ఇప్పుడున్న ట్రెండ్ కొనసాగితే తులం బంగారం ధర లక్ష రూపాయలను దాటిపోవచ్చన్న అంచనాలు ప్రస్తుతం బలంగా వినిపిస్తుండటం విశేషం. దీపావళికి ఈ రికార్డును రేట్లు బ్రేక్ చేస్తాయన్న అభిప్రాయాలు అటు వ్యాపార వర్గాల నుంచి, ఇటు మార్కెట్ నిపుణుల నుంచి వస్తున్నాయి మరి. ఇంకొందరు దీపావళికి కాకపోతే ఈ ఏడాది ఆఖర్లో తప్పకుండా ధరలు రూ.లక్షను దాటేస్తాయన్న విశ్వాసాన్ని కనబరుస్తున్నారు. నిజానికి గత కొన్నేండ్లుగా పసిడి ధరలు పెరగడమే తప్ప, తగ్గిన దాఖలాలు లేవు. గణాంకాలను చూస్తే ఏటేటా అంతకంతకూ పెరుగుతూపోతున్నట్టే అర్థమవుతుంది. మొత్తానికి సంప్రదాయ కొనుగోలుదారులు, వ్యాపారులతోపాటు మదుపరులూ బంగారంపైనే ఆసక్తి కనబరుస్తుండటంతో అటు భౌతికంగా, ఇటు డిజిటల్‌గా గోల్డ్ రేట్లు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఇక ఫ్యూచర్ మార్కెట్‌లోనూ ఇదే ట్రెండ్ నడుస్తున్నది. చివరకు వెండి ధరలు కూడా ఏమాత్రం తగ్గడం లేదు. కిలో లక్షపైనే పలుకుతున్నాయి. సాధారణ కస్టమర్లతోపాటు పారిశ్రామిక వర్గాల నుంచి డిమాండ్ కనిపిస్తుండటమే ఇందుకు కారణమని చెప్తున్నారు.

# బైరెడ్డి సిద్ధార్థరెడ్డికి ఎంపీ బైరెడ్డి శబరి సవాల్

### అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అంటూ ఘాటు వ్యాఖ్యలు

అమరావతి : వైసీపీ నేత బైరెడ్డి సిద్ధార్థ రెడ్డిపై నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి ఘాటు వ్యాఖ్యలు చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... 'ఏం అభివృద్ధి చేశారో చర్చించడానికి నేను సిద్ధం. సిద్ధార్థ రెడ్డి సిద్ధమా' అంటూ ఎంపీ సవాల్ విసిరారు. 'బైరెడ్డి అంటే నేను... సిద్ధార్థ రెడ్డి కాదు. కేసులు, అరెస్టుల గురించి సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతున్నారు.. అసలు అక్క అని చూడకుండా నాపై కేసులు పెట్టించారు.. మా కార్యకర్తలపై దాడులు చేయించారు. ఏనాడూ బయటకు రాని మా అమ్మపై వ్యక్తిగత విమర్శలు చేశారు. నేను మర్చిపోను. జగన్ తల్లిని, చెల్లిని ఎలా చేశారో.. ఇక్కడా అదే చేస్తున్నారు. చాలా రోజులుగా సోషల్ మీడియాలో వ్యూస్ రాలేదని సిద్ధార్థ రెడ్డి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 9 నెలలుగా సిద్ధార్థ రెడ్డి ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. కార్యకర్తల గురించి మాట్లాడే హక్కు సిద్ధార్థ రెడ్డికి లేదన్నారు. ఫుల్ బాటిల్ వేయడం బాగా అలవాటైనట్టుంది అని ఎద్దేవా చేశారు. జగన్ మళ్ళీ రావాలని అనుకుంటున్నారని..



అయితే కల్తీ మద్యం, డ్రగ్స్, గంజాయి మళ్లీ రావాలని జగన్ రావాలనుకుంటున్నారా అని నిలదీశారు. వైసీపీ నేతల అవినీతిని తమ ప్రభుత్వం ఖచ్చితంగా బయట పెడుతుందని స్పష్టం చేశారు. సిద్ధార్థ రెడ్డి స్క్రిప్ట్ బాగా చదువుతారని.. సినిమాల్లో ట్రై చేసుకుంటే బెటర్ అంటూ ఉచిత సలహా ఇచ్చారు. ఆడుదాం ఆంధ్రాలో అవినీతి బయటికి వస్తుందని... శిక్ష తప్పదని అన్నారు. స్కూలు పిల్లలకు కూడా డ్రగ్స్ అందుబాటులోకి తెచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ ఒక్కొక్కటి అమలు చేస్తున్నారని తెలిపారు. డైవర్షన్ పాలిటిక్స్ అవసరం లేదని ఎంపీ తెలిపారు. కాగా.. కర్నూలులో హత్యకు గురైన సంజన్న కుటుంబాన్ని ఎంపీ బైరెడ్డి శబరి పరామర్శించారు. ఈ సందర్భంగా భావోద్వేగంతో కన్నీళ్లు పెట్టుకున్నారు బైరెడ్డి శబరి. కక్షలకు, వర్గపోరుకు కుటుంబాలు బలి కాకూడదని.. సంజన్న కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని ఈ సందర్భంగా ఎంపీ అన్నారు. 'నా కుటుంబ సభ్యుడిని నేను కోల్పోయాను. సంజన్న కుటుంబానికి నేను అండగా ఉంటా. ఈ హత్య వెనుక ఉన్న వారిని ఎవరినీ వదలపెట్టను. హత్య చేసిన వారికి టీడీపీకి సంబంధం లేదు. ఇద్దరి మధ్య గొడవ ఉన్నా హత్యలు చేసుకోవడం తగదు. ఖచ్చితంగా అందరికీ శిక్ష పడుతుంది. ఇది ప్రీప్లాన్డ్‌గా జరిగినట్లు తెలుస్తోంది. ఇంకోసారి ఇలాంటివి జరగకుండా చూస్తాం. హంతకులు ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీకి ఓటు వేయాలని కత్తులు, కొడవల్లతో బెదిరిస్తూ తిరిగారు' అని ఎంపీ బైరెడ్డి శబరి వెల్లడించారు.

# పవన్‌కు సిద్ధాంతాలు లేవు.. ఊసరవెల్లిలా మారుతున్నారు

### అంబటి రాంబాబు ఘాటు వ్యాఖ్యలు



అమరావతి : జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఏ మాత్రం సిద్ధాంతాలు లేవని, ఎప్పుడు ఎలా ప్రవర్తిస్తారో ఎవరికీ అర్థం కాదని , చివరికి ఆయనకు కూడా అర్థం కాదేమోనని వైసీపీ నాయకుడు అంబటి రాంబాబు ఘాటు వ్యాఖ్యలు చేశారు. సమయనుకూలంగా ఊసరవెల్లిలా మారుతూ మభ్యపెడుతున్నాదని విమర్శించారు. వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిన్నటి జనసేన ఆవిర్భావ సభలో పవన్ కల్యాణ్ ప్రసంగం తీరుపై విమర్శలు చేశారు. రాష్ట్ర ప్రజానికానికి అండగా నిలబడుతామని హామీ ఇచ్చిన పవన్ గద్దె నెక్కిన తరువాత ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. టీడీపీ కోసమే జనసేన ఆవిర్భావం.. నాలుగు దశాబ్దాల టీడీపీని నిలబెట్టింది జనసేన పార్టీ అని పవన్ అంగీకరించడం సముచితంగా ఉందన్నారు. టీడీపీని నిలబెట్టేందుకే జనసేన రాజకీయ పార్టీ పుట్టిందని అన్నారు. వైసీపీ మొదటి నుంచి కూడా చెబుతున్నది ఇదేనని స్పష్టం చేశారు. జనసేనను బీ టీం పార్టీగా చంద్రబాబు వదిలారని విమర్శించారు. చంద్రబాబు కుట్రలో భాగమే కాపులందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి టీడీపీకి ఓట్లు మళ్లించేందుకు జనసేన పార్టీ ఏర్పాటని ఆరోపించారు. ఆ పార్టీని పరోక్షంగా నడుపుతున్నది చంద్రబాబేనని విమర్శించారు. గత ఎన్నికల్లో 175 సీట్లకు బదులు కేవలం 21 స్థానాల్లో మాత్రమే పోటీచేసి గెలిచిన జనసేనకు వందశాతం స్ట్రైక్‌రేట్ వచ్చిందని గొప్పలు చెప్పుకుంటుందని విమర్శించారు. గెలిచిన 21 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు టీడీపీ, వైసీపీ నుంచి టికెట్లు రాకపోవడంతో జనసేనలో చేరి గెలుపొందారని తెలిపారు. వందశాతం జనసేనకు చెందిన నాయకులెవ్వరూ కూడా గెలువలేదని విమర్శించారు. కూటమి ఇచ్చిన హామీల అమలు ఏమైందని ప్రశ్నించారు. రాజకీయంలోకి వచ్చి ఆరోగ్యం చెడగొట్టుకున్నానని చెప్పుకోవడం విచిత్రంగా ఉందని తెలిపారు. కుటుంబ రాజకీయాలు సరికాదని పేర్కొన్న పవన్ కల్యాణ్ ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎందుకు అవకాశమిచ్చారని ప్రశ్నించారు. గద్దె నెక్కి ఏం సాధించారని ఆరోపించారు.

# కెసిఆర్‌ను ఆడిపోసుకోవడమే రేవంత్ ఎజెండా

### మండిపడ్డ మాజీమంత్రి వేముల

హైదరాబాద్ : నిత్యం కెసిఆర్‌ను విమర్శించడం తప్ప రేవంత్ రెడ్డికి మరో ఎజెండా లేకుండా పోయిందని, కేసీఆర్ మీద అక్కసుతో ఆయనకు సరైన ఛాంబర్ కూడా కేటాయించ లేదని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. 'ప్రతిపక్ష నాయకుడు సూచించిన వారినే పీఏసీ ఛైర్మన్‌గా నియమించడం ఆనవాయితీ. ఈ విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆనవాయితీని తుంగలో తొక్కింది. ప్రతిపక్ష నేతను సంప్రదించకుండానే పీఏసీ ఛైర్మన్‌ను నియమించారు. కేసీఆర్ 14 ఏళ్లు పోరాటం చేసి తెలంగాణ సాధించారు. పదేళ్లు సీఎంగా పనిచేసి తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి జుగుప్సాకరంగా మాట్లాడి తెలంగాణ పరువు తీశారు. భాజపా జపం చేస్తూ.. పొగుడుతూ, కేసీఆర్‌ను మాత్రం అగౌరవపరిచారు. ప్రజాస్వామ్యంలో సీఎంకు ఎంత ప్రాధాన్యత ఉంటుందో.. ప్రతిపక్ష నేతకు అంతే ప్రాధాన్యత ఉంటుంది' అని ప్రశాంత్‌రెడ్డి అన్నారు.

# అవిశ్వాసానికి ముందే గుంటూరు మేయర్ రాజీనామా

గుంటూరు : నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు తన పదవికి రాజీనామా చేశారు. 2021లో వైకాపా నుంచి మనోహర్‌నాయుడు మేయర్‌గా ఎన్నికయ్యారు. ఆయన పదవీ కాలం మరో ఏడాది ఉండగానే పదవికి రాజీనామా చేశారు. గత కొంతకాలంగా నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, మేయర్ మనోహర్ మధ్య వివాదం నెలకొంది. మరో వైపు ఫిబ్రవరిలో జరిగిన గుంటూరు నగర పాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో.. ఆరు స్థానాల్లో తెదేపా, జనసేన కార్పొరేటర్లు విజయం సాధించారు. వైకాపా నుంచి కార్పొరేటర్లు కూటమిలో చేరడంతో ఆ పార్టీకి పరాజయం తప్పలేదు. ఈనెల 17న స్టాండింగ్ కమిటీ సమావేశం జరగనుంది. మేయర్ కావటి మనోహర్ నాయుడిపై అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశముంది. ఈ నేపథ్యంలో మరో ఏడాది పదవీ కాలం ఉండగానే మనోహర్ తన పదవికి రాజీనామా చేశారు.

# టీడీపీ కార్యకర్త దారుణ హత్య

### కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

అమరావతి : ఏపీలో హత్య రాజకీయాలతో జనం భయభ్రాంతులకు గురవుతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయపడుతున్నారు. కర్నూలులో టీడీపీ నేత సంజన్న హత్య జరిగి 24 గంటలు గడవక ముందే మరో టీడీపీ కార్యకర్త దారుణ హత్యకు గురయ్యారు. చిత్తూరు జిల్లాలో ఈ ఘటన చోటు చేసుకుంది. జిల్లాలోని పుంగనూరు మండలం కృష్ణాపురంలో టీడీపీ కార్యకర్త రామకృష్ణను ప్రత్యర్థులు కిరాతకంగా హత్య చేశారు. పాత కక్షలతో మాజీ వాలంటీర్, వైసీపీ కార్యకర్త వెంకటరమణ కొడవలితో రామకృష్ణని నరికాడు. తీవ్రంగా గాయపడిన రామకృష్ణను మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. రామకృష్ణ పరిస్థితి విషమించడంతో తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే అతడు కన్నుమూశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పుంగనూరు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హత్యకు గురైన రామకృష్ణ.. నాలుగైదు రోజుల క్రితం ఓ వీడియోను రిలీజ్ చేశారు. వైసీపీ వ్యక్తుల నుంచి తనకు ప్రాణహాని ఉందంటూ అందులో తెలిపారు. ఎన్నిసార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా వన్ సైడ్‌గా వ్యవహరిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశాడు టీడీపీ కార్యకర్త. వీడియో రిలీజ్ చేసిన నాలుగు రోజుల్లోనే ఈరోజు రామకృష్ణ దారుణ హత్యకు గురవడం సంచలనం రేపింది. కాగా.. అటు కర్నూలులోనూ టీడీపీ నేత సంజన్న దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. జిల్లాలోని శరీన్‌నగర్‌కు చెందిన సంజన్నను కొందరు వ్యక్తులు కత్తులతో నరికి చంపారు. దుండగుల దాడిలో టీడీపీ నేత తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించగా... అప్పటికే అతడు మరణించినట్లు వైద్యులు తెలిపారు. సంజన్న గతంలో వైసీపీలో పనిచేశారు. కాటసాని రాంభూపాల్ రెడ్డితో విబేధాల కారణంగా టీడీపీలో చేరారు. అయితే శరీన్‌నగర్‌కు చెందిన రామాంజనేయులు (అంజి)తో సంజన్నకు కొంతకాలంగా విబేధాలు ఉన్నాయి. ఈ క్రమంలో నిన్న రాత్రి మెడిటేషన్ సెంటర్‌కు వెళ్లి వస్తుండగా.. అంజి, అతడి అనుచరులు దారి కాసి మరీ సంజన్నపై దాడి చేశారు. కత్తులతో కిరాతంగా నరకడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయాడు. ఆస్పత్రికి తరలించేలోపే సంజన్న ప్రాణాలు కోల్పోయాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు ఎలాంటి గొడవలు జరగకుండా శరీన్‌నగర్‌లో పికెటింగ్ ఏర్పాటు చేశారు.

# పవన్‌కల్యాణ్ మాటలకు చిరంజీవి ఫిదా

### ట్విటర్ వేదికగా పోస్టు

అమరావతి : జనసేన పార్టీ ఆవిర్భావ సభలో పవన్ కల్యాణ్ ఇచ్చిన పవర్ ఫుల్ స్పీచ్‌పై మెగాస్టార్ చిరంజీవి స్పందించారు. తమ్ముడు పవన్ స్పీచ్ చూసి ఫిదా అయిపోయానని అన్నారు. తమ్ముడి స్పీచ్ గురించి చెబుతూ చాలా ఎమోషల్ అయ్యారు. ఈ మేరకు ట్విటర్ వేదికగా ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'ప్రియమైన నా తమ్ముడు పవన్ కల్యాణ్.. జనసేన పార్టీ ఆవిర్భావ సభలో నువ్వు ఇచ్చిన స్పీచ్ చూసి ఫిదా అయిపోయాను. సభలో పాల్గొన్న అశేష జనసంద్రంలానే నా మనసు కూడా ఉప్పొంగిపోయింది. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే నాయకుడొచ్చాడన్న నమ్మకం మరింత బలపడింది. ప్రజా సంక్షేమం కోసం ఉద్యమస్ఫూర్తితో నీ జైత్రయాత్ర నిర్విఘ్నంగా కొనసాగాలని ఆశీర్వదిస్తున్నాను. జనసైనికులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు' అని పేర్కొన్నారు. గురువారం పిఠాపురంలో జనసేన పార్టీ ఆవిర్భావ సభ జరిగింది. ఈ సభలో జనసైనికులు, పవన్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సభలో పవన్ కల్యాణ్ ఇచ్చిన స్పీచ్, మాట్లాడిన కొన్ని విషయాలు రెండు తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా హాట్ టాపిక్ అయ్యాయి. స్పీచ్ మొదట్లోనే పవన్ కల్యాణ్ తెలంగాణ గురించి మాట్లాడారు. ఆంధ్ర గడ్డ మీద జై తెలంగాణ అంటూ నినాదాలు చేశారు. నా తెలంగాణ కోటిరతనాల వీణ అంటూ కొనియాడారు. ఆయన మాట్లాడుతూ.. ' కరెంట్ షాక్ తగిలి చనిపోబోయిన నాకు పునర్జన్మనిచ్చింది కొండగట్టు ఆంజనేయ స్వామి దీవెనలు, నా అభిమానుల దీవెనలే. జనసేన పార్టీ జన్మస్థలం తెలంగాణ. నాకు గద్దర్ అంటే అభిమానం. నేను దారథి సాహిత్యం చదివి ప్రభావితం అయ్యాను. రుద్రవీణ వాయిస్తా.. అగ్నిధారలు కురిపిస్తా అనే మాటు నిజం చేశాం' అని అన్నారు.

# రన్యారావు సవతి తండ్రి రామచంద్రకు చిక్కులు

### బలవంతపు సెలవుపై పంపించిన ప్రభుత్వం

బెంగళూరు : బంగారం అక్రమ రవాణా కేసులో అరెస్టయిన కన్నడ నటి రన్యారావు సవతి తండ్రి, సీనియర్ పోలీసులు అధికారి కె.రామచంద్రావు చిక్కుల్లో పడినట్టే కనిపిస్తోంది. కర్ణాటక స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డీజీరించింది. తక్షణం ఆదేశాలు అమల్లోకి వచ్చినట్టు ఉన్నతాధికారులు ప్రకటించారు. అయితే ఆయనను కంపల్సరీ లీవుపై పంపడం వెనుక కారణాలు ఏమిటనేవి వెంటనే తెలియలేదు. ఈ నెల ప్రారంభంలో రన్యారావు దుబాయి నుంచి బెంగళూరు కెంపెగౌడ విమానాశ్రయానికి చేరుకోగానే డీఆర్ఐ అధికారులు ఇటీవల అడ్డుకుని, అక్రమంగా తీసుకువస్తున్న 14.8 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. తాను దుబాయ్, అమెరికా, యూరప్ దేశాల్లో పలుమార్లు పర్యటించినట్టు డీఆర్ఐ విచారణలో తొలుత అంగీకరించిన రెన్యారావు.. తనను అక్రమంగా ఇరికించారని, తాను అమాయకురాలినని చెప్పారు. ఈ నేపథ్యంలో డీఐఆర్ఐ సమాచారంతో సీబీఐ సైతం దర్యాప్తు బృందాన్ని బెంగళూరు పంపింది. ఎయిర్ పోర్ట్ అధికారులు, సిబ్బంది ఎవరైనా రన్యారావుకు సహకరించారా అనే కోణం నుంచే కాకుండా, డీజీపీ కె.రామచంద్రరావు ప్రమేయంపై కూడా దర్యాప్తు సంస్థలు విచారణ చేస్తున్నాయి. కాగా, రన్యారావు అరెస్టు వెలుగుచూసిన వెంటనే దీనిపై రామచంద్రరావు స్పందించారు. తనకు కూడా మీడియా వార్తలు చూసిన తర్వాతే అరెస్టు విషయం తెలిసిందని, తాను కూడా అందరిలాగానే దిగ్భ్రం÷-రతికి గురయ్యానని చెప్పారు. రన్యారావు తమతో ఉండటంలేదని, తన భర్తతో వేరేగా ఉంటోందని, వారి మధ్య ఏదైనా కుటుంబ సమస్యలు ఉండవచ్చని అన్నారు. అంతకుమించి చెప్పేదేమీ లేదన్నారు. ఈ క్రమంలోనే రామచంద్రరావుపై వినిపిస్తు?న్న ఆరోపణలపై విచారణకు ఒక అధికారిని కూడా కర్ణాటక ప్రభుత్వం నియమించింది. తాజాగా, ఆయనను 'కంపల్సరీ లీవు'పై వెళ్లాలనే ఆదేశాలు జారీ అయినట్టు ప్రభుత్వం తెలిపింది. రామచంద్రరావు ప్రస్తుతం నిర్వహిస్తున్న బాధ్యతలను అడిషనల్ డెరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (రిక్రూట్‌మెంట్) కెవీ శరత్ చంద్రకు అప్పగించారు.

# జాతీయ విద్యావిధానం హిందీని బలవంతంగా రుద్దలేదే

### అలాంటప్పుడు దానిని వ్యతిరేకించడం సరికాదు

### ఎక్స్ వేదికగా పవన్ కళ్యాణ్ వెల్లడి

అమరావతి : భాషా వివాదంపై ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఒక భాషను బలవంతంగా విధించడం లేదా ఒక భాషను వ్యతిరేకించడం సరికాదన్నారు. ఈ రెండూ భారత జాతీయ, సాంస్కృతిక ఏకీకరణ లక్ష్యాన్ని సాధించడంలో సహాయ పడవన్నారు. హిందీని ఒక భాషగా తానెప్పుడూ వ్యతిరేకించలేదని క్లారిటీ ఇచ్చారు పవన్. నేషనల్ ఎడ్యూకేషన్ పాలసీ హిందీని అమలు చేయనప్పుడు.. దాని విధింపు గురించి తప్పుడు కథనాలను వ్యాప్తి చేయడం ఎందుకు అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. ఇలా చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం తప్ప మరొకటి కాదన్నారు. నేషనల్ ఎడ్యూకేషన్ పాలసీ ప్రకారం.. విద్యార్థులు విదేశీ భాషతో పాటు ఏదైనా రెండు భారతీయ భాషలను(తమ మాతృభాషతో సహా) నేర్చుకునే సౌలభ్యాన్ని కలిగి ఉంటారన్నారు. హిందీ వద్దనుకుంటే.. తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, మరాఠీ, సంస్కృతం, గుజరాతీ, అస్సామీ, కాశ్మీరీ, ఒడియా, బెంగాలీ, పంజాబీ, సింధీ, బోడో, డోగ్రీ, కొంకణి, మైథిలీ, మైతేయి, నేపాలీ, సంతాలి, ఉర్దూ లేదా మరే ఇతర భారతీయ భాషనైనా ఎంచుకోవచ్చన్నవారు. బహుళ-భాషా విధానం ఎంపికతో విద్యార్థులను ప్రోత్సహించడానికి, జాతీయ ఐక్యతను ప్రోత్సహించడానికి, భారతదేశం గొప్ప భాషా వైవిధ్యాన్ని కాపాడడానికి ఉపకరిస్తుందన్నారు. రాజకీయ ఎజెండాల కోసం నూతన విద్యా విధానాన్ని తప్పుగా అర్థం చేసుకోవడం, పవన్ తన వైఖరిని మార్చుకున్నారని చెప్పడం సదరు వ్యక్తుల అవగాహనా రాహిత్యాన్ని ప్రతిబింబిస్తుందని విమర్శించారు. జనసేన పార్టీ ప్రతి భారతీయునికి భాషాపరమైన స్వేచ్ఛ, విద్యా ఎంపిక సూత్రానికి కట్టుబడి ఉందని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

# 2029 ఎన్నికలు లక్ష్యంగా పనిచేయాలి

### కడపలో మహానాడులో మహిళలే కీలకం

### తణుకు సభలో పార్టీ శ్రేణులకు బాబు సూచన

భీమవరం : ప్రతి కార్యకర్త 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పనిచేయాలని టీడీపీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. తాను ఎక్కడికి వెళ్లినా కార్యకర్తలతో సమావేశం అవుతున్నానని, అలాగే ప్రతి ఎమ్మెల్యే కూడా వారిని కలవాలని ఆదేశించారు. తణుకు నూలి గ్రౌండ్స్‌లో నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, ఉండి మాజీ ఎమ్మెల్యే రామరాజు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ..' గడిచిన ఐదేళ్లపాటు నాతో సహా టీడీపీ నాయకులు, కార్యకర్తలు అందరూ ఇబ్బందులు పడ్డారు. టీడీపీకి ఒక పటిష్టమైన యంత్రాంగం ఉంది. ఇకపైనా పార్టీ యంత్రాంగం ఎప్పటికప్పుడు మరింత పటిష్టంగా ఉండాలి. ఎన్ని ఒడిదుడుకులు, ఇబ్బందులు వచ్చినా టీడీపీ ఎప్పుడూ అధైర్య పడలేదు. ఎన్ని కష్టాలు ఎదురైనా కార్యకర్తలు ఎప్పుడూ నా వెంటే ఉన్నారు. ఎప్పటికప్పుడు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు నన్ను ఆదరిస్తూనే ఉన్నారు. ఎవ్వరికీ దక్కని గౌరవం టీడీపీకి, నాకూ దక్కింది. అది నా పూర్వ జన్మ పుణ్యం. గత ఎన్నికల్లో జనసేనతో పొత్తు పెట్టుకున్నాం. ఆంధ్రప్రదేశ్ బాగుపడుతుందనే బీజెపీతో కలిసి పని చేస్తున్నాం. ఏపీ సర్వనాశనం అయిపోతుందనే కలిసి వెళ్లాలనే నిర్ణయించి ముందుకు వెళ్తున్నాం. ముఖ్యమంత్రిగా ఉండి చాలా కష్టాలు చూస్తున్నా. సీఎం అంటే అనుభవించడం కాదు. ఏపీ సమస్యలు ఎలా పరిష్కరిస్తారని చాలామంది అడిగారు. దానికి ఒకటే మార్గం.. ఒకటి పారిపోవడం లేదా రెండు ÷ట్ చేయటం. నేను ÷ట్‌నే ఎంచుకున్నా. 9 నెలలుగా ఆర్థిక వ్యవస్థ వెసులుబాటు లేదు. గత ప్రభుత్వం వల్ల వ్యవస్థలన్నీ నాశనం అయ్యాయి. వ్యవస్థలు సరిగా పనిచేయడం లేదు. సూపర్ సిక్స్‌లో ఇప్పటికే కొన్ని హామీలు అమలు చేశాం. కేంద్రం నుంచి వచ్చే నిధులను అభివృద్ధితోపాటు మిగిలిన వాటిని సంక్షేమానికి వాడుతున్నామని అన్నారు. టీడీపీ పదవులు ఇచ్చేటప్పుడూ రెండు విషయాలను గుర్తు పెట్టుకుంటుంది. అనుభవం పార్టీకి అవసరం, పరిగెత్తే యువ రక్తం కూడా అవసరం. మొన్న ఎన్నికల్లో ప్రజల ఆమోదం తీసుకుని సీట్లు కేటాయించాం. దేశంలో ఏ రాజకీయ పార్టీ చేయని విధంగా అభ్యర్థులను ఎన్నిక చేశాం. కుటుంబ పెద్ద తప్పుడు నిర్ణయాలు తీసుకుంటే కుటుంబం అంతా నాశనం అవుతుంది. ప్రజల ఆమోదంతోనే ఎవరెవరికి ఏమి చేయాలనేది నిర్ణయిస్తా. ప్రతి క్యాడర్ పార్టీని బలోపేతం చేయడానికి పనిచేయాలి. అలా కాకుండా పార్టీకి ఇబ్బంది కలిగించే ప్రయత్నం చేస్తే ఒకటి రెండుసార్లు చూస్తా. తర్వాత పనిష్మెంట్ గట్టిగా ఉంటుంది. ఎక్కడైనా కార్యకర్తల కాంట్రాక్ట్ బిల్లులు రాజకీయంగా ఆపి ఉంటే చర్య తీసుకునే బాధ్యత మంత్రులు, ఎమ్మెల్యేలదేనని అన్నారు. ఈసారి మహానాడు కడపలో పెడుతున్నాం. టీడీపీ పుట్టిన తర్వాత మొదటిసారి కడపలో పెడుతున్నాం. పార్టీని గెలిపించేది, నడిపించేది బలహీన వర్గాలు మాత్రమే. ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసిన ముగ్గురూ బలహీనవర్గాలకు చెందిన బీసీ నేతలే. పార్టీని నమ్ముకున్న టీడీపీ కుటుంబ సభ్యులందరినీ పైకి తీసుకురావడానికి ఏం చేయాలనే దానిపై ఆలోచిస్తున్నా. పార్టీ సభ్యులు ఆఫీసుకి వస్తే సొంత బంధువుల మాదిరిగా అల్పాహారం, విందు ఇచ్చి పంపించే పార్టీ ఒక్క టీడీపీయే. నిన్న కన్నా నేడు ఇంకా బాగా పని చేయడానికి నేను సిద్ధంగా ఉన్నా. అలాగే కార్యకర్తలూ సిద్ధంగా ఉండాలి. మీ మైండ్‌లో ఎప్పుడూ 2029 ఎన్నికలను గుర్తుపెట్టుకోవాలి. మహిళలకు త్వరలో 1/3 రిజర్వేషన్స్ అసెంబ్లీ, పార్లమెంటులో వస్తున్నాయి. ఇవాళ మగవారితో సమానంగా ఆడబిడ్డలూ పోటీపడే అవకాశం వచ్చిందని' చెప్పారు.

# వెంకటపాలెంలో శ్రీవారి కళ్యాణోత్సవం

### పట్టువస్త్రాలు సమర్పించిన సిఎం దంపతులు

అమరావతి : వెంకటపాలెంలో శ్రీవారి కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీనివాస కళ్యాణోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామివారికి సీఎం దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. అమరావతి పునర్నిర్మాణం విజయవంతంగా జరగాలంటూ శ్రీనివాస కళ్యాణం నిర్వహిస్తున్నారు. కళ్యాణ వేదిక వద్దకు ముఖ్యమంత్రి చంద్రబాబు సతీసమేతంగా విచ్చేశారు. వేద పండితుల నుంచి ఆశీస్సులు తీసుకున్నారు. ÷ూజధానిలో ప్రతీ ఇంటికి కళ్యాణ ఆహ్వాన పత్రిక అందజేశారు. రాజధాని గ్రామాల ప్రజలు స్వామివారి కళ్యాణోత్సవానికి భారీగా తరలి వచ్చారు. శ్రీనివాస కళ్యాణానికి వచ్చే భక్తులకు సకల సౌకర్యాలు ఏర్పాటు చేశారు. శ్రీనివాస కళ్యాణం భక్తులందరూ వీక్షించేలా అతిపెద్ద ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. 600 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేశారు. 5 డ్రోన్, 70 సీసీ కెమెరాలతో నిరంతరం గస్తీ నిర్వహిస్తున్నారు. 2 వేల మంది శ్రీవారి సేవకులతో భక్తులకు సేవలు అందిస్తున్నారు. భక్తులకు శ్రీవారి లడ్డూ ప్రసాదంతో కూడిన కిట్‌ను టీటీడీ అధికారులు అందిస్తున్నారు.

# పసుపునకు 15వేలు మద్దతు ధర ఇవ్వాలి

హైదరాబాద్ : పసుపు రైతులకు రూ.15వేల కనీస మద్దతు ధర ఇవ్వాలని ఎమ్మెల్సీ కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ శాసనమండలి వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు ప్లకార్డులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. చాన్నాళ్లుగా పసుపు రైతులు ఎన్నో ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నారని, పసుపు రైతులకు కనీస మద్దతు ధర ఇవ్వాలన్న అంశంపై కేంద్రం కానీ, రాష్ట్ర ప్రభుత్వం కానీ ఎటువంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. తెలంగాణలోని పసుపు రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. పసుపు రైతులకు కనీస మద్ద ధర 15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్నదని, కానీ ఆ పార్టీ పసుపు రైతుల్ని మోసం చేసినట్లు కవిత ఆరోపించారు.



## తమన్నా బాయ్‌ఫ్రెండ్‌కు అరుదైన వ్యాధి

సీనియర్ నటి తమన్నా భాటియా, బాలీవుడ్ ప్రముఖ నటుడు విజయ్ వర్మ వివాహం చేసుకుంటారని అభిమానులు ఆశగా ఎదురు చూశారు. కానీ ఇప్పుడు షాకింగ్ న్యూస్ ఒకటి వినిపిస్తోంది. చాలా కాలంగా డేటింగ్ లో ఉన్న విజయ్ వర్మ, తమన్నా భాటియా ఇప్పుడు విడిపోయారని వార్తలు పుట్టుకొచ్చాయి. అయితే ఈ వార్తల్లో వాస్తవం లేదని తెలుస్తుంది. మిల్కీ బ్యూటీ తమన్నా ఒకానొక సమయంలో టాలీవుడ్‌ను ఏలింది. వరుసగా సినిమాలు చేసి మంచి క్రేజ్ తెచ్చుకుంది ఈ అమ్మడు. తెలుగులో దాదాపు స్టార్ హీరోలందరి సరసన సినిమాలు చేసింది. శ్రీ సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన ఈ చిన్నది.. హ్యాపీడేస్ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఈ సినిమా తర్వాత తెలుగులో బిజీగా మారి పోయింది. తమన్నా ప్రస్తుతం తెలుగులో సినిమాలు తగ్గించింది. హిందీ మీద ఎక్కువ ఫోకస్ పెట్టింది ఈ చిన్నది. తెలుగులో చివరిగా చిరంజీవి హీరోగా నటించిన భోళాశంకర్ సినిమాలో చేసింది. ఈ సినిమా డిజాస్టర్ గా నిలిచింది. ఇదిలా ఉంటే తమన్నా త్వరలోనే పెళ్లి పీటలెక్కనుందని వార్తలు వినిపిస్తున్నాయి. తమన్నా విజయ్ వర్మతో ప్రేమలో ఉన్న విషయం తెలిసిందే. విజయ్ వర్మ ఎవరో కాదు. బాలీవుడ్ నటుడు.. అలాగే నేచురల్ స్టార్ నాని హీరోగా నటించిన ఎమ్‌సీఏ సినిమాలో విలన్ గా నటించాడు. అయితే చాలా కాలంగా ప్రేమలో మునిగి తేలుతున్నారు. అయితే ఈ ఇద్దరూ ఈ మధ్య విడిపోయారు అంటూ వార్తలు వచ్చాయి. తమన్నా, విజయ్ వర్మ బ్రేకప్ చేసుకున్నారని రూమర్స్ వినిపించాయి. వాటిలో నిజం లేదు అని అంటున్నారు. ఇదిలా ఉంటే విజయ్ వర్మ ఓ అరుదైన వ్యాధితో బాధపడుతున్నాడని తెలుస్తుంది. విజయ్ వర్మ తనకు విటిలిగో అంటే బొల్లి వ్యాధి ఉందని బహిరంగంగానే తెలిపారు. ఈ వ్యాధి కారణంగా తన చర్మం పై తెల్లటి మచ్చలు ఉంటాయని వివరించారు. అలాగే దాని కారణంగా తన లైఫ్ లో అశాంతి నిండిపోయింది అని తెలిపారు. ఇదిలా ఉంటే తమన్నా విజయ్ కలిసి ఓ వెబ్ సిరీస్ లోనూ నటించారు. త్వరలోనే పెళ్లి చేసుకోనున్నారని తెలుస్తుంది. రీసెంట్ గానే ఈ ఇద్దరూ కలిసి హెూలీ సెలబ్రేషన్ లో పాల్గొన్నారు.



## నటి హానీ రోజ్ పై తీవ్ర ఆరోపణలు నటి ఫరా శిబిలా

నటసింహం నందమూరి బాలకృష్ణ నటించిన వీరసింహారెడ్డి సినిమాతో ఒక్కసారిగా తెలుగు ప్రేక్షకుల మనసులో స్థానం సంపాదించుకుంది హాట్ బ్యూటీ హనీరోజ్. మలయాళ ఇండస్ట్రీకి చెందిన ఈ ముద్దుగుమ్మ గతంలో తెలుగులో సినిమాలు చేసింది. కానీ అంతగా గుర్తింపు తెచ్చుకోలేదు. ఆతర్వాత మలయాళం పైనే ఎక్కువ దృష్టి పెట్టింది. అక్కడ వరుసగా సినిమాలు చేసి క్రేజ్ తెచ్చుకుంది. మలయాళంలో హనీ రోజ్ చాలా పాపులర్ నటి. వీరసింహారెడ్డి సినిమా తర్వాత ఈ ముద్దుగుమ్మ మరో సినిమా అనౌన్స్ చేయలేదు. చాలా రోజుల తర్వాత హనీ రాచెల్ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా మలయాళంతో పాటు పలు భాషల్లోనూ విడుదల కానుంది. సినిమాలే కాకుండా సోషల్ మీడియాలో కూడా చాలా యాక్టివ్‌గా ఉంటుంది ఈ బ్యూటీ. హనీ రోజ్ చేసిన అన్ని ఫోటోషూట్‌లు నెట్టింట తెగ చక్కర్లు కొడుతున్నాయి. అంతే కాదు ఈ అమ్మడు సినిమాలతో కంటే షాపింగ్ మాల్స్ ఓపినింగ్స్ తోనే కాలం గడిపేస్తోంది. ఇదిలా ఉంటే తాజాగా హనీ రోజ్ పై ఓ నటి తీవ్ర ఆరోపణలు చేసింది. హనీరోజ్ తప్పుడు దారిలో డబ్బులు సంపాదిస్తుందని ఆమె ఆరోపించింది. ఇంతకూ ఆమె ఎవరంటే ఫరా శిబిలా. నటి ఫరా శిబిలా హనీరోజ్ గురించి మాట్లాడుతూ.. మనపై మనకు నమ్మకం ఉండాలి.అప్పుడే ముందడుగు వేయాలి. ఎవరైనా సరే ప్రతిభను నమ్ముకోవాలి కానీ శరీరాన్ని కాదు. ఇక హనీ రోజ్ ఇప్పుడు శరీరాన్ని చూపిస్తూ డబ్బు సంపాదిస్తోంది అంటూ చెప్పుకొచ్చింది. హనీరోజ్ డ్రస్సింగ్ గురించి నేను మాట్లాడటం లేదు. కానీ ఆమె ఫోటో షూట్స్ లో రకరకాల ఫోజులు ఇస్తూ ఫోటోలు దిగుతుంది. రకరకాల యాంగిల్స్ లో తీసిన ఫోటోలను, వీడియోలను ఆమె స్వయంగా షేర్ చేస్తోంది. ఇంస్టాగ్రామ్ లో అందరూ కూడా తమ శరీరాలను చూపిస్తూ ఎగ్జిబిషన్ పెట్టేస్తున్నారు. హనీరోజ్ కూడా అదే చేస్తుంది అని ఆమె ఆరోపించింది. హనీరోజ్ అమాయకురాలు కాదు. ఆమెకు అన్ని తెలుసు. శరీరాన్ని చూపిస్తూ డబ్బు సంపాదించడం అనేది తప్పు అని నా అభిప్రాయం అని తెలిపింది. మరి దీని పై హాని రోజ్ ఎలా స్పందిస్తుందో చూడాలి.

## ఆమెలో నాకు అదే నచ్చింది

### కొత్త గర్ల్‌ఫ్రెండ్ గురించి చెప్పిన అమీర్‌ఖాన్






బాలీవుడ్ మిస్టర్ పర్ఫెక్షనిస్ట్ ఆమీర్ ఖాన్. సినిమాలతో పాటు తన వ్యక్తిగత జీవితంతోనూ నిత్యం వార్తల్లో నిలుస్తోన్న ఆయన ఇప్పుడు మరోసారి నెట్టింట ట్రెండ్ అవుతున్నారు. ఇప్పటికే రెండు సార్లు పెళ్లి చేసుకుని, తన ఇద్దరు భార్యలకు విడాకులు ఇచ్చేసిన ఆమిర్ ఖాన్ జీవితంలోకి మళ్లీ కొత్త ప్రేమ ప్రవేశించిందని వార్తలు వైరల్ అవుతున్నాయి. ఆమీర్ ఖాన్ ఓ యువతితో డేటింగ్ చేస్తున్నాడని టాక్ వినిపిస్తుంది. ఆమె పేరు గౌరి. ఆమీర్ ఖాన్ రీసెంట్ గా తన 60వ పుట్టినరోజు సందర్భంగా కొత్త స్నేహితురాలిని పరిచయం చేశాడు. ఇప్పుడు గౌరి ఆమిర్ ఖాన్ లో తనకు నచ్చిన విషయాన్ని వెల్లడించింది. ఈకామెంట్స్ ఇప్పుడు వైరల్ గా మారాయి. ముందుగా ఆమీర్ ఖాన్ మాట్లాడుతూ.. గౌరీలో తనకు నచ్చిన విషయాన్ని వెల్లడించాడు. 'నన్ను ప్రశాంతంగా ఉంచే, నాకు పీస్ ను ఇచ్చే భాగస్వామి కోసం నేను వెతుకుతున్నాను.' గౌరికి ఆ లక్షణాలు ఉన్నాయి అనిఆమీర్ ఖాన్ అన్నారు. అలాగే గౌరీ మాట్లాడుతూ.. 'నాకు మంచి వాడు, సౌమ్యుడైన, శ్రద్ధగల వ్యక్తి అవసరం.' "అప్పుడు నేను ఆమీర్ ఖాన్ ను కలిశాను" అని గౌరి తెలిపింది. ఆమీర్ ఖాన్ , గౌరీ 25 సంవత్సరాలుగా ఒకరికొకరు తెలుసు. 25 సంవత్సరాలుగా తెలిసినప్పటికీ ఇద్దరి మధ్య అంతగా మాటలు ఉండేవి కాదు. "మేము ఒకటిన్నర సంవత్సరం క్రితం మళ్ళీ పరిచయమయ్యాము" అని ఆమీర్ ఖాన్ అన్నారు. గౌరి బెంగళూరులో పెరిగింది. అతను సౌత్ సినిమాల అభిమాని. ఆమె పెద్దగా హిందీ సినిమాలు చూడలేదు. గౌరీ ఏడాది క్రితం ఆమీర్ నటించిన 'దిల్ చాహ్తే హై', 'లగాన్' సినిమాలు చూసిందట. ఇక ఆమీర్ ఖాన్ మార్చి 14, 1965న జన్మించాడు. అదేవిధంగా, గౌరి ఆగస్టు 21, 1978న జన్మించింది. ఇద్దరి మధ్య దాదాపు 14 సంవత్సరాలగ్యాప్ ఉంది. ఈ విషయం గురించి బాలీవుడ్ లో చాలా చర్చ జరుగుతోంది.

## ఆ ఇద్దరు నిర్మాతలకు హ్యాండించిన సన్నిడియోల్

బాలీవుడ్‌లో ఏ హీరో కు ఎప్పుడు టైమ్ వస్తుందో చెప్పడం కష్టం. అగ్ర కథానాయకులుగా రాణించిన వారు... ఒక్కసారిగా తెర మాటుకు వెళ్ళిపోతుంటారు. 'ఇక ఈ హీరో పని అయిపోయింది' అనుకున్న సమయంలో సీనియర్ హీరోలు ఊహించని విజయంతో తెర మీదకు వస్తున్నారు. ప్రస్తుతం సన్నీ డియోల్ పరిస్థితి ఇదే. సన్నీ డియోల్ కు ఇక విజయం దక్కడం కష్టమని అంతా అనుకుంటున్న టైమ్ లో 'గదర్ -2' సినిమాతో అమాంతంగా రూ. 500 కోట్ల క్లబ్ లో చేరి 'సన్నీ ఈజ్ బ్యాక్' అనిపించుకున్నాడు. అయితే 'గదర్ -2' సక్సెస్ తర్వాత సన్నీ డియోల్ ప్రాధాన్యతలు మారిపోయాంటూ కొందరు వాపోతున్నారు. 'గదర్ -2' చిత్రానికి ముందు సన్నీ కొన్ని సినిమాలు అంగీకరించాడు. అందులో ఒకటి 'సూర్య'. ఇది మలయాళ చిత్రం 'జోసఫ్'కు రీమేక్. కమల్ ముకుత్ నిర్మిస్తున్న ఈ సినిమా దాదాపు ఎనభై శాతం షూటింగ్ అయిపోయింది. కానీ నిర్మాణపరంగా జరిగిన జాప్యంతో ఈ మూవీ వెనక్కి వెళ్ళిపోయి 'గదర్ -2' ముందు కొచ్చింది. 'గదర్ -2' తర్వాత 'సూర్య' ను పూర్తి చేస్తానని సన్నీ చాలా సార్లు చెప్పారు. కారణాలు ఏవైనా... అది మాత్రం జరగలేదు. విశేషం ఏమంటే మలయాళ చిత్రం 'జోసఫ్' ను తెలుగు, తమిళ, కన్నడ భాషల్లోనూ రీమేక్ చేశారు. తెలుగులో దీనిని 'శేఖర్' పేరుతో రాజశేఖర్ రీమేక్ చేయగా, జీవిత డైరెక్ట్ చేసింది. బట్.. మూవీ ఇక్కడ పరాజయం పాలైంది. సన్నీ డియోల్ పక్కన పెట్టిన మరో ప్రాజెక్ట్ 'బాప్'. ఈ సినిమా కూడా 'గదర్ -2' కంటే ముందుదే! సహజంగా ఏ హీరో నటించిన సినిమా అయినా విడుదలై ఘన విజయం సాధించగానే అతను నటించిన చిత్రాలు పాతవి ఆగిపోయి ఉంటే... ఓ ఊపులో అవీ జనం ముందుకు వచ్చేస్తుంటాయి. కానీ సన్నీ డియోల్ విషయంలో మాత్రం అలా జరగడం లేదు. 'బాప్' సినిమాలో సన్నీ తో పాటు సంజయ్ దత్, జాకీ ష్రాఫ్, మిథున్ చక్రవర్తి కీలక పాత్రలు పోషించారు. సినిమా షూటింగ్ దాదాపు పూర్తయిపోయిందని, ఈ సీనియర్ స్టార్స్ కాంబోలో కొన్ని సన్నివేశాలు మాత్రమే చిత్రీకరించాల్సి ఉందని దర్శకుడు అహ్మద్ ఖాన్ చెబుతున్నాడు. కానీ సన్నీ డేట్స్ కేటాయించక పోవడం వల్లే జాప్యం జరుగుతోందని ఆయన వాపోతున్నాడు.






## రాబిన్‌హుడ్ చిత్రంలో డేవిడ్‌వార్నర్ ఫస్ట్‌లుక్

హిట్టు ఫ్లాప్‌లతో సంబంధం లేకుండా వరుస సినిమాలు చేసుకుంటూ వెళుతున్నాడు నటుడు నితిన్. ఇప్పుడు ఆయన ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'రాబిన్‌హుడ్'. వెంకీ కుడుముల దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రంలో ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ అతిథి పాత్రలో కనిపించనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాబిన్‌హుడ్ చిత్రంలోని వార్నర్ ఫస్ట్‌లుక్‌ను నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఇవాళ విడుదల చేసింది. 'బౌండరీ నుంచి బాక్సాఫీస్‌కు వస్తున్న వార్నర్‌కు స్వాగతం' అంటూ పోస్టర్‌ను పంచుకుంది. ప్రస్తుతం ఈ పోస్టర్ వైరల్ అవుతోంది. భీష్మ సినిమా తర్వాత నితిన్ వెంకీ కుడుముల కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రంపై ప్రేక్షకులలో భారీ అంచనాలు ఉన్నాయి. శ్రీలీల కథానాయిక. ఈ సినిమా మార్చి 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదల తేదీ తగ్గరపడుతుండటంతో వరుసగా ప్రమోషన్స్ నిర్వహిస్తుంది చిత్రయూనిట్. ఇక ప్రమోషన్స్‌లో డేవిడ్ వార్నర్ కూడా పాల్గొంటాడని వెంకీ కుడుముల ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమాలో రాజేంద్రప్రసాద్, వెన్నెల కిషోర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## కార్ రేసింగ్ ట్రాక్ వద్ద శోభిత, నాగచైతన్య క్యూట్ ఫొటోలు

ప్రస్తుతం టాలీవుడ్ క్యూట్ కపుల్స్‌లో నాగ చైతన్య, శోభిత జంట ఒకటి. సమంత నుండి విడిపోయాక నాగ చైతన్య కొన్ని నెలల పాటు శోభితతో ప్రేమాయణం నడిపి గత ఏడాది వివాహం చేసుకున్నాడు. ఇక పెళ్ళైనప్పటి నుండి వీరిద్దరు చాలా సరదాగా గడుపుతున్నారు. సోషల్ మీడియాలో యాక్టీవ్ రోల్ పోషించే శోభిత ఎప్పటికప్పుడు వాటికి సంబంధించిన ఫోటోస్ షేర్ చేయడంతో వైరల్ అయ్యాయి. ఈ జంట ఆమ్‌స్టర్‌డామ్ , మెక్సికోలలో వీధి వీధి తిరుగుతూ సరదాగా ఎంజాయ్ చేశారు. ఉదయం బ్రేక్ ఫాస్ట్ నుండి సాయంత్రం వరకు ఎలా గడిపారో ఫోటోల ద్వారా తన అభిమానులకు తెలియజేసింది. అయితే తాజాగా ఈ జంట రేసింగ్ ట్రాక్‌పై సందడి చేసింది.తండేల్ సక్సెస్ తర్వాత నాగచైతన్య, శోభిత దంపతులు హాలిడే ట్రిప్ ఎంజాయ్ చేస్తుండగా, ఈ క్రమంలోనే కార్ రేసింగ్ ట్రాక్ వద్ద తమ డేను సరదాగా గడిపారు.చై, శోభిత కలిసి రేసింగ్ ట్రాక్‌లో గడిపిన క్షణాలను శోభిత సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. కాగా, చైతన్యకి రేసింగ్ అంటే చాలా ఇష్టం . అందుకే శోభితను సైతం అక్కడకు తీసుకెళ్లారు. ఆమెతో సరదాగా రేసింగ్ కారు నడిపారు. అంతే కాదండోయ్.. నాగ చైతన్య తనకు ఇష్టమైన రేసింగ్ కారులో శోభితను కూర్చోబెట్టి ఫోటోలు దిగగా, ఇవి నెటిజన్స్‌ని ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇక ఇటీవలే ఈ కపుల్ యూరప్ ట్రిప్ ఎంజాయ్ చేశారు. గతేడాది డిసెంబర్ 4న హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోలో శోభిత మెడలో మూడు ముళ్లు వేశాడు నాగ చైతన్య. ఓ ఇంటర్వ్యూలో ఆమెతో జీవితాన్ని పంచుకోవడం చాలా ఆనందంగా ఉందని.. తనతో అన్ని విషయాలు పంచుకుంటానని, ఎప్పుడైనా కన్ఫ్యూజ్ అయితే వెంటనే ఆమె సలహా తీసుకుంటానని నాగ చైతన్య స్పష్టం చేశారు. తండేల్ సక్సెస్ జోష్ లో ఉన్న నాగ చైతన్య ఇప్పుడు చాలా జోష్‌తో కనిపిస్తున్నారు. భార్య శోభితని తీసుకొని పలు ప్రాంతాలకి తిరుగుతున్నాడు. ఈ కొత్త జంటను ఇలా చూసి అక్కినేని ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. క్యూట్ కపుల్ ఎంజాయ్ చేయండి అంటూ కామెంట్లు చేస్తున్నారు.



Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com